ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




గురువారం 30 జూలై 2026
సంపుటి: 28 సంచిక: 114
Thursday 30 July 2026
Vol.No 28 Issue No .114
హైదరాబాద్
Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## 22ఎ,ప్రజా రక్షణా? లేక ప్రజా దోపిడీనా?





మిగతా10లో..

## ఫ్యామిలీ రిజిస్టర్ - ఆశలు రేపి, ఆశాభంగం చేస్తున్న సర్టిఫికెట్

- ఎఫ్ ఆర్ సి: రికార్డా? రుజువా?
- 22ఎ తర్వాత ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నారా?

మిగతా2లో..




Ammalenu,
takattu pettalenu?

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- వాడీవేడీ చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదం
- విపక్షాల సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం
- పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదన్న జితేంద్ర సింగ్
- బిల్లు ఆమోదంతో లోక్‌సభ నేటికి వాయిదా

న్యూఢిల్లీ,జూలై29 : వాడీవేడీ చర్చలు..విమర్శలు ప్రతివిమర్శలు, ఆక్షేపణల మధ్య పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాల ను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశాలను మిగతా2లో..




## గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

- ఉత్పాదక సామర్థ్యం మెరుగు పర్చాలి
- చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ కమిటీతో సిఎస్ చర్చలు

హైదరాబాద్,జూలై29 : రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను మిగతా2లో..



## అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీ-సేవ

- డిజిటల్ సేవల విస్తృతి, ప్రమాణాలు పెంచాలి
- అధికారులతో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్,జూలై29 : ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు మీ–సేవ మిగతా2లో..

## దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

- 48 మంది ఉద్యోగులకు ఈవోలుగా పదోన్నతి
- ప్రభుత్వ పనితీరుకు దేవాదాయ శాఖ పనితీరే నిదర్శనం
- ఉద్యోగుల హక్కులను కాపాడటంలో ముందుంటాం
- దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే చర్యలు
- ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులు, రివార్డులు
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్,జూలై29 : దేవాదాయశాఖ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, అర్చకుల సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలుచేస్తున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు తెలిపారు. ఈ రోజు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్(ఆడిటోరియం వేదికగా జరిగిన ఉద్యోగుల పదోన్నతుల కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరిలో 48 మంది ఉద్యోగులు గ్రేడ్ 3 ఈవోలుగా, ఇద్దరు గ్రేడ్ 2 ఈవోలుగా, ఒకరు గ్రేడ్ 1 ఈవోలుగా మంత్రి సురేఖ గారి చేతులు మీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందుకున్నారు. వీరితో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా అర్హులైన 15 మంది అర్చకులకు (వారి కటుంబ సభ్యులు) పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీ, వివాహ రుణం మంజూరు ఉత్వర్వులను మంత్రి సురేఖ గారు అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరక్టర్ హనుమంతరావు, రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ డైరక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, ఆర్‌జెసి రామకృష్ణారావు, డిప్యూటి కమిషనర్ వినోద్ మిగతా2లో..



## సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

### కాంగ్రెస్ బిఎల్ఎలకు భట్టి ఆదేశం

న్యూఢిల్లీ,జూలై29 :ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ఎ÷–లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులుగా హక్కు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. మిగతా2లో..



## కాళేశ్వరంపై కెటిఆర్ మాటలు సిగ్గుచేటు

- వారి హయాంలోనే కట్టడం..కూలడం చూశాం
- దీనిపై ఇంకా సమర్థించుకోవడం సిగ్గుచేటు
- ఎన్‌డీఎస్ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

న్యూఢిల్లీ,జూలై29 :కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారని అన్నారు. వారి హయాంలోనే కట్టడం, కూలడం రెండూ జరిగాయని అన్నారు. దీనిపై ఇంకా సమర్థించుకునే చర్యలు సిగ్గుచేటని అన్నారు. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య మిగతా2లో..



## పేపర్ లీక్ నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ


- రాహుల్ ఈడియట్ పదంపై సభలో గందరగోళం
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికార పార్టీ ఎంపిలు
- ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదు... భావ వ్యక్తీకరణ
- పేపర్ లీక్‌పై బిజెపి ఎంపిల పిల్లలనే అడగండి చెబుతారు
- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చలు రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ,జూలై29 : లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. విద్యార్థుల ఆందోళనపై లోక్‌సభలో ప్రసంగించిన ఆయన.. ఆర్ఎస్ఎస్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సమయంలో ఆయన ఉపయోగించిన ఓ పదంపై తీవ్ర దుమారం రేగింది. రాహుల్ వ్యాఖ్యలపై భాజపా ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై లోక్‌సభలో బుధవారం కూడా వాడీవేడి చర్చ కొనసాగించింది. ఈ చర్చలో భాగంగా రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. మిగతా2లో..



మిగతా2లో..

# నేరచరిత్ర గొడ్డలి పార్టీ నేతది



- అందులో చేరిన వారంతా నేర చరితులే
- సాక్ష్యాలను తారుమారు చేసిన వ్యక్తికి పరామర్శలా
- ఏం మెజేస్ ఇద్దామని పరామర్శలకు వెళతారు
- జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు

అమరావతి,జూలై29 : వ్యవస్థలు నిర్మాణం చేద్దామనే సంకల్పంతో ఎవరైనా రాజకీయాల్లోకి వస్తారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కానీ వ్యవస్థల్ని నాశనం చేయటమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ అధినేత ఉన్నారంటూ వైఎస్ జగన్‌పై ఆయన మండిపడ్డారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా తాజా పరిణామాలపై వారు చర్చించారు. శ్రీకాకుళం జైలులో ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజును గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించనున్నారనే విషయాన్ని సీఎం దృష్టికి మిగతా2లో..

## బంగాళాఖాతంలో మునిగిపోయిన వారు చేసే వ్యాఖ్యలు

- ఎల్‌నినోతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లిస్తున్నాం
- హైడ్రాపై కెటిఆర్ వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల కౌంటర్

హైదరాబాద్,జూలై29 : హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ మిగతా2లో..



## రెండు దశాబ్దాల పరారీకి తెర

- జార్ఖండ్‌లో మావోయిస్టు పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్ బేస్రా అరెస్ట్
- మావోయిస్ట్ కంచుకోటలో కీలక పరిణామం,
- భద్రతా బలగాల ఉచ్చులో మోస్ట్ వాంటెడ్ అగ్రనేత ,
- ఇక కేంద్ర కమిటీ మావోయిస్టు సభ్యులు లేరు

**చర్ల, జూలై 29 (విజన్ ఆంధ్ర):** దేశంలో ఉప్పెనలా సాగిన వామపక్ష తీవ్రవాద ఉద్యమంలో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. భద్రతా బలగాలకు దశాబ్దాలుగా సవాల్‌గా మారుతూ వచ్చిన మోస్ట్ వాంటెడ్ మావోయిస్ట్ అగ్రనేత పోలీసుల వలకు చిక్కారు. సీపీఐ మావోయిస్ట్ పార్టీకి ఇది కోలుకోలేని ఎదురుదెబ్బగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పోలీసుల కంటిలో కారం కొట్టి దట్టమైన అడవుల్లో రెండు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న ఒక అగ్రనేత కథ ఎండగట్టింది. జార్ఖండ్‌లో భద్రతా బలగాలు చేపట్టిన మెరుపు దాడితో మావోయిస్టు పార్టీకి ఊహించని కోలుకోలేని దెబ్బ తగిలింది. సుమారు నాలుగు దశాబ్దాల పాటు తుపాకీ నీడలో బతికిన కీలక నేత ఎట్టకేలకు ఖాకీల వలసలో చిక్కుకున్నాడు.

### దేవన్ ముర్ము సమాచారంతోనే అరెస్ట్

జార్ఖండ్ పోలీసులు సీఆర్‌పీఎఫ్ కోబ్రా బలగాలు అత్యంత గోప్యంగా ఈ ప్రత్యేక మిగతా2లో..



మిసిర్ బెస్రా (ఫైల్ ఫోటో)



మిసిర్ బెస్రా (ప్రస్తుతం)

## వైభవంగా అంబర్ పేట మహంకాళి బోనాలు

- ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి
- ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు



హైదరాబాద్,జూలై29 : అంబర్‌పేట్ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర మిగతా2లో..

## ప్రజల భద్రత, వన్యప్రాణుల సంరక్షణకు సమాన ప్రాధాన్యం

- మానవ, ఏనుగు సంఘర్షణలకు శాస్త్రీయ పరిష్కారంగా గుచ్చిమి ఎలిఫెంట్ క్యాంప్ ,
- ఆధునిక సాంకేతికతతో మన్యంలో అటవీ ఏనుగుల సమస్యకు పరిష్కారం,
- రైతుల పంటలు, ప్రజల ప్రాణాలకు రక్షణకు కీలక ముందడుగు,
- గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని వర్చువల్ గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్

అమరావతి, జులై 29 : ప్రకృతి మనకు చెందినది కాదు... మనమే ప్రకృతికి చెందినవాళ్లం. అందుకే ప్రకృతితో సామరస్యంగా జీవించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. ప్రజల భద్రతతోపాటు వన్యప్రాణుల సంరక్షణపైనా ప్రభుత్వానికి బాధ్యత ఉంది. అదే దృక్పథంతో మానవ, ఏనుగు సంఘర్షణలను తగ్గించడానికి గుచ్చిమి ఎలిఫెంట్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామ'ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, మిగతా2లో..



## రెండు దశాబ్దాల పరారీకి తెర

ఆపరేషన్‌ను నిర్వహించాయి. ధన్‌బాద్ గిరిడిహ్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఈ ఉచ్చు బిగించారు. సీపీఐ మావోయిస్టు పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్ బేస్రాతో పాటు రీజినల్ కమిటీ సభ్యులు మెహనత్ అలియాస్ మొచ్చు విభీషణ్, ముర్ము గౌరవ్ అలియాస్ సౌరభ్‌లను బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. పట్టుబడ్డ కొందరిపై భారీ నజరానా ఉంది. మొత్తంగా ఈ ఆపరేషన్‌లో ఐదుగురు అరెస్టయ్యారు. మంగళవారం రాంచీలో మావోయిస్టు కేడర్ సభ్యులు అధికారుల ఎదుట లొంగిపోవడం ఈ ఆపరేషన్‌కు ప్రధాన మలుపుగా మారింది. లొంగిపోయిన వారిలో మిసిర్ బేస్రాకు అత్యంత సన్నిహిత అంగరక్షకుడిగా ఉన్న దేవన్ ముర్ము అలియాస్ శనిచర్వా కూడా ఉన్నాడు.అతడు ఇచ్చిన పక్కా సమాచారమే భద్రతా బలగాలకు దిక్సూచిలా పనిచేసింది. దీంతో పోలీసులు క్షణాల వ్యవధిలో ప్రణాళిక మార్చి మిసిర్ బేస్రాను కట్టడి చేశారు. గిరిడిహ్ జిల్లా పిర్తాండ్ ప్రాంతానికి చెందిన మిసిర్ బేస్రా దశాబ్దాల క్రితం మావోయిస్టు ఉద్యగంలోకి అడుగుపెట్టాడు. భాస్కర్ అలియాస్ సునిర్మల్ అలియాస్ సాగర్ అనే పేర్లతో కూడా ఈయన సుపరిచితుడే. జార్ఖండ్, బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో భద్రతా బలగాలపై దాడులు హత్యలు, ఐఈడీ పేలుళ్లు, వసూళ్లకు సంబంధించి ఈయనపై భారీ సంఖ్యలో కేసులు నమోదై ఉన్నాయి. గతంలో పోలీసులు ఈయన్ను అరెస్ట్ చేసినప్పటికీ మావోయిస్టుల దాడుల సమయంలో పోలీసుల చెరనుంచి పారిపోయాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు పోలీసులకు దొరకకుండా తిరుగుతున్నాడు. ప్రస్తుతం అరెస్టయిన ఈ అగ్రనేతల నుంచి సంస్థ కార్యకలాపాలు ఆయుధాల నిల్వలు నిధుల సమీకరణ మార్గాలు వ్యూహాలపై భద్రతావర్గాలు లోతుగా విచారిస్తున్నాయి. ఈ పరిణామంతో మావోయిస్టు సంస్థకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలినట్లయింది. ప్రస్తుతం మావోయిస్ట్ సంస్థలో ఉన్న అత్యంత సీనియర్ మరియు తుది దశ నాయకులలో ఈయన ఒకరు కావడంతో, ఈ పరిణామం ఆ సంస్థ వెన్నువిరిచినట్లయింది. ప్రస్తుతం అదుపులోకి తీసుకున్న నేతలను రహస్య ప్రాంతానికి తరలించి కేంద్ర నిఘా వర్గాలు లోతుగా విచారిస్తున్నాయి. మావోయిస్టుల తదుపరి ప్రణాళికలు, అజ్ఞాతంలో దాచిపెట్టిన ఆయుధాలు అలాగే వారికి నిధులు సమకూరుస్తున్న కీలక వ్యక్తుల వివరాలపై ఈ విచారణలో మరిన్ని సంచలన విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

## బంగాళాఖాతంలో మునిగిపోయిన వారు చేసే వ్యాఖ్యలు

సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

## సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

బీఎల్‌ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్‌ఏలను నియమించినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ పక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ÷ూఎఖీ పక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ఎస్ఐఆర్ పక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

ఆదేశించారు. రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు పంట విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం గురువారం సచివాలయం లో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు. రి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026?27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు, చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు లభ్యతను మెరుగుపరచేందుకు ఇతర రాష్టాల్లో్ర అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను తక్షణమే సమర్పించాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.మావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ, చెరకు రైతులకు కూడా వరి రైతులకు అందిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం అందించాలని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ కూలీల కొరత రైతులకు ప్రధాన సవాళ్లుగా మారాయని వివరించారు. చెరకు ద్వారా చక్కెరతో పాటు ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుందని పేర్కొంటూ, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీ-సేవ

వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం మీ-సేవ విభాగం పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, ఈ-గవర్నెన్స్ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల పురోగతిని సిఎస్ సమీక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి మీ-సేవ ద్వారా అందించే సేవల పరిధిని మరింత విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 33 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక సేవలు మీ-సేవ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను ఈ వేదికలో చేర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు డేటా ఆధారిత పరిష్కారాలను మీ-సేవ వ్యవస్థతో అనుసంధానించి, ఈ-గవర్నెన్స్ సేవలను ప్రజల ముంగిటకు మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనన్ని ఎక్కువ సేవలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సమయానుకూలమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి, మీ-సేవను దేశంలోనే ఆదర్శవంతమైన పౌర సేవల వేదికగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, మీ-సేవ డైరెక్టర్ రవికిరణ్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ రిజిస్టర్ - ఆశలు రేపి, ఆశాభంగం చేస్తున్న సర్టిఫికెట్

ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో,జులై 29, (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్' పై రాష్ట్రవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. మీసేవలో, ఆన్‌లైన్ లో, యాప్ ద్వారా సులభంగా వస్తుందని ప్రచారం జరగడంతో "ఇదేమైనా కొత్త ఆస్తి పత్రమా" అనే ఆశ ప్రజల్లో మొదలైంది. కానీ ప్రభుత్వమే తాజాగా ఇచ్చిన క్లారిటీతో ఆ ఆశలన్నీ ఒక్కసారిగా బద్దలయ్యాయి. ప్రభుత్వం స్పష్టంగా చెబుతోంది ఎఫ్ ఆర్ సి అనేది కేవలం కుటుంబ వివరాల రికార్డు మాత్రమే అని. ఈ సర్టిఫికెట్ తో ఆస్తి హక్కు రాదు, వారసత్వ హక్కు రాదు, ఏ సంక్షేమ పథకానికి అర్హత కూడా రాదు. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డ్ నంబరే ఎఫ్ ఆర్ సి నంబర్ గా కొనసాగుతుందని చెప్పడంతో "మరి కొత్తగా ప్రభుత్వం ఇచ్చేది ఏమిటి, ఫీజు ఎందుకు కడుతున్నాం" అనే ప్రశ్నలు ప్రజల నుండి వస్తున్నాయి. ఇక్కడే అసలు సందేహం మొదలవుతోంది. ఇప్పటికే లిసెక్షన్ 22ఎలి లాంటి చట్టాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు. యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు. రాహుల్, ప్రియాంక, అఖిలేశ్, గొగోయ్ తదితరులు బిల్లుపై మాట్లాడారు.

## దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

రెడ్డి, అడిషనల్ కమిషనర్లు జ్యోతి, శ్రీనివాస్, ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, టెంపుల్ ఎంఎ÷-లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవాళ గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతులు అందుకున్నవారితో కలిపి, గతంలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 కేటగిరీల్లోనూ పదోన్నతులు ఇవ్వడం ద్వారా మొత్తం 168 మంది ఉద్యోగులకు కార్యనిర్వహణాధికారులుగా పదోన్నతి కల్పించి, ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సరిగ్గా పది రోజుల క్రితం రవీంద్రభారతి వేదికగా

## నేరచరిత్ర గొడ్డలి పార్టీ నేతది

పార్టీ నేతలు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన స్పందించారు. వ్యవస్థల నిర్మాణం చేసే వాళ్లు చట్టాలను గౌరవిస్తూ వాటికి లోబడి నడుచుకుంటారని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కానీ గొడ్డలి పార్టీ నేతలకు చట్టాలంటే గౌరవం లేదన్నారు. గొర్రెల కాపరి చనిపోతే సాక్ష్యాలు తారుమారు చేసి ఇంకొకరి జీవితాన్ని బలి చేద్దామనుకున్న వారిని పరామర్శించడం ద్వారా సమాజానికి ఏం మెసేజ్ ఇస్తారంటూ వైసీపీ అధినేత తీరును ఎండగట్టారు. గతంలో కారు చక్రాల కింద వ్యక్తి నలిగిపోతే కనీసం అతడిని ఆసుపత్రికి తీసుకెళ్దామనే మానవత్వం కూడా గొడ్డలి పార్టీ అధినేతకు లేదని

## పేపర్ లీక్ నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ

విద్యార్థుల ఆందోళన విషయంలో కేంద్రం తీరుపై విమర్శలు గుప్పించారు. యువత ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. వారి సెంటిమెంట్‌ను అన్ని పార్టీలు గౌరవించాయి. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్న విద్యార్థులు పేపర్ లీక్ వంటి ఘటనలతో ఆందోళనకు గురయ్యారు. తీవ్ర వేదన తర్వాతే ఢిల్లీ వేదికగా నిరసనలు చేపట్టారు. శాంతియుత నిరసన చేస్తున్న వారిని రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారు. ఆందోళన చేసిన వారితో నేను మాట్లాడాను. వారు చెప్పిన మాటలు నన్ను కదిలించాయి. మూర్ఖులు ఎవరి మాటలు వినరని విద్యార్థులు నాతో చెప్పారు. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు తమ ఆవేదనను పట్టించుకోవడం లేదని బాధపడ్డారని రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే, రాహుల్ ప్రసంగంపై భాజపా ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో అభ్యంతరకర మాటలు మాట్లాడుతున్నారని, విద్యార్థుల పేరు చెప్పి ఎంపీలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో కేంద్రం, విపక్ష నేత మధ్య ఒకింత వాగ్వాదం నెలకొంది. దీంతో స్పీకర్ దాన్ని తొలగించారు. చదువు అనేది ప్రస్తుతం ఖరీదైన వ్యాపారంగా మారింది. విద్యార్థుల కోసం నేడు తల్లిదండ్రులు లక్షలు ఖర్చుపెడుతు న్నారు. కానీ, విద్యావ్యవస్థ క్రూరంగా మారింది. ప్రైవేటీకరణ విచ్చలవిడిగా జరుగుతోంది. ఇక, ఈ వ్యవస్థ నడిపిస్తోంది

## పజల భద్రత, వన్యప్రాణుల సంరక్షణకు సమాన ప్రాధాన్యం

పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం గుచ్చిమిలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని పవన్ కళ్యాణ్ బుధవారం వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జ్ మంత్రి వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. అడవి ఏనుగుల సంచారాన్ని సమర్థవంతంగా నియంత్రించడం, ప్రజల ప్రాణాలు, రైతుల పంటలను రక్షించడం, దశాబ్దాల నుంచి ఉన్న మానవ?ఏనుగు సంఘర్షణను నివారించడమే లక్ష్యంగా ఈ శిబిరం పని చేయనుంది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు గ్రామాల్లోకి ప్రవేశించడం, రైతుల పంటలను ధ్వంసం చేయడం, ప్రజలు రాత్రివేళ భయాందోళనల మధ్య జీవించడం వంటి సమస్యలు పార్వతీపురం మన్యం జిల్లాలో చాలా కాలంగా కొనసాగుతున్నాయి. ఉత్తరాంధ్రలో




పడుతున్నారు. ఎన్‌ఓసి కోసం తహసీల్దార్ ఆఫీస్ నుండి కలెక్టరేట్ వరకు నెలల తరబడి తిరగాల్సి వస్తోంది. లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. అలాంటి సమయంలో "ఇది కేవలం రికార్డే" అనే సర్టిఫికెట్ ను ఎందుకు తీసుకురావాల్సి వచ్చింది అనేది ఎవరికీ అర్థం కావడం లేదు. ప్రజలు ఆశగా మీసేవకు వెళ్లి, ఫీజు కట్టి, గంటల తరబడి లైన్ లో నిలబడి తెచ్చుకున్న తర్వాత "ఇది ఏ పనికీ పనికిరాదు" అంటే మిగిలేది తీవ్ర నిరాశ తప్ప మరేమీ ఉండదు. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే కావచ్చు. కుటుంబ డేటాను క్రోడీకరించి పారదర్శకత

## వైభవంగా అంబర్ పేట మహంకాళి బోనాలు

సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 9న అంబర్ పేట్ మహంకాళి ఆలయంలో అమ్మవారి బోనాలు జరగనున్నందున ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిహెచ్ఎంసి, ట్రాన్స్ కో, పోలీస్, జలమండలి, వైద్యారోగ్యశాఖ, కల్చరల్ డిపార్ట్ మెంట్ లు సమన్వయంతో విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ బోనాలకు అధికసంఖ్యలో భక్తులు పాల్గొంటున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ బోనాల ఉత్సవాలను తెలంగాణ ప్రజలు అత్యంత వైభవోపేతంగా జరుపుకుంటారని, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరుగుతున్నాయని అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, సాక సమర్పణ, తొ÷-టటెల ఊరేగింపులు, పోతురాజుల వీరంగాలు, రంగం కార్యక్రమాలు, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. ఆలయాల మౌలిక వసతుల మెరుగుదల, భక్తులకు సౌకర్యాల కల్పన, విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సీసీ కెమెరాలు, క్యూలైన్లు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా భారీ రద్దీ ఉండే దేవాలయాల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు, అదనపు బస్సులు, వైద్య బృందాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. వృద్ధుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాదాయశాఖ పై, దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించినందుకు సీఎంకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వేదపండితులు, అర్చకులు, పరిచారకులు, డోలు, సన్నాయి కళాకారులు తదితర 191 ధార్మిక నియామక ఉత్తర్వులు అందజేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అర్చక సంక్షేమ నిధి కింద పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడంతో పాటు అంత్యక్రియల సహాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచి అర్చక కుటుంబాలకు మరింత భరోసా కల్పించామని మంత్రి తెలిపారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామని, గోదావరి పుష్కరాలు (2027), కృష్ణ పుష్కరాలు (2028) కోసం ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు పుష్కరాలు అంటే తెలంగాణ అనే స్థాయిలో రానున్న పుష్కరాలు

అన్నారు. పుట్టిన రోజులకు గొడ్డళ్లతో జంతు బలులు చేసి రాక్షసానందం పొందే హింసా ప్రవృత్తి ఆ పార్టీదని ఆయన అభివర్ణించారు. నేరాల నియంత్రణకు 2014-19 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అయితే 2019-24 మధ్య వాటికి మెయింటెనెన్స్ లేకపోవడంతో అవి నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే.. వాటన్నింటినీ పునరుద్ధరించటంతో నేరస్తుల్ని సాక్ష్యాలతో సహా పట్టుకోగలుగుతు న్నామని వివరించారు. రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ చనిపోతే.. దానిని హత్యగా చిత్రీకరించి రాజకీయంగా ప్రభుత్వంపై బురద చల్లాలని చూశారని వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా సీఎం

ఆర్ఎస్ఎస్. ధర్మేంద్ర ప్రధాన్ కేవలం సింబల్ మాత్రమే. విద్యార్థులకు అసలైన శత్రువు ఈ సంస్థే. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకే ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉంటోంది. ఆఖరికీ వర్సిటీల్లోనూ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లనే వీసీలుగా నియమించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను కూడా అధికార సభ్యులు తీవ్రంగా ఖండించారు. అనంతరం విద్యార్థులపై పోలీసుల చర్యను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఎందుకు ప్రయోగించారని ప్రశ్నించారు. ఆందోళనకారులను అణచివేయాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించారని ఆరోపించారు. సభకు రావడానికి హోంమంత్రికి ధైర్యం లేదంటూ విమర్శించారు. దీంతో సభలో మరోసారి గందరగోళం నెలకొంది. రాహుల్ గాంధీ ఇలాంటి ఆరోపణలు ఎలా చేస్తున్నారు? అమిత్ షా పేరును ప్రస్తావించేందుకు ఆయన వద్ద ఏం ఆధారాలున్నాయి? రాహుల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హోంమంత్రికి క్షమాపణలు చెప్పాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. ఇ కపోతే పేపర్ లీక్‌పై ఏం జరిగిందో తెలుసుకోవాలంటే బీజేపీ నేతలు, వారి పిల్లలను అడగాలంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదని.. భావ వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేశారని తెలిపారు. విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. విద్యార్థుల ఆందోళనను రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు గౌరవించాలని రాహుల్ పిలుపునిచ్చారు. తీవ్ర వేదన తర్వాతే

పర్యటిస్తున్నప్పుడు పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ, కొంత మంది స్థానిక ప్రజలు సమస్యను నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యతగా భావించి గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాను ఏర్పాటు చేశాం. ఉత్తరాంధ్రలో మానవ, ఏనుగు సంఘర్షణల నివారణలో ఈ కేంద్రం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది. గతంలో పలమనేరు ప్రాంతంలో చేపట్టిన క్లిష్టమైన ఆపరేషన్లలో కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యుతో పాటు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థంగా పని చేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా మానవ?ఏనుగు సంఘర్షణల కారణంగా సంభవించే మరణాలను 70 శాతానికి పైగా తగ్గించడంతోపాటు, పంట నష్టాలను కూడా గణనీయంగా తగ్గించగలిగారు. అదే విజయాన్ని ఇప్పుడు పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పం. మనుషులు, ఏనుగులు మధ్య సామరస్య సహజీవనానికి వేదికగా ఈ గుచ్చిమి ఏనుగుల క్యాంప్ నిలవాలనే ఆశతో దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం

తీసుకురావడం కోసం అయి ఉండవచ్చు. కానీ ఆ సర్టిఫికెట్ యొక్క పరిమితులను మొదటి నుండే పెద్ద అక్షరాలతో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎఫ్ ఆర్ సి ని ఆయుధంగా కాకుండా సమాచార సాధనంగా మాత్రమే చూడాలి. లేకుంటే ఇది కూడా మరో ఎన్‌ఓసి లాగా పైరవీలకు, మధ్యవర్తుల బిల్లింగ్ లకు కొత్త దారి తీసే ప్రమాదం ఉంది. భవిష్యత్ లో ఇది మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. రేపు "మా దగ్గర ఎఫ్ ఆర్ సి సర్టిఫికెట్ ఉంది కాబట్టి ఈ ఆస్తి మాదే" అని కొత్త భూ గొడవలు మొదలయ్యే ప్రమాదం ఉంది. కోర్టులకు, రెవెన్యూ ఆఫీసులకు మరిన్ని కేసులు వెళ్తాయి. అప్పుడు "రికార్డు వేరు, హక్కు వేరు" అని అధికారులు చేతులు దులుపుకుంటే సామాన్యుడు ఎవరి దగ్గరికి వెళ్లి న్యాయం అడగాలి. కాబట్టి ప్రభుత్వం వెంటనే ఎఫ్ ఆర్ సి యొక్క అసలు విలువ ఏమిటి, ఇది దేనికి ఉపయోగపడదు అనేది ప్రతి గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేయాలి. సర్టిఫికెట్ పైనే "ఇది హక్కు పత్రం కాదు" అని స్పష్టంగా ముద్రించాలి. లేకుంటే రికార్డు పేరుతో ప్రజల ఆశలతో ఆడుకోవడమే అవుతుంది. రికార్డు అవసరమే కానీ ఆ రికార్డు ప్రజలకు ఉపయోగపడేలా, గందరగోళం సృష్టించకుండా ఉండాలి. లేకుంటే 22ఎ తర్వాత ఎఫ్ ఆర్ సి కూడా తెలంగాణ ప్రజలకు మరో తలనొప్పిగా మారడం ఖాయం.

## కాళేశ్వరంపై కెటిఆర్ మాటలు సిగ్గుచేటు

వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేజీలో 2..3 టీఎంసీలు నిల్వ చేయమంటే 10 టీఎంసీలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఎ÷-లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాపర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు. హైడ్రాపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

చేపడతామని మంత్రి సురేఖ అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాదాయ శాఖలో సంస్కరణల యుగానికి శ్రీకారం చుట్టామని, నియామకాలు, పదోన్నతులు, ఉద్యోగుల సంక్షేమం, భక్తులకు మెరుగైన సేవలు, ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేస్తూ, దేవాదాయశాఖను మరో స్థాయిలో నిలబెట్టేలా కార్యక్రమాలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దశాబ్దాల నిరీక్షణకు తెరపడడంతో ఈవోలుగా పదోన్నతులు అందుకున్న ఉద్యోగులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన గుర్తింపు లభించడంతో వారంతా మంత్రి కొండా సురేఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు గుర్తు చేశారు. సీసీ టీవీ ఆధారాలు అన్నీ బయటపెట్టే సరికి తోక ముడిచారంటూ ఆ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేర ప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి.. దానిని ఎదుటి వారిపై రుద్దాలని చూస్తారని వ్యాఖ్యానించారు. అలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారని పేర్కొన్నారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్తుల్ని పరామర్శించటమే పనిగా గొడ్డలి పార్టీ అధినేత వైఎస్ జగన్ చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. నేరప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి ఎదుటివారిపై రుద్దాలని చూస్తారు. అలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్థుల్ని పరామర్శించడమే గొడ్డలి పార్టీ పనిగా పెట్టుకుంది' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

విద్యార్థులు ఆందోళన చేశారని.. కానీ వారి నిరసనను కేంద్రం అర్థం చేసుకోలేదని విమర్శించారు. కేంద్రం మూర్ఖంగా వ్యవహరించిందన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులను రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారని మండిపడ్డారు. మూర్ఖులు ఎవరి మాటలు వినరని.. ప్రభుత్వంలో ఉన్నవారు తమ ఆవేదనను పట్టించుకోరని విద్యార్థులు చెప్పారన్నారు. వారి ఆవేదనను పట్టించుకోలేదనే విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని వివరించారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి, హింసించారని మండిపడ్డారు. పేపర్ లీక్ వార్తతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని.. వారి ఆవేదనను అర్థం చేసుకున్నందునే వారి పక్షాన మాట్లాడుతునట్లు రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగాన్ని బీజేపీ ఎంపీలు అడ్డుకున్నారు. ఇడియట్స్ అనే పదాన్ని రాహుల్ వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహించారు. రాహుల్ తన భాషను మార్చుకోవాలని కిరణ్ రిజిజు అన్నారు. విద్యార్థుల పేరుతో అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. దీంతో ప్రతిపక్ష నేత వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు.బీజేపీ ఎంపీల వ్యాఖ్యలపై రాహుల్ మాట్లాడుతూ.. 'నేను ఎంపీలను విమర్శించలేదు. బీజేపీ ఎంపీలు కావాలనే నా ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారు. సభలో కేవలం బీజేపీ ఎంపీలే మాట్లాడాలనడం సరికాదు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేస్తున్నాను. కర్ణాటక ప్రజలు, ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలుపార్వతీపురం జిల్లాలో ఈ రోజు మనం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామంటే దానికి ప్రధాన కారణం కర్ణాటక ప్రభుత్వం, అక్కడి ప్రజలు అందించిన సహకారం. మన విజ్ఞప్తిని గౌరవించి, ఎంతో ఆప్యాయతతో నాలుగు కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించడం వారి గొప్ప మనసుకు, స్నేహభావానికి నిదర్శనం. ఏనుగులను ఇవ్వడం అనేది సంపద ఇచ్చినట్లు అక్కడ ప్రజలు భావిస్తారు. అయినా తెలుగు ప్రజల రక్షణ కోసం ప్రేమతో కుంకీ ఏనుగులను మన రాష్ట్రానికి పంపించిన కర్ణాటక ప్రభుత్వం, ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి డి కె శివకుమార్ కి, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకి, అప్పటి అటవీశాఖ మంత్రి, ప్రస్తుత పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. వారి సహకారం, స్నేహభావం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత పెంచాయి" అన్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# పరీక్షల బిల్లుతో సమస్య సమిసిపోయేనా?

పిల్లికి చెలగాటం...ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా మన పరీక్షల విధానం మారింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్ష లీక్‌తో మన పరీక్షల విధానం ఎంత డొల్లగా ఉందో తేలిపోయింది. డబ్బులకు కక్కుర్తి పడే లెక్చరర్లు ఉండడం దౌర్భాగ్యం. విద్యార్థులు ఏమైతేనేమి మనకు కాసులు రాలుతున్నాయని పేపర్లను లీక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలి నీట్ పేపర్ లీక్‌తో కాక్రోచ్ పార్టీ ఉద్భవించింది, అంతే స్పీడ్‌గా ఇప్పుడు పార్లమెంటులో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో గమనించిన విషయమేమిటంటే విపక్షాలకు కూడా పకడ్బందీ విధానం ఎలా అమలు చేయాలన్న దానిపై అవగాహన లేదని తేలిపోయింది. చర్చలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, గగోయ్, అఖిలేశ్ యాదవ్‌ల విమర్శలు చేశారే తప్ప పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేయలేకపోయారు. కాక్రచ్ ఉద్యమాన్ని ముందుకేసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక సూచనలు చేయలేదు. ప్రభుత్వం కూడా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పకడ్బాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే మంత్రి రాజీనామాతోనే భ్రష్టుపట్టిన మన దేశ విద్యా వ్యవస్థ మారిపోదు. పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకలు, అవినీతి వంటి సమస్యలు తొలగిపోవాలంటే పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ఎందుకంటే పేపర్ లీకేజీలకు మూలం డబ్బుల మాయగా ఉంది. ఈజీగా డబ్బు సంపాదించే క్రమంలో ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. మెడికల్ కాలేజీల ప్రవేశానికి లక్షల మంది రాసే పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చట్టబద్ధతను సమీక్షించాలి. వాస్తవానికి ఎన్టీఏ అనేది ఒక అకడమిక్ బాడీ కూడా కాదని ఎంతమందికి తెలుసు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన సంస్థ అంతకన్నా కాదు. కేవలం కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ మాత్రమే అని ఇక్కడ గుర్తించాలి. దానికంటూ స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఏమీ లేవు. అలాంటి సంస్థకు దేశంలోని నీట్‌తో సహా అనేక ప్రవేశ పరీక్షలను, పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ఈ కారణంగా దేశ విద్యారంగాన్నంతా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకునే అధికారాల కేంద్రీకరణ విధానం. అందువల్లనే పరీక్షలలో అక్రమాలు, అవకతవకలు, అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయి. నీట్ కోచింగ్ సెంటర్స్‌ను నిర్వహిస్తున్న వారే నీట్ పేపర్ సెట్టర్స్‌గా అవతారమెత్తారంటే ఎన్టీఏ కేంద్రంగా కోచింగ్ మాఫియా ఏ స్థాయిలో బలంగా వేళ్లూనుకుందో చెప్పవచ్చు. ఈ విధమైన వేల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారం సాగుతుంటుంది. అధికారుల అండదండలు లేకుండా ఇది జరుగుతుందని అనుకోవడానికి లేదు. అందువల్ల ఈ ఎన్టీఏ స్థానంలో ప్రస్తుతం బిల్లు ఏ రకంగా ఉంటుందో తెలియదు. పార్లమెంటులో చర్చ సాగుతున్నా సీరియస్‌నెస్ కానరావడం లేదు. బిల్లులో కేంద్రాన్ని విమర్శించడం తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అయ్యాయి. కావున ఎన్టీఏ ఉనికిని, దాని చుట్టూ బలంగా అల్లుకొని ఉన్న అవినీతి వ్యాపార బ్రద్దలు కొట్టాలి. లేదంటే కంటితుడుపు చర్యగా పేపర్ లీకేజీలో దళారి పాత్ర పోషించిన కొద్దిమంది నేరస్తులను బలి ఇవ్వడం, ఎన్టీఏలోని కొద్దిమంది అధికారులను తొలగించడం వంటి కసరత్తుగా మిగిలి పోతుంది. ఇంత ఆగ్రహం, ఆందోళన చెలరేగిన నేపథ్యంలో అసమర్థ ఎన్టీఏను రద్దుచేసి, తిరిగి రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ అడ్మిషన్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించాలనే డిమాండ్ ను కూడా పునఃపరిశీలించడం అవసరం. ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, రాజ్యాంగ ఫెడరల్ సూత్రాలను కాలరాస్తున్న విద్యా కేంద్రీకరణ విధానానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. పేపర్ లీకేజీ సమస్య అనేది నేడు కొత్తగా తలెత్తినది కాదు. గతంలో కూడా మెడికల్, ఇంజినీరింగ్, వంటి కోర్సులకు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలోనూ అక్రమాలు, అవకతవకలు, లీకేజీలు చోటుచేసుకున్నాయి. చదువులంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కోర్సులు అన్న భావన బలపడి పోయింది. జేఈఈ, నీట్ పరీక్షలలో మంచి ర్యాంకులు పొందడమే మహా యజ్ఞమైంది. మిగతావన్నీ కొరగానివిగా, అర్హతకుల చదువులుగా భావించే అపోహ బలపడ్డాయి. ఇదే అదనుగా కోచింగ్ సెంటర్లు పుట్టుకు వచ్చాయి. కోటలల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చేశాయి. ప్రైవేట్ రంగం విజృంభించడానికి ఇలాంటి నీట్ పరీక్షల విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. దీనికితోడు సమాజంలో నిరుద్యోగం, ఉపాధి లేమి అంతకంతకూ పెరుగుతుండడంతో పిల్లల భవిష్యత్తు యెడల అంతులేని అభద్రతాభావం తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఈ పరిస్థితులే కార్పొరేట్ విద్యకు, కోట్ల వ్యాపారానికి, కోచింగ్ సెంటర్ల మాఫియా ముఠాలకు కేంద్రాలుగా మారాయి. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసులుబాట్లను ఉపయోగించుకుంటారు. అందువల్ల సమగ్ర విద్యావిధానంపై చర్చించి, విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలకు నడుంబిగించాలి. కనీసం విపక్షాలయినా ఈ బిల్లు సందర్భంలో ప్రమాణాలపై చర్చివుంటే బాగుంటుంది.

## బాలనగర్ అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పూజలు సతీష్ నాయర్ విగ్రహ ఆవిష్కరణ



జడ్చర్ల / బాలానగర్, జులై 29, (విజన్ ఆంధ్ర): జడ్చర్ల నియోజకవర్గం బాలనగర్ మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయాన్ని బుధవారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సంక్షేమం, ప్రజల సుభిక్షత కోసం ఎమ్మెల్యే ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీ శ్రీ శ్రీ గురుబ్రహ్మ సతీష్ నాయర్ గురుస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేద మంత్రాల మధ్య గురుస్వామి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలతోనే "భూగర్భ జల సంరక్షణ"

**-జలమండలి జీఎం మహేందర్**

**-ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రిలో ఇంకుడు గుంత నిర్మాణానికై శంకుస్థాపన**



ఎల్బీనగర్, జులై 29 (విజన్ ఆంధ్ర): భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా జలమండలి విభాగం పనిచేస్తుందని, ఇంకుడు గుంతలతోనే జల సంరక్షణ సాధ్యమవుతుందని జలమండలి జీఎం మహేందర్ పేర్కొన్నారు. బుధవారం ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రి ఆవరణలో సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమానికి అసిస్టెంట్ డైరెక్టర్ ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి డాక్టర్ జాల సత్యనారాయణ, కామినేని హాస్పిటల్ అడ్మిన్, సీఈవో గోకుల్ రఘురాం, గ్రూప్ హెడ్ కొడతాల సత్యనారాయణ తదితర ప్రముఖులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ప్రతి ఇంట్లో, ఇనిస్టిట్యూట్ లో తప్పని సరిగా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. భారీ ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టినందుకు కామినేని హాస్పిటల్ వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కామినేని హాస్పిటల్ లో ఎండిన బోర్ ను ఇంజక్షన్ వెల్ క్రింద మార్చేందుకు కొబ్బరి కాయ కొట్టి భూమి పూజతో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం టి సాయినాథ్, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ టి సురేందర్, మేనేజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసిన టీజీఎస్పీ 3వ బెటాలియన్ అధికారులు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై (విజన్ ఆంధ్ర): తెలంగాణ స్పెషల్ పోలీస్ మూడో బెటాలియన్ అధికారులు, సిబ్బంది ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాష, అసిస్టెంట్ కమాండెంట్లు ఎం.వీరయ్య, ఆర్.పాండులు, వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవాల కోసం ఆగస్టు 3న బెటాలియన్ కు రావాలని వారు ఎమ్మెల్యే కు ప్రత్యేకంగా ఆహ్వానం అందజేశారు. నాగన్ పల్లి రోడ్డు నుంచి బెటాలియన్ గేటు వరకు హెచ్ఎండీఏ నిధులతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిర్మించిన అప్రోచ్ రోడ్డు పూర్తికాగా, ఈ మేరకు వారు తొర్రూర్ లోని క్యాంపు కార్యాలయంలో మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి తమ సంతోషం వ్యక్తం చేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగానే 3వ తేదీన అప్రోచ్ రోడ్డు ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే, అదే రోజు నుంచి ఇంటర్నల్ బెటాలియన్ స్పోర్ట్స్ మీట్ జరగనున్నందున ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ఏ ఫైల్ అంశాన్ని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గత డిసెంబర్ లో గ్రేటర్ హైదరాబాద్ పరిధి విస్తరణ నేపథ్యంలో పెరిఫరీ 8 కిలోమీటర్లలోపు తమ బెటాలియన్ ఉన్నందున, కలెక్టర్ వద్ద ఉన్న ఇంటి అద్దె పెంపు ఫైల్ ను త్వరగా నోటిఫై చేయించాల్సిందిగా కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఫోన్లో కలెక్టర్ తో చర్చించారు. ఎమ్మెల్యే చొరవ పట్ల బెటాలియన్ అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. మల్ రెడ్డిని కలిసిన వారిలో రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు రవీందర్, యుగేందర్, శేఖర్, యూనిట్ వైద్యాధికారి రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంజాపూర్ లో ఉచిత వైద్య శిబిరం



రంగారెడ్డి/అబ్దుల్లాపూర్ మెట్, జూలై (విజన్ ఆంధ్ర): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండలం ఇంజాపూర్ గ్రామంలో బంధన్ బ్యాంక్ సౌజన్యంతో జుబిలెంట్ భారతీయ ఫౌండేషన్ ఇంజాపుర్ బొడ్రాయి సమీపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

**ఎఫ్.ఎస్ డెంటల్ స్టూడియో ఆధ్వర్యంలో....**

ఇంజాపూర్ వార్డు ఆఫీసు సమీపంలో ఎఫ్.ఎస్ డెంటల్ స్టూడియో ఆధ్వర్యంలో డాక్టర్ మొహమ్మద్ హరూన్ మాలిక్ ఉచిత డెంటల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి దంత పరీక్షలు నిర్వహించి మందులం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి సాయిబాబా దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు



ఎల్బీనగర్, జూలై 29 (విజన్ ఆంధ్ర): గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ కాలనీలోని సాయిబాబా దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, టెంపుల్ ట్రస్ట్ మెంబెర్ ముడుపు సందీప్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గంగం శివశంకర్, మనోజ్ గౌరీ శెట్టి, ముప్వా సతీష్ చౌద్దరి, అర్జున్ గౌడ్, మధుకర్ రెడ్డి,అమరేందర్ రెడ్డి,పోగుల రాంబాబు, సంతోష్ రావు, వెంకటరమణ,ముత్యం రావు, పంది కృష్ణ, శ్రీశైలం, రాజు యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, బోయపల్లి శ్రీకాంత్ రెడ్డి, ప్రకాష్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పండ్ల మార్కెట్ హమాలీల గోసలు తీర్చండి

**-సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్**



అబ్దుల్లాపూర్ మెట్, జూలై (విజన్ ఆంధ్ర): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అబ్దుల్లాపూర్ మెట్ మండలం బాటసింగారంలోని పండ్ల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీల బాధలు విని వారి సమస్యలు పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర ధరలకి అనుకూలంగా హామీలల రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐటియుసి అనుబంధ సంఘం ఫ్రూట్ మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గడ్డి అన్నారం, బాట సింగారం ఫ్రూట్ మార్కెట్ కమిటీ కార్యదర్శికి పలు రకాల డిమాండ్లు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు సిపిఐ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ హాజరై మాట్లాడుతూ... పండ్ల మార్కెట్ లో హమాలీల కష్టం కొండంత అయితే ఫలితం మాత్రం పిడికడంత మాత్రమే అని అన్నారు. అత్యంత అధికశ్రమని కార్మికులు చేస్తున్నారని, ఒక డిసిఏం బత్తాయి దిగుమతి చేయాలంటే సుమారు ఏడు గంటల సమయం పడితే పైసలు మాత్రం 500 నుండి 800 వరకు మాత్రమే ఇస్తు శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బొలెరో వాహనం దిగుమతి చేయాలంటే 3 గంటలు పడుతుంటే ఆదాయం మాత్రం 300 నుండి 400 మాత్రమే ఇస్తున్నారని, అలాగే అనార్ ఒక బాక్స్ కి ఎనిమిది రూపాయలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈ రేట్లు హమాలీలకు సరిపోక చాలామంది హమాలీలు పనుల్లోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ 2024లో ఇచ్చిన ప్రొసీడింగ్స్ కి అదనంగా 30 శాతం రేట్లు పెంచి హమాలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో హమాలీలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్టు మండల్ సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, గడ్డి అన్నారం బాటసింగారం ఫ్రూట్ మార్కెట్, ప్రధాన కార్యదర్శి, చిన్న గౌడ్, ఉపాధ్యక్షులు శంకర్ నాయక్, కోశాధికారి పోశయ్య, నాయకులు మల్లేష్, సూరి యాదవ్, రామ్ రెడ్డి, భాస్కర్, రమేష్, హమ్జాత్, షరీఫ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య ప్రక్రియలో పారదర్శకమైన విధి నిర్వహణ ముఖ్యం

**- అబ్దుల్లాపూర్ మెట్ మండల తహశీల్దార్ బైరు సుదర్శన్ రెడ్డి**



అబ్దుల్లాపూర్ మెట్, జూలై (విజన్ ఆంధ్ర): ప్రజాస్వామ్య ప్రక్రియలో పారదర్శకమైన, పక్కా ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన విధులు నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండలం తహశీల్దార్ బైరు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మండల కార్యాలయంలో నిర్వహించిన బి ఎల్ ఓ, బి ఎల్ ఎల ప్రత్యేక సమావేశానికి సుదర్శన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ.... ఓటు అనేది ప్రతి పౌరుడు హక్కు, ఆ హక్కును సదరు ఓటరుకు కల్పించవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన సిబ్బందికి సూచించారు. నిర్ణీత గడువులోగా నిర్వహించి తలపెట్టిన అటువంటి ప్రతి పనిని బాధ్యతాయుతంగా నిర్వహించి వృత్తి ధర్మాన్ని చాటుగాలని ఆయన పునరుద్ఘాటించారు. సర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ చేయడానికి వచ్చేనెల ఆగస్టు మూడవ తేది లోపు ఇటు ప్రజలకు, అటు రాజకీయ పార్టీలకు స్పష్టమైనటువంటి సూచన చేయాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటివరకు అబ్దుల్లాపూర్ మేట్ మండలంలో మొత్తం 33410 ఓట్లకు కాను 25384 ఓట్లు (అనగా 76 శాతం) డిజిటలైజేషన్ పూర్తి కావడం ఒక అంత అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. మిగిలిన రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన సర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి నూటికి నూరు శాతం ప్రక్రియను పూర్తి చేయాలని బి ఎల్ ఏ, బి ఎల్ ఓలకు ఎమ్మార్వో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- మండల ప్రత్యేక అధికారి నూకరాజు**



గద్వాల జూలై 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి నూకరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి నిర్వహించే మండల సమావేశంలో భాగంగా ఈరోజు గద్వాల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి నూకరాజు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, మండలంలోని అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో, ఎంపీవోలు మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాల అమలు, వివిధ శాఖల పనుల పురోగతిపై తమ ప్రగతి నివేదికలను సమర్పించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారి,మిషన్ భగీరథ ఏఈ, మండల విద్యాధికారి (ఎంఈఓ), రెవెన్యూ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు,ఏపీఓ, ఏపీఎం,ఐసీడీఎస్ సూపర్వైజర్, పశుసంవర్ధక శాఖ అధికారి, హౌసింగ్ ఏఈ తదితరులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. అలాగే గౌరవ సభ్యులు ప్రస్తావించిన వివిధ సమస్యలు, ప్రజా అవసరాలపై స్పందిస్తూ తగిన వివరణలు అందించారు. రానున్న రెండవ మండల సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పూర్తి స్థాయి ఎజెండా అంశాలతో హాజరుకావాలని, ప్రతి అధికారి తన విధులను సేవా నియమావళి (సర్వీస్ రూల్స్)కు అనుగుణంగా బాధ్యతాయుతంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,వీబీజీ రామ్–జీ సిబ్బంది,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## తరుణ్ మృతిపై ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా

గద్వాల జూలై 29 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి తరుణ్ ఆత్మహత్య ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ డిమాండ్ చేశారు. విద్యార్థి ఆత్మహత్యకు కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ లెక్చరర్‌పై వెంటనే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని ఆయన కోరారు. అలాగే తరుణ్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. తరుణ్ మృతికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థి మరణ ఘటనపై న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు.



## ఒగ్గు కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువు దేవునమ్మకు ఘన సన్మానం

కళను కాపాడుతున్న గురువును స్మరించుకున్న జిల్లా కళాకారులు..

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,జులై 29, (విజన్ ఆంధ్ర): నాగర్‌కర్నూలు జిల్లా ఒగ్గు కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు తమ గురువు, చారగొండ మండలం రాంపురం దేవుని బండ వద్ద కొలువుదీరిన దేవునమ్మను ఘనంగా సన్మానించారు. ఒగ్గు కళను నిలబెట్టి యువతకు నేర్పిస్తున్న ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు తర్నికల్ బిర్ల రాజు, కార్యదర్శి నాగపూర్ కురుమయ్య, తాడూరు చిన్నయ్య, అల్లిపురం మల్లయ్య, నాగపూర్ మల్లయ్య, మరికల్ రాజు, మరికల్ పర్వతాలు, పవన్ తదితరులు పాల్గొన్నారు. గురువు దేవునమ్మను కలిసి ఆశీర్వాదం తీసుకున్న కళాకారులు మాట్లాడుతూ, ఒగ్గు కళ అనేది తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని, దీనిని కాపాడే కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలు, ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సన్మానం అనంతరం భజనలు, ఒగ్గు పాటలతో ప్రాంగణం మొత్తం భక్తిమయంగా మారింది. కళాకారులంతా తమ గురువుతో కలిసి ఫోటోలు దిగి సంతోషం వ్యక్తం చేశారు.

## పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్‌ను సత్కరించిన దేప భాస్కర్ రెడ్డి

ఎల్బీనగర్, జూలై (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్ మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్ ఆధ్యాత్మిక చింతన కలిగినటువంటి మహోన్నత వ్యక్తి అని ప్రశంసించి శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, సమాజంలోని నిరుపేద బ్రాహ్మణ కుటుంబాల సంక్షేమానికి, వారి పురోగతికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పందుల వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, జ్ఞానేశ్వర్ యాదవ్, అక్బర్, నవి, శ్రీమన్నారాయణ, భాస్కర్, రఘు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీలో భారీ చేరికలు

***-ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రాయబంటి పాండురంగాచారి***



ఎల్బీనగర్, జూలై 29 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీ నిరంతరం ప్రజా హక్కుల సాధనకై పోరాటం సాగిస్తుందని ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రాయబంటి పాండురంగాచారి పేర్కొన్నారు. బుధవారం కొత్తపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో రాయబండి పాండురంగచారి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుడు, పోరాటాల నాయకుడు కళ్యాణకర్ శ్రీనివాస్ పార్టీ కార్యక్రమాలు, పోరాటాల వైపు ఆకరిస్థితులై వ్యక్తిగత ప్రయోజనాల కన్నా పార్టీ ప్రయోజనాల మిన్నగా భావించి పార్టీలో చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.... తనపై నమ్మకంతో ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీలోకి ఆహ్వానించిన తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రాయబండి పాండురంగాచారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలో ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీని బలోపేతం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు తూచా తప్పకుండా పార్టీని రాజ్యాధికారం వైపు తీసుకెళ్తానని శ్రీనివాసులు తెలియజేశారు.

## అల్కాపురి సాయిబాబా మందిరంలో దేప భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజలు



ఎల్బీనగర్/సరూర్ నగర్, జూలై 29 (విజన్ ఆంధ్ర): మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ మండలం రామకృష్ణపురం డివిజన్‌లో అల్కాపురి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ చిలుక ఉపేందర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత, డివిజన్ అధ్యక్షులు ధనరాజ్ గౌడ్, ముప్పిడి లింగస్వామిగౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, యాదవరెడ్డి, రామకృష్ణగౌడ్, రాజు, కృష్ణరావు, ప్రధాన అర్చకులు జయంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వే వేగంగా పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ టి. వినోద్ కుమార్ ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 29 (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ భూ రీ-సర్వే పనులను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఏదుల మండలం రేకులపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద జరుగుతున్న రీ-సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిజిటల్ మ్యాపింగ్, భూ సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను తనిఖీ చేసి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేందుకు సర్వేయర్లు ప్రతిరోజూ ఉదయం నుంచే క్షేత్రస్థాయిలో పని చేయాలని తెలిపారు. రైతులు, గ్రామస్తుల సహకారంతో సర్వే నిర్వహించి, వారి సందేహాలను అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను కోరారు. భూ రీ-సర్వే ద్వారా దశాబ్దాలుగా ఉన్న సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆధునిక సాంకేతికతతో ప్రతి రైతు భూమి ఖచ్చితంగా నమోదవుతుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వేయర్ శ్రీనివాసులు, ఏదుల తహసీల్దార్, సర్వే బృందాలు, గ్రామ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పీఎం శ్రీ పనులు వేగంగా పూర్తి చేయాలి

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 29 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టిన పీఎం శ్రీ పథకం నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం వనపర్తి పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి జాప్యం లేకుండా పనులు వేగవంతం చేయాలని సూచించారు. పనులు పూర్తయ్యే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సైన్స్ ల్యాబ్, అదనపు తరగతి గదులు త్వరలోనే విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జెడ్పీ సీఈవో యాదయ్య, ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌కు బీఎల్ఏల సహకారం అవసరం

**- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్**



వనపర్తి జిల్లా ప్రతినిధి,జులై 29 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100% పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల బీఎల్ఏలు సహకరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ కోరారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 85% ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని, వనపర్తి పట్టణంలో మాత్రం 68% మాత్రమే పూర్తయిందని తెలిపారు. మిగిలిన ఓటర్లను గుర్తించి ఫారాలు అందజేసేందుకు పార్టీల ప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు. బీఎల్ఏలు బీఎల్ఓలతో సమన్వయం చేసుకుని అందరూ ఫారాలు సమర్పించేలా చూడాలన్నారు. ఆగస్టు 3తో ఫారం స్వీకరణ ముగుస్తుందని, ఆగస్టు 10న ముసాయిదా ఓటర్ జాబితా, సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలు, అక్టోబర్ 12న తుది జాబితా ప్రకటిస్తామని వివరించారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ఇప్పటివరకు 4 దరఖాస్తులు వచ్చాయని, మరిన్ని సూచనలు ఉంటే తెలపాలని కోరారు. సమావేశంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ(ఎం), లోక్ సత్తా పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పదోన్నతి బాధ్యతను పెంచుతుంది

**- హెడ్ కానిస్టేబుళ్లకు బ్యాడ్జీలు అలంకరించిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 29 (విజన్ ఆంధ్ర) : పోలీసు శాఖలో పదోన్నతి అంటే హోదా పెరగడమే కాదు, ప్రజాసేవలో మరింత బాధ్యతను స్వీకరించడమేనని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన 5 మంది సిబ్బందికి ఎస్పీ హోదా చిహ్నాలైన బ్యాడ్జీలను అలంకరించి అభినందనలు తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో వనపర్తి టౌన్ కు చెందిన రాజుగౌడ్, నాగేశ్వరరావు, పానుగల్ కు చెందిన లక్ష్మీ నర్సమ్మ, రాంగోపాల్ వర్మ, పెబ్బేరు కు చెందిన నాగరాజు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి అనేది ప్రజలు, శాఖ తమపై ఉంచిన విశ్వాసానికి గుర్తింపు అని పేర్కొన్నారు. హోదా పెరిగే కొద్దీ ప్రజల పట్ల బాధ్యత, చట్ట పరిరక్షణలో పాత్ర కూడా పెరుగుతుందని తెలిపారు. పోలీసు శాఖ ప్రతిష్ఠను నిలబెట్టే ఆదర్శ అధికారులుగా ఎదగాలని, క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించాలని పదోన్నతి పొందిన సిబ్బందికి సూచనలు చేశారు.

# భీమా స్టేజీ-2 నుంచి సాగునీరు విడుదల

**- 92 వేల ఎకరాలు లబ్ధి రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కొండంత అండ**

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**





వనపర్తి జిల్లా ప్రతినిధి,జులై 29 (విజన్ ఆంధ్ర) : భీమా స్టేజ్2 నుంచి దిగువ ప్రాంతాలకు సాగునీటిని బుధవారం అధికారికంగా విడుదల చేశారు. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి మరియు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శివసేన రెడ్డిలతో కలిసి ప్రాజెక్టు నుంచి నీటిని కిందకు వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. భీమా స్టేజి-2 ద్వారా సుమారు 92 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గినా, రైతులు నష్టపోకూడదనే ముందస్తు ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి ఎకరాకూ నీరందించడమే లక్ష్యంగా సరఫరా నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ వైఖరిపై విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వం

దూరదృష్టితో నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేడు లక్షలాది ఎకరాలకు నీరు అందుతోందని ఆయన గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త ప్రాజెక్టూ నిర్మించలేదని, కాంగ్రెస్ కష్టాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# వర్షపాతం వివరాలు ఖచ్చితత్వంతో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

**- నూతన కలెక్టర్ క్యాంపు కార్యాలయ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం**



నిర్మల్ జిల్లా,జూలై 29,(విజన్ ఆంధ్ర); జిల్లా వ్యాప్తంగా నమోదయ్యే వర్షపాతం వివరాలను ఖచ్చితత్వంతో ఎప్పటికప్పుడు నమోదు చేసి సంబంధిత శాఖలకు సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూగర్భ జలాల కొలతల కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షపాతం, భూగర్భ జలాల వివరాల నమోదు విధానాన్ని పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా వివరాలను నమోదు చేయాలని సూచించారు. అనంతరం నిర్మల్ గ్రామీణ మండలం అక్కాపూర్ గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రం ప్రాంగణంలో ఉన్న వర్షపాత మాపక కేంద్రంను తనిఖీ చేశారు. వర్షపాతం కొలత, నమోదుకు అనుసరిస్తున్న విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షపాతం వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు సంబంధిత శాఖలకు వేగంగా చేరవేయాలని ఆదేశించారు. ప్రతి నమోదు శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రఅనంతరం ఎల్లపల్లి సమీపంలోని నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన పనుల వివరాలను తెలుసుకుని, మిగిలిన పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలలో సీపీవో గంగారెడ్డి, తహసిల్దార్ ప్రభాకర్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, హైడ్రో జియాలజిస్ట్ వంశీకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పులుల సంరక్షణలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలి

**-అంతర్జాతీయ పులుల దినోత్సవంలో మంత్రి కొండా సురేఖ పిలుపు**

**-పులిని కాపాడితే ప్రకృతిభావితరాల భవిష్యత్తు రక్షితమే**

**-అమ్రాబాద్‌లో పెరిగిన పులుల సంఖ్య.. కవ్వాల్‌లో రీఇంట్రడక్షన్‌కు చర్యలు**

**-ప్రపంచ పులుల్లో 75 శాతం భారత్‌లోనే ఉన్నాయని మంత్రి వెల్లడి**



కుత్బుల్లాపూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర): పులుల సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి పౌరుడు భాగస్వామిగా ముందుకు రావాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. భూమి కేవలం మనుషుల నివాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి ఆవాసమని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఆమె సూచించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులుల ఫొటో ప్రదర్శనను పరిశీలించడంతో పాటు, పులుల సంరక్షణపై రూపొందించిన లఘు చిత్రాన్ని వీక్షించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా పులుల సంరక్షణపై అవగాహన పెంచడంలో కీలక వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని కాపాడటమంటే అడవులు, పర్యావరణం, జీవవైవిధ్యం, భావితరాల భవిష్యత్తును రక్షించడమేనని పేర్కొన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో ఒక దశలో పులుల సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని అమలు చేయడంతో పాటు, 1973లో ప్రాజెక్ట్ టైగర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. ఆ చర్యల ఫలితంగానే ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం భారత్‌లోనే ఉన్నాయని, దేశవ్యాప్తంగా 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కూడా పులుల సంరక్షణలో ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి పేర్కొన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రముఖ అభయారణ్యాలుగా నిలిచాయని చెప్పారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వులో పులుల సంఖ్యను పెంచేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానం చేసి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తున్నట్లు వివరించారు. అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అటవీశాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. పచ్చని తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన శిక్షణార్థులను ఉద్దేశించి అటవీ సంపదను పరిరక్షించడంలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో విశేష సేవలందించిన అటవీశాఖ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. అలాగే అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. దండా రాజిరెడ్డి, పీసీసీఎఫ్ (డెవలప్‌మెంట్) రత్నాకర్ జౌహరి, టీఎస్ఎఫ్ఏ డైరెక్టర్ ప్రియాంక వర్గీస్, సీసీఎఫ్ ఎన్. క్షితిజ్, టైగర్ సెల్ రీసెర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవ్వాల్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

# తాడూరులో నూతన తహసీల్దార్ కార్యాలయానికి స్థల పరిశీలన

**- ప్రతిపాదనలు వెంటనే పంపించాలి**

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



తాడూర్ రిపోర్టర్ (విజన్ ఆంధ్ర) జూలై 29 బుధవారం : నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూర్ మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బుధవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 644లో ఉన్న ఒక ఎకరం ప్రభుత్వ భూమిని సందర్శించి, కార్యాలయ నిర్మాణానికి అనుకూలత, రవాణా సౌకర్యం, భవిష్యత్ విస్తరణ అవకాశాలు తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన పరిపాలనా సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అందులో భాగంగానే ఆధునిక వసతులతో కూడిన నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తాడూర్ మండల ప్రజలకు అన్ని రెవెన్యూ సేవలు ఒకేచోట, సౌకర్యవంతమైన వాతావరణంలో అందుబాటులో ఉండేలా కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.కార్యాలయ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలానికి సంబంధించిన భూ వివరాలు, సాంకేతిక అంశాలు, అవసరమైన నివేదికలను త్వరితగతిన పూర్తి చేసి, నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన ప్రతిపాదనలను వెంటనే ఉన్నతాధికారులకు పంపించాలని, నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ అమలుపై తహసీల్దార్‌ను జిల్లా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎన్నికల జాబితాల డిజిటలైజేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తయిందని తహసీల్దార్ కలెక్టర్‌కు వివరించారు. సంబంధిత రికార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రక్రియకు సంబంధించిన పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు.అనంతరం తాడూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహాయం, పరిపాలనా సహకారం అందిస్తూ నిర్మాణాలు ఎక్కడా నిలిచిపోకుండా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాడూరు తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 26 లక్షల ఇంటి చోరీ కేసు ఛేదన

***స్నేహితుడే దొంగ - కరీంనగర్ రూరల్ పోలీసుల అరెస్ట్, రూ.17.60 లక్షల స్వాధీనం***



కరీంనగర్, జులై 29 విజన్ ఆంధ్ర : కరీంనగర్ రూరల్ పోలీసులు ఒక భారీ ఇంటి చోరీ కేసును విజయవంతంగా ఛేదించారు. ఈ నేరానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి, రూ.17.60 లక్షల నగదు, నేరానికి ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.మాణిక్యేశ్వరి నగర్, తీగలగుట్టపల్లికి చెందిన గుడిమల్ల శ్రీనివాస్ ఇంట్లో రూ.26 లక్షల నగదు చోరీకి గురైంది. శ్రీనివాస్ పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఏక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ఉప అరణ్యశాఖ అధికారి. ఆయన ఇటీవల వ్యవసాయ భూమి అమ్మగా వచ్చిన నగదును ఇంట్లో దాచిపెట్టారు. దర్యాప్తులో బాధితుడి చిన్ననాటి స్నేహితుడు తగరం శంకర్ లాల్ (49) ఈ చోరీకి పాల్పడినట్లు తేలింది. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న శంకర్ లాల్, శ్రీనివాస్ ఇంట్లో నగదు ఉన్న విషయం, తాళంచెవి ఎక్కడ ఉంటుందో ముందే తెలుసుకున్నాడు.జూన్ నెలలో శంకర్ లాల్, పరారీలో ఉన్న అదెపు రేష్మతో కలిసి ఇంటికి వచ్చాడు. అదనపు తాళంచెవి దొరకపోవడంతో ప్రధాన తలుపు, బాత్‌రూమ్ తాళాలు పగులగొట్టి, బాత్‌రూమ్‌లో ప్లాస్టిక్ డ్రమ్ కింద దాచిన అట్టపెట్టెలో ఉన్న రూ.26 లక్షలను దొంగిలించాడు. చోరీ సమయంలో రేష్మ అక్కడే ఉండి సహకరించింది.నేడు బొమ్మకల్ బస్ స్టాప్ వద్ద వాహన తనిఖీల్లో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డిమరియు సిబ్బంది శంకర్ లాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించాడు. స్వాధీనం చేసుకున్నారు స్వాధీనం చేసుకున్న వివరాలు తెలియజేశారు 17,60,000 నగదు మరియు షిఫ్ట్ కార్ ఒక శాంసంగ్ మొబైల్ ఫోన్పరారీలో ఉన్న ఎ-2 రేష్మ కోసం గాలింపు కొనసాగుతోంది. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నారుపోలీస్ కమిషనర్ అభినందనఈ కేసును ఛేదించిన బృందాన్ని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంఆదేశాల మేరకు రూరల్ సహాయ కమిషనర్ విజయ్ కుమార్ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఉప ఇన్‌స్పెక్టర్ ఎ. లక్ష్మారెడ్డి మరియు సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు ఎక్కువ మొత్తంలో నగదు, విలువైన వస్తువులను ఇంట్లో దాచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని పోలీసులు సూచించారు.

# దేశ భద్రత బీజేపీతోనే సాధ్యం

**- బీజేపీ సీనియర్ నేత మున్నూరు రవీందర్**

**- మరో 20 ఏళ్లు బీజేపీ పాలనే**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 29 (విజన్ ఆంధ్ర) : దేశానికి బీజేపీయే దిక్సూచి అని, రాబోయే 20 సంవత్సరాలు కూడా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు, న్యాయవాది మున్నూరు రవీందర్ అన్నారు. బుధవారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 1947 నుంచి 1996 వరకు కాంగ్రెస్ దేశాన్ని పాలించిందని, ఆ కాలంలో దేశాన్ని ఉగ్రవాదులకు, ఇతర దేశాలకు తాకట్టు పెట్టే కుట్రలు జరిగాయని ఆరోపించారు. 1996 నుంచి బీజేపీ పాలనలో దేశం సురక్షితంగా ఉందని, 2014 నుంచి ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో శాంతిభద్రతలు కాపాడుతూ 140 కోట్ల ప్రజలకు భరోసా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశంపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని, పేపర్ లీకేజీని అరికట్టేందుకు బీజేపీ ప్రభుత్వం 10 కోట్ల జరిమానా, 10 ఏళ్ల జైలు శిక్షతో కూడిన కఠిన చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. తెలంగాణలోనూ పేపర్ల లీకేజీ, పైపులైన్ లీకేజీలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వంశపారంపర్య రాజకీయాలు చేస్తోందని, బీజేపీలో అలాంటివి లేవని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపడుతోందని అన్నారు. యువతకు దేశంలోనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, కాంగ్రెస్ కుట్రలను యువత తిప్పికొడుతుందని మున్నూరు రవీందర్ ధీమా వ్యక్తం చేశారు.

# ‘జనతా వికాస్ పార్టీ‘ ఏర్పాటు

**- దేశానికి ప్రత్యామ్నాయ వేదిక మురళీధర్ గుప్తా**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 29 (విజన్ ఆంధ్ర) : దేశానికి ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను అందించేందుకు ‘జనతా వికాస్ పార్టీ‘ని ఏర్పాటు చేసినట్లు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్యాల మురళీధర్ గుప్తా ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జూలై 20న హయత్‌నగర్ 14వ వార్డులోని పార్టీ కార్యాలయంలో జరిగిన వ్యవస్థాపక సభ్యుల జనరల్ బాడీలో తనను జాతీయ అధ్యక్షుడిగా, పొలుమూరి హర్షవర్ధన్‌ను జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఎం. అభినయ్‌ను జాతీయ కోశాధికారిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మేధావులు, విద్యావంతులు, రైతులు, సామాజిక కార్యకర్తల భాగస్వామ్యంతో పార్టీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన విద్య, వైద్యం అందించడం, వ్యవసాయానికి ప్రాధాన్యత, మహిళా సాధికారత, యువతకు ఉపాధి, ప్రభుత్వ ఖాళీల భర్తీ, పారిశ్రామిక అభివృద్ధి, దేశ సమగ్ర అభివృద్ధి పార్టీ ప్రధాన లక్ష్యాలని వివరించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు ఆసిరెడ్డి, ఇస్రంపల్లి సుదర్శన్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.


# వర్ష ప్రభావిత ప్రాంతాల్లో భరత్ సింహ రెడ్డి పర్యటన

***అభివృద్ధి పనుల పరిశీలన , నీటిమునిగే సమస్యకు శాశ్వత పరిష్కారంపై అధికారులకు ఆదేశాలు***



కుత్బుల్లాపూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల డివిజన్, కుత్బుల్లాపూర్ డివిజన్, పద్మా నగర్ డివిజన్ పరిధిలో వర్ష ప్రభావిత ప్రాంతాలను బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి బుధవారం పరిశీలించారు. జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌తో కలిసి జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులో కొనసాగుతున్న వర్షపు నీటి కాలువ (స్టార్మ్ వాటర్ డ్రెయిన్) నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గాయత్రి నగర్, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించిన భరత్ సింహ రెడ్డి, వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నీటి నిల్వ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు.

# సికింద్రాబాద్‌శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్‌కు భూసేకరణ పూర్తి దశలో




కుత్బుల్లాపూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సికింద్రాబాద్ శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఐదు గ్రామాలకు సంబంధించిన భూసేకరణలో ఇప్పటికే నాలుగు గ్రామాల్లో ప్రక్రియ పూర్తికాగా, చివరిదైన అల్వాల్ గ్రామంలో కూడా పరిహారం ఖరారుతో ప్రక్రియ ముగింపు దశకు చేరింది. ప్రాజెక్టు పరిధిలోని పోతాయిపల్లి, లోతుకుంట, తూంకుంట గ్రామాల్లో భూసేకరణ విజయవంతంగా పూర్తయింది. అల్వాల్ గ్రామానికి సంబంధించి నిర్వహించిన జిల్లా స్థాయి భూసేకరణ చర్చల కమిటీ (డీఎల్ఎన్‌సీ) సమావేశంలో భూములకు గజానికి రూ.1,10,000 చొప్పున పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. డీఎల్ఎన్‌సీ తీసుకున్న నిర్ణయంపై భూ యజమానులు హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా యంత్రాంగానికి సహకారం అందిస్తామని తెలిపారు. పరస్పర అవగాహనతో భూసేకరణ ప్రక్రియ పూర్తి కావడం ప్రాజెక్టు పురోగతికి ఎంతో దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. చివరి గ్రామమైన అల్వాల్‌లో కూడా భూసేకరణ ప్రక్రియ ముగింపు దశకు చేరుకోవడంతో, వచ్చే నెల లేదా నెలన్నర రోజుల్లో అర్హులైన భూ యజమానులందరికీ పరిహారం చెల్లించేందుకు అధికారులు చర్యలను వేగవంతం చేశారు. అనంతరం మిగిలిన నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసి, ఈ ప్రతిష్టాత్మక ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్ణీత గడువులో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు వెల్లడించారు.

# రైస్ మిల్లర్లపై విజిలెన్స్ దాడులు నిలిపివేయాలి.

**- మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేసిన బాదం ప్రవీణ్.**



ములుగు జూలై 28, విజన్ ఆంధ్ర ప్రతినిధి : రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్లపై ఉద్దేశపూర్వకంగా విజిలెన్స్ దాడులు చేస్తున్నారని లిరైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్లి ఆరోపించారు. ఈ దాడులను వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ములుగు జిల్లా రైస్ మిల్లర్లు అందరూ కలిసి మంత్రి దనసరి అనసూయ సీతక్కను కలిసి తమ గోడు వెలిబుచ్చారు. రైస్ మిల్లర్లపై జరుగుతున్న విజిలెన్స్ దాడులను ఆపేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క వెంటనే పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ఫోన్ చేసి మాట్లాడారు. రైస్ మిల్లర్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లిబాదం ప్రవీణ్లి మాట్లాడుతూ, ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధిగా పనిచేస్తూ సన్న బియ్యం పథకాన్ని విజయవంతం చేస్తున్నామని తెలిపారు. అయితే సన్న ధాన్యం నుండి అవుట్ టర్న్ తక్కువగా రావడం, మిల్లు కెపాసిటీకి మించి ధాన్యం ఇవ్వడం, బియ్యం తీసుకోకపోవడం వంటి కారణాలతో నష్టాలు వస్తున్నాయని వివరించారు. ధాన్యంలో సహజంగా వచ్చే తరుగును సాకుగా చూపి కేసులు పెడుతూ పరిశ్రమను కుప్పకూల్చే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని సమస్యలు ఉన్నా రైతుల కోసం మిల్లర్లు పనిచేస్తున్నారని, అలాంటి వారిపై దాడులు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి విజిలెన్స్ దాడులు నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సహోదరి రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్ తో పాటు జిల్లా రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## ‘హస్తినలో తెలుగు వెలుగు’ వేడుకల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం




శేరిలింగంపల్లి.జూలై 29: (విజన్ ఆంధ్ర) : న్యూఢిల్లీ, జూలై 29: తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ప్రతిష్ఠాత్మక ‘జాతీయ విశిష్ట సేవా పురస్కారం’ ప్రదానం చేసింది .న్యూఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ భవన్లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించిన ‘హస్తినలో తెలుగు వెలుగు’ వేడుకల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రజా జీవితం, వెనుకబడిన వర్గాల సంక్షేమం, తెలుగు భాషాసాహిత్యాభివృద్ధి, సామాజిక రంగాల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామప్రసాద్, పరిషత్ ప్రతినిధులు ముత్యాల శ్రీనివాస్, డాక్టర్ సుధీర్ రమణ, కాంతేటి వెంకటరాజు, ఆదిలీలా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్. ఆదినారాయణతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీవేత్తలు, కళాకారులు, సామాజికవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పేలా అత్యంత వైభవంగా ఈ వేడుకలు నిర్వహించారు.

## మల్కంచెరువు, సిటీ వైన్స్ వాటర్లాగింగ్ ప్రాంతాలు, సీఓడీ పైప్లైన్ పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్



శేరిలింగంపల్లి. జూలై 29: (విజన్ ఆంధ్ర) : వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సూచించారు. ఈ సందర్భంగా రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కంచెరువు వాటర్లాగింగ్ పాయింట్, సిటీ వైన్స్ వాటర్లాగింగ్ ప్రాంతాన్ని, అలాగే మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెంటర్ ఫర్ ఆర్గనైజేషన్ డెవలప్మెంట్ పైప్లైన్ పనుల పురోగతిని సీపీ సంబంధిత సివిక్ బాడీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాటర్లాగింగ్ సమస్యకు కారణమవుతున్న అంశాలను అధికారులు వివరించగా, వర్షపు నీరు వేగంగా వెళ్లేలా అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని సీపీ సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించడం, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం ద్వారా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే సీఓడీ పైప్లైన్ పనులను వేగవంతం చేసి, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనుల జరుగుతున్న ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు, అవసరమైన ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, తో పాటు సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), సన్ ప్రీత్ సింగ్, సీఎంసీ కమిషనర్ సృజన, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాధాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, సీఎం సి డిప్యూటీ కమిషనర్, ఏఈ/ఏఈఈ అధికారులు హైడ్రా సిబ్బంది, ఇతర సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పలు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## మొక్కలు నాటండి..పర్యావరణాన్ని కాపాడండి

**- మల్కాజ్గిరి డిప్యూటీ కమిషనర్ రామలింగం**



జవహర్ నగర్, జూలై 29,(విజన్ ఆంధ్ర): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్కాజ్గిరి డిప్యూటీ కమిషనర్ రామలింగం సూచించారు. బుధవారం అహ్మద్ గూడా 2 బీహెచ్ కే ఫేస్ 2 మెయిన్ కమిటీ ఛైర్మన్ రజిని శ్రీహరి గౌడ్ ఆధ్వర్యంలో వనమ హోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ఆయన ముఖ్య అతిథిగా హజరై, డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్, డిప్యుటీ మేనేజర్ దుర్గ, సూపర్వైజర్ మల్లేష్ లతో కలిసి 17 బ్లాక్ ల ఛైర్మన్ లకు, లబ్ధిదారులకు మొక్కలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెరుగు తున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో మొక్కల పెంపకం అత్యంత అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో కనీసం ఒక మొక్కనైనా నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.అప్పుడే మీ నివాస ప్రాంతం పచ్చదనం తో కళకళలాడుతుందన్నారు. చెట్లు ఉంటే స్వచ్ఛమైన గాలి, నీడ, వర్షపాతం పెరుగుదలకు దోహదపడటంతో పాటు పర్యావరణ సమతుల్యత ను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో 24 టూ 40 బ్లాక్ ఛైర్మన్ లు, డైరెక్టర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# దేవరకద్ర నుండే “సర్జికల్ స్ట్రైక్ 59“ మొదలు

**- బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా టీఆర్పీ బహిరంగ సభ..**

**- కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీర వర్మ పార్టీలో చేరిక..**



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 29, (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో దేవరకద్రకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రఘువీర వర్మ ముదిరాజ్ తన అనుచరులతో కలిసి టీఆర్పీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి మల్లన్న ఆహ్వానించారు.

**బీసీ రాజ్యాధికారమే అజెండా**

ఈ సభలో మాట్లాడిన తీన్మార్ మల్లన్న, దేవరకద్రలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మెజారిటీగా ఉన్నారని, వారు రాజకీయంగా ఏకమైతే రాష్ట్ర రాజకీయాల్లోనే మార్పు వస్తుందని అన్నారు. జనాభాలో మెజారిటీగా ఉన్న సామాజిక వర్గాలు తమ ఓటు హక్కును రాజ్యాధికారం కోసం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేవరకద్రలో అగ్రవర్ణాల ఓట్లు తక్కువగా ఉండగా, బీసీ సామాజిక వర్గాల ఓట్లు అధికంగా ఉన్నాయని లెక్కలు వివరించారు. రానున్న ఎన్నికల్లో దేవరకద్ర నియోజకవర్గం నుండి బీసీ బిడ్డనే అసెంబ్లీకి పంపాలని ధీమా వ్యక్తం చేశారు. “దేవరకద్ర కోటపై బీసీ జెండా ఎగరేస్తాం“ అని ప్రకటించారు.

**భూముల పంపిణీ హామీ**

1949 నిజాం ఫర్మానాను ప్రస్తావిస్తూ అమరచింత సంస్థాన పరిధిలోని 16,416 ఎకరాల భూములను టీఆర్పీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే స్వాధీనం చేసుకుని భూమిలేని బీసీ, ఎస్సీ, ఎస్టీ, పేద కుటుంబాలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

**పార్టీ విధానాలు**

బీసీలకు బీ-ఫారాలు ఇచ్చే ఏకైక పార్టీ టీఆర్పీ అని, ఇతర పార్టీలు బీసీ నేతలను కేవలం జెండాలు మోయించడానికే ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. 2028 ఎన్నికల్లో రాష్ట్రంలో తొలి బీసీ ముఖ్యమంత్రిని నిలబెట్టడమే లక్ష్యమని, ప్రతి బీసీ కుటుంబానికి కనీసం రెండు ఎకరాల భూమి ఇచ్చే దిశగా పనిచేస్తామని తెలిపారు.

**పాదయాత్ర ప్రకటన**

సెప్టెంబర్ 17 నుండి రాజ్యాధికార పాదయాత్ర ప్రారంభిస్తామని, ప్రతి గ్రామానికి వెళ్లి అగ్రవర్ణాల ఆధిపత్యంపై చర్చించి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో రాజకీయ చైతన్యం తీసుకొస్తామని ప్రకటించారు.



**హాజరైన నేతలు**

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేములవాడ మదన్ మోహన్ చారీ, జిల్లా అధ్యక్షులు మున్నూరు జైపాల్ రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు సల్మాన్, ఇతర జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

# ఓటరు వివరాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

**-బీఎల్వోలు నమోదు చేసిన వివరాలను ఈఆర్వోలు, సూపర్వైజర్లు క్రాస్ వెరిఫై చేయాలి**

**-పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను కూడా సమాంతరంగా పూర్తి చేయాలి**

**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-29(విజన్ ఆంధ్ర) : ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు కేవలం నాలుగు నుంచి ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బీఎల్వోలు నమోదు చేసిన వివరాల్లో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్ది, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఎస్ఐఆర్ పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, డేటా నమోదు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. బీఎల్వోలు వెబ్సైట్లో నమోదు చేసిన వివరాల్లో అనేక పొరపాట్లు గుర్తించామని, వాటి కారణంగా అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతున్నాయనే ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ప్రతి నమోదును ఈఆర్వోలు, సూపర్వైజర్లు తప్పనిసరిగా క్రాస్ వెరిఫై చేసి, యాదృచ్ఛికంగా పరిశీలనలు నిర్వహించి రెండు రోజుల్లోగా లోపాలను సరిదిద్దాలని ఆదేశించారు. అనంతరం తప్పిదాలు గుర్తిస్తే సంబంధిత బీఎల్వోలు, సూపర్వైజర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంకా పెండింగ్లో ఉందని పేర్కొంటూ, ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం, 80 నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రభావం ఉంటుందనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఓటరు జాబితాకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతిని వివరించాలని, పోలింగ్ స్టేషన్ల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను బూత్ లెవల్ ఏజెంట్లకు అందజేసి వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ‘సర్‘ విజయవంతానికి కృషి చేయాలి

**- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు**



మల్కాజిగిరి,జూలై 29,(విజన్ ఆంధ్ర): ప్రతి బీఎల్ఏ కష్టపడి పని చేసి ‘సర్‘ విజయవంతానికి కృషి చేయాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు సూచిం చారు. మంగళవారం మల్కాజిగిరి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి బాలాజీ ఫంక్షన్ హాల్ లో ఎస్ఆర్ఐ నమోదు కార్యక్రమంలో భాగంగా బిఎల్ఎలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అబ్జర్వర్ సమీర్ కౌశల్ లు హాజరై నారు ఇప్పటికీ 100 శాతం ఎస్ ఆర్ ఐ నమోదు పూర్తి చేసిన వారికి మైనం పల్లి చేతుల మీదుగా బహుమ తులు అందజేసి, శాలువతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను నాయకుడిని కాపా డుకుంటానని ధైర్యం చెప్పారు. కష్టపడి పని చేసిన వారికి మంచి ప్రోత్సాహాన్ని అందిస్తామ ని తెలిపారు. వెనుకబడిన ప్రతి బిఎల్ఏ ఇప్పటికైనా ముందుండి పని చేయాలని సూచించారు. అబ్జర్వర్ మాట్లాడుతూ.. ఏ నియో జక వర్గంలో లేని విధంగా మల్కాజిగిరి నియోజ కవర్గంలో మైనంపల్లి హనుమంతరావు పతి బిఎల్ఏ కు ప్రోత్సాహాన్ని అందిస్తూ అందర్నీ బాగా చూసుకుంటున్నా రని చెప్పారు. వారు కష్టపడి పని చేస్తారని చెబుతున్నారని, ఇక ముందు కష్ట పడే వారికి ప్రత్యేక గుర్తింపు ఇస్తామని తెలి పారు. కష్టపడే వారిని గుండెల్లో పెట్టుకొని చూసు కునే తత్వం మైనంపల్లి హనుమంతురావుది అన్నారు. రాష్ట్రంలోనే మల్కాజిగిరి ముందు ఉండేలా అందరూ కష్టపడి పని చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్ర నాథ్, మల్కాజిగిరి ఇంచార్జీ లక్ష్మీ కాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్ర శేఖర్, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, జీ ఎన్ వీ సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు, జీడి సంపత్ గౌడ్ వైనా ల ప్రవీణ్ కుమార్, వినోద్ యాదవ్, సత్య మూర్తి, యూసుఫ్ భాయ్ పిట్టల నాగరాజు, శ్రీకాంత్,లక్మి,రాందాస్ సంతోష్ ముదిరాజ్, రామచందర్, వెంకన్న, శ్రీరామ్ యాదవ్, సురేష్ సింగ్, అశోక్ రెడ్డి,ఆశా, సుమలత యాదవ్, పుష్ప లత, ఇందిర ప్రియదర్శిని, శారద,రోజా రమణి, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# వనపర్తిని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలి

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 29 (విజన్ ఆంధ్ర) : నియోజకవర్గంలోని పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పక్కా ఇల్లు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. వనపర్తి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గాన్ని పూర్తిగా గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పక్కా ఇల్లు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరై కూడా నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఆసక్తి చూపని లబ్ధిదారులను వెంటనే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. అలాంటి వారి వివరాలను సేకరించి, నిజంగా ఇల్లు అవసరమైన అర్హులైన పేదలకు ఆ ఇళ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ఇప్పటికే గుర్తించిన 287 గుడిసెలతో పాటు నియోజకవర్గంలోని అన్ని గుడిసెలను పూర్తిస్థాయిలో గుర్తించి జాబితాను సిద్ధం చేయాలని, ఈ ప్రక్రియతో పాటు పెండింగ్ అంశాలన్నింటినీ వారం రోజుల్లోపు పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించారు. అదేవిధంగా, ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు పరిమితులకు లోబడే ఇంటి నిర్మాణం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ విటోబా, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లాలో 85% ఎస్ ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి

**- త్వరలో 100% పూర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 29 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లాలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇప్పటివరకు 84.12% ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,75,570 మంది ఓటర్లకు వంద శాతం ఫారాలు అందజేశామని, ఇప్పటివరకు 2,31,808 ఫారాలు అంటే 84.12% డిజిటలైజ్ చేశామని వివరించారు. రెండు మూడు రోజుల్లో 100% పూర్తి చేస్తామన్నారు. ఒకే పోలింగ్ స్టేషన్లో 1200 కంటే ఎక్కువ ఓట్లు, 2 కి.మీ కంటే ఎక్కువ దూరంలో ఉన్న కేంద్రాలను గుర్తించి పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ చేపడుతున్నట్లు చెప్పారు. డిజిటలైజేషన్కు 4-5 రోజులు మాత్రమే గడువు ఉందని, తప్పులు లేకుండా వేగంగా పూర్తి చేయాలని వీఆర్వోలను ఆదేశించారు. సమీక్షలో ఆర్డీఓలు టి. వినోద్ కుమార్, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## అధికారిక కార్యక్రమం ఫ్లెక్సీలో కానరాని ఎమ్మెల్యే, ఎంపీ ఫోటోలు

**- ప్రోటోకాల్ ఉల్లంఘనపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం**

**- నవాబ్పేటలో విద్యా సదస్సు ఫ్లెక్సీలో వివాదం**

**- ముఖ్యఅతిథి స్థానిక ఎమ్మెల్యే ఫోటో లేకపోవడంపై విమర్శలు**

**- ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**




జడ్చర్ల / నవాబ్పేట / జులై 29, (విజన్ ఆంధ్ర): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సదస్సు కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన అధికారిక ఫ్లెక్సీలో ప్రోటోకాల్ ప్రకారం ఉండాల్సిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల ఫోటోలు లేకపోవడం గమనార్హం. ఫ్లెక్సీలో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఫోటోలు మాత్రమే ఉండగా, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే ఫోటోను కూడా పెట్టలేదు. అధికారిక కార్యక్రమంలో ప్రజా ప్రతినిధుల ఫోటోలను పక్కన పెట్టారని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. ఇది కావాలనే చేసిన నిర్లక్ష్యమని, ప్రజా ప్రతినిధులను అవమానించే చర్య అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడం తప్పనిసరి అని, దీనిని ఉల్లంఘించిన అధికారులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.

## పులుల పరిరక్షణతోనే ప్రకృతి సమతుల్యత సాధ్యం

**- ఎఫ్ఆర్వో పర్వేజ్ అహ్మద్**




గద్వాల జూలై 29 (విజన్ ఆంధ్ర) : ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలో స్థానిక ప్రాథమిక అభ్యాస పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, పులుల సంరక్షణ,జీవవైవిధ్య పరిరక్షణ,అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో పర్వేజ్ అహ్మద్ మాట్లాడుతూ,పులులు ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని,వాటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అడవులు, వన్యప్రాణులను పరిరక్షించేందుకు చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు.అనంతరం విద్యార్థులు పులుల సంరక్షణ,అడవుల పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వ్యాసరచన,చిత్రలేఖన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పులుల పరిరక్షణపై తమ ఆలోచనలను వ్యాసాలు,చిత్రాల రూపంలో సృజనాత్మకంగా ఆవిష్కరించారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో రేంజ్ సిబ్బంది,పాఠశాల సిబ్బంది విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షంతో వంతెన పైనుంచి పొంగి ప్రవహిస్తున్న నీరు

**- వాహనదారులు ఉద్యోగుల రాకపోకలు నిలిపివేత**

లింగాపూర్ జులై 28 (విజన్ ఆంధ్ర ) : లింగాపూర్ మండలంలోని భారీ వర్షం కురవడంతో పిట్టాగూడ వంతెన



పైనుంచి భారీగా నీరు ప్రవహించడంతో పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు ప్రజలకు చెప్తూ సహకారాలు చేపట్టారు..రాకపోకలకు వాహనదారుడు ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులు నిర్వహించడానికి వెళ్లలేని పరిస్థితి పని నిమిత్తం వెళ్లడానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ప్రజలు ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా ఈ వంతెన నిర్మాణాన్ని చేపట్టి ఆదుకోవాలని లింగాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులు పేర్కొన్నారు.



# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29, (విజన్ ఆంధ్ర) : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక , వి బి జి రామ్ జి అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ (గ్రిడ్, ఇంట్రా) అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, లీకేజీలు, సాంకేతిక లోపాలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలను సమర్థవంతంగా రూపొందించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగిస్తూ ప్రతిపాదిత పనులను వేగవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వి బి జి రామ్ జి పథకంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యలపై తక్షణ స్పందన కనబరుస్తూ, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని, జిల్లా అధికారులు కార్యక్రమాల పురోగతిపై క్రమం తప్పకుండా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మిషన్ భగీరథ (గ్రిడ్ & ఇంట్రా) ఈఈలు, డి.ఈ లు, ఎ.ఈ.లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఎ.పి.ఓ.లు, ఎ.పి.ఎం.లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పూర్తి చేయాలి

**- రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి**




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29,(విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలో నిర్ణీత గడువులోగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి కార్యాలయం నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఇంకా బూత్ స్థాయి అధికారులకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించని వారి వివరాలను రాజకీయ పార్టీలకు అందించాలని, డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి అయిన తరువాత పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 మంది ఓటర్లు ఉండే విధంగా ప్రక్రియ పూర్తి చేయాలని, ఎ.ఎస్.డి. జాబితా రూపొందించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు బూత్ స్థాయి అధికారులకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 90 శాతం వరకు పూర్తి అయిందని తెలిపారు. ఇంకా ఎన్నిమరేషన్ ఫారాలు అందించని ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, 1 వేయి 200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలు జిల్లాలో 4 ఉన్నాయని, హేతుబద్ధీకరణ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పూర్తి చేస్తామని తెలిపారు. ఎ.ఎస్.డి. జాబితా రూపొందించి బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సంతకం తీసుకుంటామని, ప్రతివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సూచనలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29,(విజన్ ఆంధ్ర) : జిల్లాలోని మత్స్యకారుల సంక్షేమం కొరకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం ద్వారా 2025-26 సంవత్సరానికి గాను మత్స్యశాఖ ఆధ్వర్యంలో ద్విచక్ర, త్రిచక్ర వాహన లబ్ధిదారులను లాటరీ పద్ధతిన ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం క్రింద 2025-26 సంవత్సరానికి గాను గిరిజన మత్స్యకారులకు 21 యూనిట్ల ద్విచక్ర వాహనాలు, 5 యూనిట్ల త్రిచక్ర వాహనాలు మంజూరయ్యాయని తెలిపారు. గిరిజన మత్స్యకారులు 491 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో నుండి 26 మంది లబ్ధిదారులను లాటరీ పద్ధతిన ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం అందించిన ఈ అవకాశాన్ని గిరిజన మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రభాకర్, మత్స్యశాఖ సిబ్బంది, గిరిజన మత్స్యకారులు పాల్గొన్నారు.

# సంత్ రవిదాస్ మహారాజ్ ఆశయాలు ఆదర్శప్రాయం



సూర్యాపేట జూలై 29:(విజన్ ఆంధ్ర) : సంత్ రవిదాస్ మహారాజ్ బోధించిన సమానత్వం, సోదరభావం, మానవతా విలువలు సమాజ నిర్మాణానికి మార్గదర్శకాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి అన్నారు.బుధవారం సూర్యాపేట జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావు, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ సూచనల మేరకు సంత్ రవిదాస్ మహారాజ్ 650వ జయంతి దీపోత్సవ్ సందర్భంగా బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు బొజ్జ పరశురాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంత్ రవిదాస్ మహారాజ్ సమాజంలో కుల వివక్ష నిర్మూలన, సమానత్వం, మానవ సేవ కోసం కృషి చేశారని తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమరస సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదలు, దళితులు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు.సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ సబ్‌కా విశ్వాస్ సబ్‌కా ప్రయాస్ అనే సిద్ధాంతంతో దేశాభివృద్ధి కొనసాగుతోందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమరసతా సంకల్ప్ అభియాన్ ద్వారా సందేశాన్ని ప్రతి గ్రామానికి, ప్రతి దళితవాడకు తీసుకెళ్తామని తెలిపారు. సమరసత, ఐక్యత, సేవాభావంతో సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగరాజు రుక్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పణి నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగ చారి, రాష్ట్ర టీచర్ సెల్ కో కన్వీనర్ తికుళ్ళ సాయి రెడ్డి, జిల్లా నాయకులు బూర మల్సూర్ గౌడ్,బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు గుణగంటి పృధ్వి, సీనియర్ నాయకులు దాసరి వెంకన్న, జెల్లీ గణేష్, కందుల రమేష్, బోర రమేష్ యాదవ్, గణేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం

**మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని**

**ప్రారంభించిన జిల్లా విద్యాధికారి బి. వాసంతి**




కొత్తగూడెం బ్యూరో, జూలై 30(విజన్ ఆంధ్ర) : పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపులో ప్రధానోపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా విద్యాధికారి శ్రీమతి బి. వాసంతి పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కొత్తగూడెంలోని ఆనందఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య వారధిగా వ్యవహరిస్తూ పాఠశాలల విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని సూచించారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం అమలు చేస్తున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ , ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల పఠన, అభ్యాస సామర్థ్యాలను పెంపొందించాలని అన్నారు.ప్రతి రోజు కనీసం ఇద్దరు ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి లోటుపాట్లను గుర్తించి అవసరమైన సూచనలు ఇవ్వడం ద్వారా బోధన నాణ్యతను మెరుగుపరచాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో లెర్నింగ్ అవుట్‌కమ్స్ సాధనపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు యుడైస్ ప్లస్ లో పాఠశాలల సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేసి, జిల్లాకు పీజీఐ లో మెరుగైన ర్యాంకు సాధించేలా కృషి చేయాలని సూచించారు.అనంతరం ఫిజికల్ డైరెక్టర్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా విద్యాధికారి, విద్యార్థుల శారీరక, మానసిక వికాసంలో ఫిజికల్ డైరెక్టర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం పరిశీలిస్తూ సరైన మార్గదర్శకత్వం అందించాలని, ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా ప్రతిష్ఠను నిలబెట్టేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.సమ్మిళిత విద్య శిక్షణలో పాల్గొన్న స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ కు కూడా ఆమె పలు సూచనలు చేశారు. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను గుర్తించి వారికి వ్యక్తిగత విద్యా ప్రణాళికలు రూపొందించాలని, వారి పురోగతిని నెలవారీగా సమీక్షించాలని, తల్లిదండ్రులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ అవసరమైన నైతిక, విద్యా సహకారం అందించాలని సూచించారు. సహాయక పరికరాల వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు సమ్మిళిత విద్యను మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఐఈఆర్‌పీలు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో విద్యా ప్రమాణాల పెంపునకు తోడ్పడాలని జిల్లా విద్యాధికారి కోరారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి మాధవరావు, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్.కె. సైదులు, కోర్సు కోఆర్డినేటర్లు జుంకిలాల్, బాలాజీ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, సమ్మిళిత విద్య రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలపై కలెక్టర్ అంకిత్ ఫోకస్..

**- రోడ్లపై పశువులు వదిలితే కఠిన చర్యలు.**

**- అతివేగం, హెల్మెట్ లేకుండా ప్రయాణంపై ఉక్కుపాదం..**

**- కలెక్టర్ కీలక ఆదేశాలు**




కొత్తగూడెం బ్యూరో, జూలై 30(విజన్ ఆంధ్ర) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో రోడ్డు ప్రమాదాల పరిస్థితి, బ్లాక్ స్పాట్లలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.జిల్లాలో రహదారులపై పశువుల సంచారం కారణంగా, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. రోడ్లపై పశువులను నిర్లక్ష్యంగా వదిలే యజమానులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అతివేగంగా వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు అప్పగించడం, సీటు బెల్టులు ధరించకపోవడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు వినియోగించకపోవడం వంటి ఉల్లంఘనలను అరికట్టేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలతో పాటు కట్టుదిట్టమైన అమలు చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లాలో గుర్తించిన 42 బ్లాక్ స్పాట్లలో భద్రతా పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేసి అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని స్పష్టం చేశారు.రహదారులపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయడంతో పాటు, రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానత కల్పించాలని సంబంధిత శాఖలకు సూచించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులకు 'గోల్డెన్ అవర్'లో వైద్య సేవలు అందేలా బ్లాక్ స్పాట్లకు సమీపంలోని ఆసుపత్రులను మ్యాపింగ్ చేసి అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం, జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 289 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయి. ప్రమాదాలకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి అనూషతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వార్డ్ మెంబర్ ఫోరం మండల ఇన్చార్జిగా సప్తమి రాజు నియామకం....



ఆసిఫాబాద్ జూలై 29 విజన్ ఆంధ్ర కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని వార్డు మెంబర్ల అందరి సమక్షంలో తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం రెబ్బెన మండల ఇన్చార్జిగా పస్తం రాజు ను నియమిస్తున్నట్లు తెలంగాణ వార్డు సభ్యులు ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి తెలిపారు ఈ సందర్భంగా వార్డు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేసిన సత్యం రాజు వార్డు ప్రజలకు మరియు వార్డు మెంబర్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి పనిచేస్తామని తెలిపారు.

# 78 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29 ( విజన్ ఆంధ్ర ) : జిల్లాలో 78 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం ప్రత్యేక సమగ్ర సవరణ పై జిల్లాల వారీగా ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ జిల్లాలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎ.ఎస్.డి(ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) కేసులను గుర్తించి గ్రామపంచాయతీ నోటీస్ బోర్డులో ప్రదర్శించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. వికారాబాద్, తాండూర్ లో వలస ఓటర్లు ఎక్కువగా ఉండడం వల్ల అటువంటి వాటిని కూడా ప్రత్యేకంగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటా చారి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ)సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెమత్ అలీ తదితరులు ఉన్నారు.

# ఆప్మెల్‌లో సౌర విప్లవం.. 300 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ప్రారంభం

**- స్వర్ణోత్సవ వేళ ఆప్మెల్‌కు మౌలిక వసతుల విస్తరణ..**

**సీసీ, ఆర్‌సీసీ రోడ్ల ప్రారంభం**



కొత్తగూడెం బ్యూరో, జూలై 30(విజన్ ఆంధ్ర) : సింగరేణి అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఆప్మెల్) స్వర్ణోత్సవ సంవత్సరంలో కీలక అడుగు వేసింది. విజయవాడలోని ఆప్మెల్ ప్లాంట్‌లో రూ.1.24 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఇదే సందర్భంగా ప్లాంట్‌లో నూతనంగా నిర్మించిన సీసీ, ఆర్‌సీసీ రోడ్లను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో సింగరేణితో పాటు ఆప్మెల్‌ను కూడా బహుముఖ వ్యాపార విస్తరణ దిశగా ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.ఆప్మెల్ 50 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రూ.63.13 కోట్ల టర్నోవర్, రూ.23.33 కోట్ల నికర లాభం నమోదు చేయడం సంస్థ అభివృద్ధికి నిదర్శనమని పేర్కొంటూ ఉద్యోగులు, అధికారులను అభినందించారు. గత ఏడాది ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆప్మెల్‌ను సందర్శించి ఇచ్చిన దిశానిర్దేశం, ప్రోత్సాహం ఈ విజయానికి బలమైన పునాదిగా నిలిచిందని తెలిపారు.సెప్టెంబర్ 1, 1976న ప్రారంభమైన ఆప్మెల్ ఈ ఏడాది స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ప్రస్తుతం తయారు చేస్తున్న యంత్ర పరికరాలు, విడిభాగాలతో పాటు వివిధ పరిశ్రమల ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేసి వ్యాపారాన్ని విస్తరించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో సింగరేణి సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

ఏటా రూ.24 లక్షల విద్యుత్ ఖర్చు ఆదా

ఆప్మెల్ ప్లాంట్, కాలనీ అవసరాల కోసం ప్రతి ఏడాది సుమారు రూ.60 లక్షల విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా రూ.24 లక్షల వరకు విద్యుత్ ఖర్చు ఆదా అవుతుందని, ఐదేళ్లలో పెట్టుబడి మొత్తం తిరిగి వస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. ఆప్మెల్ ఛైర్మన్ ఎన్‌వీకే శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంస్థ అభివృద్ధికి చేపట్టబోయే ప్రణాళికలను వివరించారు. సింగరేణి, కోల్ ఇండియా, ఎన్ఎండీసీ సంస్థల నుంచి లభించిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం. తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ పాల్గొన్నారు. విజయవాడలోని ఆప్మెల్ నుంచి ఎండీ ఎర్రన్నతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గురుపూర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

**- భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు**



అల్వాల్, జూలై 29, (విజన్ ఆంధ్ర): గురు పూర్ణమి (వ్యాస పూర్ణిమ) పురస్క రించుకొని అల్వాల్ సర్కిల్ పరిధిలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చి బారులు తీరారు. స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని, ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. రాంనగర్ కాలనీలోని శ్రీ షిరిడి సాయి బాబా సన్మార్ సంగ్ లో ఉదయం సామూహిక పూజలు జరిగాయి. గురు పూర్ణ సందర్భంగా అల్వాల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి హాజరై, అన్న ప్రసాదా నికి 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఆలయ ట్రస్టీలు వరలక్ష్మి, వేణుగోపాల్ (బబ్లు ), అర్చకులు డి. సంతోష్ శర్మ, సందీప్ పంతులు, రాకేష్, శ్రీను, కృష్ణ, యాదగిరి గౌడ్, అశోక్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదులో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

**- ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి,**

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర), జులై 29 : ఓటరు జాబితా రూపకల్పనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్స్ యాప్‌లో ప్రతి ఓటరు వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. యాప్‌లో నమోదు చేసిన వివరాలే ముసాయిదా ఓటరు జాబితా (డ్రాఫ్ట్ పబ్లికేషన్)లోప్రతిబింబిస్తాయని,అందువల్ల చిన్న పొరపాటు కూడా జరగకుండా ప్రతి నమోదునుపర్యవేక్షించి,తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అదనపు కలెక్టర్ చెన్నయ్య,జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వీసీ అనంతరం అధికారులతో మాట్లాడుతూ..., ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పులు లేకుండా నాణ్యతతో చేపట్టాలన్నారు. ఓటరు జాబితా ఎన్నికల నిర్వహణ కోసం మాత్రమే రూపొందించబడుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతతో దీనికి ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించాలని, జిల్లాలో డిజిటలైజేషన్ నిర్దేశిత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని, బిఎల్ఓ యాప్‌లో వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు ప్రతి నమోదును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా ధృవీకరించాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి నమోదును సూపర్వైజర్లు క్షుణ్ణంగా తనిఖీ చేసి ధృవీకరించాలని పేర్కొన్నారు. గైర్హాజరు, వలస వెళ్లిన, మృతి చెందిన ఓటర్ల వివరాలకు సంబంధించిన జాబితాపై బీఎల్‌ఏల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు, ఓటర్ల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని చేపట్టాలని సూచించారు. అలాగే, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్




గద్వాల జూలై 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఎస్ఐఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై బుధవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్స్ యాప్‌లో ప్రతి ఓటరు వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. యాప్‌లో నమోదు చేసిన వివరాలే ముసాయిదా ఓటరు జాబితా (డ్రాఫ్ట్ పబ్లికేషన్)లో ప్రతిబింబిస్తాయని, అందువల్ల చిన్న పొరపాటు కూడా జరగకుండా ప్రతి నమోదును పర్యవేక్షించి,తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,ప్రతి నమోదును సూపర్వైజర్లు క్షుణ్ణంగా తనిఖీ చేసి ధృవీకరించాలని సూచించారు. గైర్హాజరు,వలస వెళ్లి, మృతి చెందిన ఓటర్ల వివరాలకు సంబంధించి లిస్ట్ పై బీఎల్ఏల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు, ఓటర్ల సంఖ్య,భౌగోళిక పరిస్థితులు, సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని చేపట్టాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా ఎన్నికల నిర్వహణ కోసం మాత్రమే రూపొందించబడుతుందని,ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతతో దీనికి ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా వివరించాలని అధికారులకు సూచించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ వీసీ అనంతరం వివిధ మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులతో మాట్లాడుతూ, ఓటరు జాబితా రూపకల్పనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ అన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పులు లేకుండా నాణ్యతతో చేపట్టాలన్నారు. జిల్లాలో డిజిటలైజేషన్ నిర్దేశిత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని, బిఎల్ఓ యాప్‌లో వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు ప్రతి నమోదును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా ధృవీకరించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్,ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విపక్ష నాయకుడు..? స్వపక్ష ప్రభుత్వం పై నిరసన డ్రామా

- డ్రామా ఆర్టిస్టుగా మారిన గద్వాల ఎమ్మెల్యే.
- జిల్లా బిజెపి యువ నాయకురాలు డికె.స్నిగ్ధ రెడ్డి



గద్వాల జూలై 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయం(డికె.బంగ్ల) లో జిల్లా బిజెపి యువ నాయకురాలు డికె.స్నిగ్ధ రెడ్డి పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రకటనలో భాగంగా ఆమె మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గ శాసనసభ్యులు పదేళ్లు బిఆర్ఎస్. పార్టీ లో ఉండి ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ లో గెలిచి అభివృద్ధి కోసం అని కాంగ్రెస్ లో చేరి ఏమి చేశారు. 12 ఏళ్ల నుండి ఎందుకు గట్టు ఎత్తిపోతల పథకం పూర్తి చేయలేదని అన్నారు. 12 ఏళ్ళ నుండి గుర్రం గడ్డ బ్రిడ్జి ఏమైందని,పేదవారి ఇంటి స్థలాలు లాక్కొని వాళ్ళకి గూడు లేకుండ చేశారు. రోడ్లు అధ్వానంగా మారిన ఎమ్మెల్యే కి కనపడుటలేద అని విమర్శించారుడికే.అరుణమ్మ నెట్టెంపాడు ప్రాజెక్టు ను సాధించి, నీళ్లు ఇచ్చారు. ఆ కాలువలలో జమ్మూ మొలుస్తుందని, నీళ్ళు రాక రైతులు నిరాశ చెందుతున్నారని విమర్శించారు. ఈరోజు వరకు మిగిలిన పనులు పూర్తి చేయరు, పట్టించుకోరు అని అన్నారు.గద్వాల ఎమ్మెల్యే అసలు ఏ పార్టీలో ఉన్నాడో నియోజకవర్గ ప్రజలకు అర్థం కావడం లేదు.సిట్టింగ్ ఎమ్మెల్యే గా గెలిచింది బీఆర్ఎస్ టికెట్టు పైన, విపక్ష నాయకుడే కానీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ తో ఉన్నానని అంటాడు, ఇది ఏమి విడ్డూరం మో ఆ కాంగ్రెస్ పార్టీకే తెలుసు అని అన్నారు. మంగళవారం నీటి కోసం నిరసన అని కాంగ్రెస్ ప్రభుత్వం పై నిరసన ర్యాలీకి పిలుపునిచ్చాడు. కానీ ఎమ్మెల్యే నిరసనకు రేవంత్ రెడ్డి చెలించి పోయి బుధవారం జూరాల నీటిని రైతులకు విడుదల చేయించారు. ఈ డ్రామాలు చేస్తున్న ఎమ్మెల్యే జిమ్మికులు చాలా బాగున్నాయి అని విమర్శించారు.అభివృద్ధి కోసం పోయిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో చాలా సమస్యలున్నాయి, ఫీజు రియంబర్స్మెంట్ సమస్యలు,రోడ్లు ,విద్యుత్ సమస్యలు ఉన్నాయి. ఒక్క ఎమ్మెల్యేగా, ఒక ప్రజాప్రతినిధిగా, సొంతంగా, నీకు అంతా సత్తా ఉంటే సమస్యలను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచి నియోజకవర్గం లోని సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు.అంటే సొంత పార్టీ మీద ధర్నాకు దిగుతే, నేనేదో ప్రజల కోసం కొట్లాడుతున్నా అని చూపించు కోవడానికి తప్పితే, అసలు ఇన్ని రోజులు నువ్వేమి చేస్తున్నావు అని ప్రశ్నించారు.ఎగువ రాష్ట్రం లో వర్షాలు పడి అప్పటికే రిజర్వాయర్లలో నీళ్లు ఉన్నాయి.అసలు ఉన్న నీళ్లను సరిగ్గా ఉపయోగంచుకొనే ఆలోచన, కెపాసిటీ లేని ఎమ్మెల్యేవి నువ్వు అని విమర్శించారు.ఈరోజు ప్రజల ముందరకు వచ్చి నాటకాలు చేస్తున్నావు.నేను ధర్నా చేస్తా, రైతుల కోసం ధర్నా చేస్తా.ఇవన్నీ నాటకాలు బంద్ చేసి ఇప్పుడు నీళ్లు సరిగ్గా వదలలేదు. బిఆర్ఎస్ హయం లో నీళ్ల సమస్యలు ఉన్నాయి, రెండుసార్లు ఎమ్మెల్యే గెలిచినా ఒక్క కాలువ పని చేసింది లేదు. అసలు కాల్వలో జమ్ము తీయలేదు. ఇప్పటివరకు ఒక్క పని చేసింది లేదు.ఈరోజు కూడా రైతుల గురించి మాట్లాడకపోతే గ్రామంలో ఉరికించి కొడతారని భయంతో ఈ నాటకాలకు తెర లేపావు.కానీ ప్రజల మీద ప్రేమతో కాదు, నీ పదవి కోసం చేస్తున్నావని ప్రజల అర్థం చేసుకున్నారని అన్నారు.ఇవన్నీ నాటకాలు మానుకో, ప్రజలు అన్ని గమనిస్తున్నారు.ఇంకా గద్వాల్లో చాలా సమస్యలు ఉన్నాయి. ఫస్ట్ రోడ్ల సమస్యలు , ఇన్నేళ్లలో కొత్త రోడ్డు వేసింది లేదు. ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్ట్కు కాల్వాలు మెంటైన్ లేవు, నీళ్లు సరిగ్గా వస్తలేవు. ఒక్క పని చేయలేకుండా, ఒక చేతగాని ఎమ్మెల్యేవి ఈరోజు సొంత ప్రభుత్వంలో ఉన్న నీళ్లు తెప్పించుకోలేని పరిస్థితి ఉన్నదని అని అన్నారు.

# ఆస్పత్రి లో మందులను విధిగా ఉంచుకోవాలి

- ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలి
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి
- ఉత్తమ ఫలితాలు విద్యార్థులు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలి
- పేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక





నారాయణపేట, జూలై 29 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట మండలంలోని కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళా వార్డు, ప్రయోగశాల, ఫార్మసీ, టీకాల నిల్వ గది, వ్యాక్సినేషన్ విభాగాలను పరిశీలించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీ విధుల్లో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, సంబంధిత అధికారులను వివరణ కోరారు. నారాయణపేటలో జరుగుతున్న సమావేశానికి హాజరైనట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. మహిళా వార్డులో చికిత్స పొందుతున్న గర్భిణితో కలెక్టర్ మాట్లాడి, ఆమె ఆరోగ్య పరీక్షల నివేదికలను పరిశీలించారు. గర్భిణి రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించిన కలెక్టర్, వెంటనే అప్పక్‌పల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి, గర్భిణికి అవసరమైన టీఫా స్కానింగ్ పరీక్షలు నిర్వహించి, నివేదికను మెడికల్ ఆఫీసర్ ద్వారా తనకు పంపించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. గతంలో బయోమెడికల్ వ్యర్థాల సేకరణకు వాహనం వచ్చేదని, ప్రస్తుతం రావడం లేదని వైద్య సిబ్బంది తెలిపారు. అలాగే విద్యుత్ సరఫరా లేకపోవడంతో వ్యాక్సినేషన్ సేవలకు అంతరాయం ఏర్పడుతున్నట్లు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, బయోమెడికల్ వ్యర్థాల సేకరణ వాహనం ఎందుకు రావడం లేదని డీఎంఅండ్‌హెచ్‌వోను ప్రశ్నించారు. సంబంధిత ఏజెన్సీకి వెంటనే నోటీసు జారీ చేయాలని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బయోమెడికల్ వ్యర్థాలను క్రమం తప్పకుండా సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈకి సూచించారు. వెంటనే డీఈఈను ఆరోగ్య కేంద్రానికి పంపించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శన..**

అనంతరం కోటకొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు మరో ఉపాధ్యాయుడు జాజాపూర్‌లో జరుగుతున్న శిక్షణకు హాజరయ్యారని, ఒక ఉపాధ్యాయుడు సెలవులో ఉండగా, మరో ఉపాధ్యాయురాలు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు వివరించారు. ఆరో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి, వారి అభ్యాస సామర్థ్యాలను పరిశీలించి అభినందించారు. అనంతరం డైనింగ్ హాల్‌ను పరిశీలించి, పదో తరగతి విద్యార్థులతో భౌతిక శాస్త్రం పాఠ్యాంశానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. గత విద్యా సంవత్సరంలాగే ఈసారి కూడా పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించే లక్ష్యంతో చదవాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ప్రోత్సహించారు. తరగతి గదిలోని విద్యార్థులతో మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులతో పోటీ ఉంటుందని గుర్తుంచుకుని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను అదే రోజు పునశ్చరణ చేస్తే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు నిరాశ చెందకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు ఆర్థిక స్వావలంబన సాధించి, తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాలని ప్రోత్సహించారు. చివరగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే వంటగది వద్ద అపరిశుభ్రతను గమనించి శుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీడీవో పాఠశాలను తరచూ సందర్శించాలని ఆదేశించడంతో పాటు, వంటగదిలో తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని చేనేత కార్మికుడి ఇంటిని సందర్శించిన కలెక్టర్, అక్కడ తయారవుతున్న సిల్క్ చీరలను పరిశీలించారు. చీరల తయారీకి అవసరమైన ముడిసరుకు, ఉత్పత్తి వ్యయం, మార్కెటింగ్, విక్రయాల వివరాలను గ్రామానికి చెందిన మాస్టర్ వీవర్ పడాకుల శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారులతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ జూమ్ సమీక్ష



కొత్తగూడెం బ్యూరో, జూలై 30(విజన్ ఆంధ్ర) : జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రభుత్వప్రైవేట్ ఆసుపత్రుల పనితీరుపై జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ వైద్యాధికారులతో బుధవారం జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.సమావేశంలో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, ప్రైవేట్ హాస్పిటళ్లు, క్లినిక్‌లలో తప్పనిసరిగా కుక్క కాటు నిరోధక (యాంటీ రేబీస్) వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో కుక్క కాటు కేసుల పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, సంబంధిత వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు.ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లను ప్రతి రెండు వారాలకు ఒకసారి తప్పనిసరిగా తనిఖీ చేసి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. హాస్టల్ సిబ్బందికి పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు వంట చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి జ్వరం, విరేచనాలు, వాంతులు, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే సంబంధిత వైద్యాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు తక్షణ చికిత్స అందించాలని సూచించారు.ప్రతి మంగళవారం, శుక్రవారం యాక్షన్ ప్లాన్ ప్రకారం చేపట్టే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి వారాంత నివేదికలను సమర్పించాలని తెలిపారు. ఆ నివేదికల ఆధారంగా వ్యాధులు అధికంగా నమోదవుతున్న గ్రామాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రోగ్రామ్ అధికారులు తమ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ సీజనల్ వ్యాధుల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, ఎన్సీడీ స్క్రీనింగ్, శ్రమదానం, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (గ్రామీహీూ), ఆరోగ్య మహిళ, సికిల్ సెల్ స్క్రీనింగ్, టీబీ అనుమానితుల గుర్తింపు, రోగులకు మందుల పంపిణీ, వైద్య శిబిరాల నిర్వహణ వంటి కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తూ నిరంతర సమీక్షలు నిర్వహించాలని సూచించిన డాక్టర్ తుకారం రాథోడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం లేదా అలసత్వం ప్రదర్శించిన సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# రాజకీయ ప్రయోజనాల కోసం మైనారిటీల పేరును వినియోగిస్తున్నారు



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై, 29 ( విజన్ ఆంధ్ర ) : బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారిపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో కాంగ్రెస్ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వరంగల్ వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం చెప్పుకోదగ్గ చర్యలు చేపట్టలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ముస్లింల సమస్యలను పట్టించుకోని వారు, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం మైనారిటీల పేరును వినియోగిస్తున్నారని ఆరోపించారు.ప్రస్తుత ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముస్లింల ఖబ్రస్తాన్ కోసం మూడు ఎకరాల భూమిని, క్రైస్తవుల శ్మశానవాటిక కోసం మరో మూడు ఎకరాల భూమిని కేటాయించారని తెలిపారు. కేవలం భూమి కేటాయించడమే కాకుండా, ఆ ప్రాంతాన్ని పూర్తిగా అభివృద్ధి చేసి రహదారి, ప్రహరీ గోడ, గేటు వంటి సౌకర్యాలతో అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని వెల్లడించారు.అలాగే ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చినా అమలు చేయలేదని ఇస్మాయిల్ విమర్శించారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, మైనారిటీల అభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.ఉద్యమకారిణి రహీమున్నిస బేగం మాట్లాడుతూ, గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముస్లింల అవసరాలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. షాదీఖానా కోసం భూమి కోరినప్పటికీ సరైన స్పందన లభించలేదని, గతంలో కేటాయించిన స్థలాన్ని కూడా రద్దు చేశారని అన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత షాదీఖానా నిర్మాణం కోసం భూమిని కేటాయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.మైనారిటీ నాయకులు మాట్లాడుతూ, సర్వే నంబర్ 579లో 25 గుంటల స్థలాన్ని షాదీఖానా కోసం కేటాయించిన సమయంలో, ఆ స్థలం అనుకూలంగా లేదని అప్పటి మైనారిటీ సంక్షేమ అధికారి మరో స్థలాన్ని కేటాయించాలని కోరడంతో జిల్లా కలెక్టర్ ఆ కేటాయింపును రద్దు చేశారని తెలిపారు. అనంతరం ఈ విషయం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారి దృష్టికి రావడంతో వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి రద్దు చేసిన స్థలాన్ని తిరిగి పునరుద్ధరింపజేసి, దానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ) జారీ చేయించారని వెల్లడించారు. ఈ మొత్తం ప్రక్రియలో ఎమ్మెల్యే మైనారిటీల ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేక చొరవ చూపారని కాంగ్రెస్ మైనారిటీ నాయకులు పేర్కొన్నారు.బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు చేస్తున్న ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని, వాస్తవానికి ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీసుకుంటున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని నాయకులు తెలిపారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని వారు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ నసీం జ,డివిజన్ అధ్యక్షులు జాఫర్, నాయకులు గౌస్ పాషా,జుబేదా బేగం,ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి బ్యూరో, జులై :29(విజన్ ఆంధ్ర ) : సంగారెడ్డి పట్టణంలోని 9వ వార్డులో గురు దత్తాత్రేయ సహిత సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.గురు పౌర్ణమి పర్వదినం ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, కౌన్సిలర్ లాడే మల్లేశం , 9 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి లాడే బాలు , సీనియర్ నాయకులు వేణుగోపాల స్వామి , పట్టణ కూర్మ సంఘం అధ్యక్షులు మల్లేశం , లాడే వెంకటేశం , మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, విఠల్ , కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# గురుపౌర్ణమి సందర్భంగా సాయినగర్ సాయిబాబా మందిరంలో మహా అన్నదానం



హనుమకొండ జిల్లా ప్రతినిధి జులై 29 ( విజన్ ఆంధ్ర ): గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ సాయినగర్‌లోని శ్రీ షిర్డీ సాయి సేవా సమాజ్ ఆధ్వర్యంలో జూలై 29న మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, సాయి సేవా సమాజ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తుంగతుర్తి శేషగిరిరావు, డైరెక్టర్అడ్మిషన్స్, ఎస్ఆర్ యూనివర్సిటీలి, వరలక్ష్మి దంపతులు, సాయి నిఖిత, సాయి మాన్విత, మౌర్య శశాంక్ తదితరుల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయిబాబా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.ఈ సందర్భంగా శ్రీ షిర్డీ సాయి సేవా సమాజ్ సభ్యులు, సాయినగర్, హనుమకొండ మాట్లాడుతూ, గురుపౌర్ణమి పర్వదినాన అన్నదానం చేయడం ద్వారా సాయిబాబా సేవలో భాగస్వాములు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. “అన్నదానం మహాదానం“ అనే స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులకు సేవ చేయడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.

# అనాధ పిల్లలకు అండగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప.

## రూ 1 లక్ష .స్కాలర్షిప్ వివాహానికి పూర్తి సహాయం ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే



బెజ్జూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర): కొమురం భీం జిల్లా బెజ్జూర్ మండలంలోని అంబగట్ట గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన చిన్నారులకు సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అండగా నిలిచారు. అంబగట్ట గ్రామపంచాయతీ పరిధిలోని రేచిని గ్రామానికి చెందిన ఆదె భీమ్రావు, తిరుపతమ్మ దంపతులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి పిల్లలు అనాథలయ్యారు. ఈ విషాదకర ఘటన స్థానికంగా అందరినీ కలచివేసింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం రేచిని గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారులను ఓదార్చి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పిల్లల భవిష్యత్తుపై ఎలాంటి ఆందోళన చెందవద్దని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప మాట్లాడుతూ, అనాథ పిల్లల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా అమ్మాయి విద్యాభ్యాసం కోసం నెలకు రూ.2,000 చొప్పున 50 నెలల పాటు మొత్తం రూ.1 లక్ష స్కాలర్‌షిప్‌ను అందజేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా, అమ్మాయి చదువు పూర్తయిన అనంతరం ఆమె వివాహానికి అయ్యే పూర్తి ఖర్చును కూడా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పిల్లల చదువు మధ్యలో ఆగిపోకూడదని, వారు ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనాథలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కోనేరు కోనప్ప అన్నారు. అవసరమైన ప్రతిసారీ ఈ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. చిన్నారులు ధైర్యంగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కోనేరు కోనప్ప ప్రకటించిన సహాయంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు కూడా ఆయన నిర్ణయాన్ని అభినందిస్తూ, ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేసిన సహాయ ప్రకటనతో బాధిత కుటుంబానికి కొంత భరోసా లభించిందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.


# గురు పౌర్ణమి సందర్భంగా గురువులకు ఘనంగా సన్మానించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి



అయిజ జూలై 29( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర గురుపూజ కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత గురువులకు మూడవ స్థానం, వారు ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థినీలకు విద్యను అభ్యసించి విద్యార్థులను ఉన్నతమైన స్థానాలకు చేర్చగలిగే వారు అని అన్నారు. ఎదగడం చాలా గొప్ప వరం, ఒక గురువు ఈ సమాజంలో అందరినీ సమానంగా ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా విద్యను అందించేవారని అన్నారు. గురు పౌర్ణమి( గురుపూజ) సందర్భంగా గురువులకు ఘనంగా సన్మానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిజెపి అయిజ మండల అధ్యక్షులు గోపాలకృష్ణ, భగత్ రెడ్డి, ఖుషి, లక్ష్మణ గౌడ్ విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేష్ ,రాజు ,కే ఆర్ అశోక్, గోవర్ధన్ ,సూర్య వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డెత్ సర్టిఫికెట్ కోసం రూ 1000 డిమాండ్..

### కారోబార్. మచ్చ నరేందర్ పై గ్రామస్తులు అగ్రహం




కొత్త సార్సాల, జూలై 29 (విజన్ ఆంధ్ర): కొమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని కొత్త సార్సాల గ్రామపంచాయతీలో డెత్ సర్టిఫికెట్ జారీ విషయంలో అవినీతి జరిగిందంటూ గ్రామస్తులు ఆరోపించారు. గ్రామపంచాయతీ కారోబార్ మచ్చ సురేందర్ డెత్ సర్టిఫికెట్ మంజూరు చేయడానికి రూ.1,000 ఇవ్వాలని డిమాండ్ చేశాడని బాధితుడు ఆరోపించాడు. డబ్బులు ఇస్తేనే సర్టిఫికెట్ అందిస్తానని స్పష్టంగా చెప్పినట్లు తెలిపాడు. ఈ వ్యవహారంపై ఆధారాలు సేకరించేందుకు బాధితుడు ఫోన్ కాల్‌ను రికార్డు చేసినట్లు వెల్లడించాడు. అనంతరం మచ్చ సురేందర్ చెప్పిన విధంగా డబ్బులు పంపించినట్లు పేర్కొన్నాడు. ఈ లావాదేవీకి సంబంధించిన వివరాలు, ఫోన్ రికార్డింగ్ తమ వద్ద ఉన్నాయని తెలిపాడు. ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా లేదా నిబంధనల ప్రకారం అందించాల్సిన సేవల కోసం డబ్బులు డిమాండ్ చేయడం చట్టవిరుద్ధమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఫోన్ రికార్డింగ్, డబ్బులు పంపిన వివరాలను పరిశీలించి నిజానిజాలు వెలికితీయాలని వారు డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన వారు ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీల్లో పారదర్శక పాలన ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై అధికారుల స్పందన కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు.

**గమనిక:** ఈ కథనం బాధితుడు మరియు గ్రామస్తులు చేసిన ఆరోపణల ఆధారంగా రూపొందించబడింది. సంబంధిత అధికారి లేదా మచ్చ సురేందర్ స్పందన అందిన వెంటనే దానిని కూడా ప్రచురించడం సముచితం.

# టీపీసీసీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా గుండెపాక. ప్రభాకర్ నియామకం



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జులై 29 ( విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న యువ నాయకుడు గుండెపాక. ప్రభాకర్ గారిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో ప్రభాకర్ విశేష పాత్ర పోషించారు. పార్టీ అభివృద్ధి కోసం ఆయన చేసిన నిరంతర కృషి, నిబద్ధత, నాయకత్వ లక్షణాలను గుర్తించిన అధిష్ఠానం ఈ కీలక బాధ్యతను అప్పగించింది.ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు పార్టీ విజయానికి అహర్నిశలు కృషి చేస్తానని గుండెపాక. ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా నాపై నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యతలు అప్పగించిన ఏఐసిసి ఎస్సీ సెల్ చైర్మన్ రాజేంద్రపాల్ గౌతమ్ గారికి అలాగే మానకొండూరు ఎమ్మెల్యే ఎస్సీ సెల్ తెలంగాణ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ కి తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి కి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు .

# అంతర్జాతీయ కరాటేకిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు సింగరేణి విద్యార్థిని ఎంపిక

**- భూక్య శ్రీవిద్యకు స్పోర్ట్స్ కిట్ అందజేసి**
**శుభాకాంక్షలు తెలిపిన విద్యాసంస్థ ప్రతినిధులు**



కొత్తగూడెం బ్యూరో, జూలై 30(విజన్ ఆంధ్ర) : సింగరేణి కాలరీస్ ఉమెన్స్ జూనియర్ కళాశాల, కొత్తగూడెంలో జూనియర్ సీఈసీ (ఇంగ్లీష్ మీడియం) చదువుతున్న విద్యార్థిని కుమారి భూక్య శ్రీవిద్య హైదరాబాదులో ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న రెండవ అంతర్జాతీయ కరాటే & కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్కు ఎంపికైంది.కరాటే, కిక్ బాక్సింగ్ విభాగాల్లో ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన శ్రీవిద్య ఇప్పటివరకు 4 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు సాధించింది. ప్రస్తుతం ఆమె బ్లాక్ బెల్ట్ హోల్డర్‌గా కొనసాగుతోంది. ఈ సందర్భంగా విద్యార్థిని సాధించిన విజయాలను అభినందించిన సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ మేనేజర్ ఎస్. వెంకట చారి, జాయింట్ సెక్రటరీ & కరస్పాండెంట్ పి. కాంతారావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సంధ్యారాణి, పీఈటీ జి. అరుణశ్రీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.అంతర్జాతీయ పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి, రాష్ట్రానికి, సింగరేణి సంస్థకు, కళాశాలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన స్పోర్ట్స్ ట్రాక్, స్పోర్ట్స్ షూస్‌ను సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ మేనేజర్ ఎస్. వెంకట చారి విద్యార్థినికి అందజేసి విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలి

**- గేదెల పెంపకంతో పాటు పశుగ్రాస సాగుపై రైతులు దృష్టి సారించాలి,**
**- పాల ఉత్పత్తుల ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి,**
**- పాడి రైతులకు అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) జులై 29 : రైతులు కేవలం పంటల సాగుపైనే ఆధారపడకుండా వ్యవసాయానికి అనుబంధ రంగమైన పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావచ్చని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి రైతు వేదికలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాల పరిధిలోని వివిధ మండలాలకు చెందిన పాడి రైతులకు సీడ్ ఫామ్ వారి సౌజన్యంతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో పాడి పశువులకు పశుగ్రాస కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, తక్కువ నీటితో పెరిగే గడ్డి రకాలను సాగు చేయడం, పశుగ్రాస నిల్వ పద్ధతులు, పాడి పరిశ్రమలో శాస్త్రీయ యాజమాన్యంపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ డడ. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను కూడా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయానికి అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, పశుపోషణ, కోళ్ల పెంపకం వంటి రంగాలు రైతు కుటుంబాలకు అదనపు ఆదాయాన్ని అందించడంతో పాటు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పిస్తాయని, పంటల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు పాడి పరిశ్రమ రైతు కుటుంబాలకు నిత్య ఆదాయ వనరుగా నిలుస్తుందని, ముఖ్యంగా గేదెల పెంపకాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టి పాల ఉత్పత్తిని పెంచడం ద్వారా అధిక లాభాలను ఆర్జించే అవకాశం ఉందని, పాడి పశువుల పెంపకంతో పాటు వాటికి అవసరమైన పచ్చిగడ్డి, పశుగ్రాసాన్ని రైతులు తమ సొంత వ్యవసాయ భూముల్లోనే సాగు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాడి పరిశ్రమలో విజయం సాధించాలంటే గేదెలకు నాణ్యమైన ఆహారం, సమతుల్య పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం, సకాలంలో వైద్య సేవలు ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా పశు గ్రాస కొరత రాకుండా రైతులు తమ వ్యవసాయ పొలాల్లోనే నాణ్యమైన గడ్డి రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా తక్కువ నీటితో పెరిగే పశుగ్రాస పంటలను ఎంచుకొని సాగు చేస్తే పశువులకు సంవత్సరం పొడవునా పచ్చిమేత అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తుగా పశుగ్రాస నిల్వలను సిద్ధం చేసుకోవాలని, పచ్చిగడ్డిని సైలేజ్ రూపంలో భద్రపరచడం వంటి ఆధునిక పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. ఇలా చేయడం ద్వారా ఎండాకాలంలో కూడా పశువులకు మేత కొరత లేకుండా చూసుకోవచ్చని అన్నారు. రైతులు అధిక పాల దిగుబడినిచ్చే గేదెలను ఎంపిక చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పెంపకం చేపట్టాలని, పశువులకు అవసరమైన టీకాలు, ఆరోగ్య పరీక్షలు, పోషకాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. పాల ఉత్పత్తుల నాణ్యత పెరిగితే మార్కెట్‌లో మంచి ధర లభించడంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి అనేక సంక్షేమ, ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందని, పశుసంవర్ధక శాఖ ద్వారా అందించే సేవలను రైతులు పూర్తిగావినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అధికారులు గ్రామస్థాయిలో రైతులకు సాంకేతిక సలహాలు, శిక్షణ కార్యక్రమాలు, పశువైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి అవగాహన ఏర్పాటు చేసిన సంస్థను కలెక్టర్ అభినందించారు. అన్ని మండలాల్లోని రైతు వేదికల్లో రైతులకు అవగాహన కల్పించేలా ముందుకు రావాలని కలెక్టర్ సందర్భంగా సంస్థ ప్రతినిధులను కోరారు. సీడ్ ఫామ్‌కు చెందిన నిపుణులు రైతులకు పశుగ్రాస సాగులో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలు, అధిక దిగుబడినిచ్చే గడ్డి రకాలు, విత్తనాల ఎంపిక, సాగు నిర్వహణ, మేత నిల్వ పద్ధతులు, సైలేజ్ తయారీ, హైడ్రోపోనిక్ ఫోడర్, పాడి పశువుల సమతుల్య పోషకాహారం, పాల ఉత్పత్తి పెంపుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సవివరంగా వివరించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ పలు సందేహాలను నివృత్తి చేశారు.కార్యక్రమానికి హాజరైన రైతులు పాడి పరిశ్రమను లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, పశుగ్రాస నిర్వహణ పద్ధతులు తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ లచ్చిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్, వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ ఫామ్ నిపుణులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల నుంచి వచ్చిన పాడి రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కఠిన చర్యలు అవసరం

**- జాతీయ రహదారులపై ఆక్రమణలను వెంటనే తొలగించాలి,**
**- పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి,**
**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**




నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) జులై 29 : జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కఠిన చర్యలు చేపట్టాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గత సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ప్రతి అంశం పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో సూచించిన పనులు ఏ మేరకు పూర్తయ్యాయో వివరాలు తీసుకుని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నాగర్ కర్నూలు జిల్లా ఐ డి ఓ సి లోని జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూడడ రహదారులపై ఆక్రమణలు, అధిక వేగం, ట్రాఫిక్ నియమాల పట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం వంటి కారణాల వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొంటూ, వాటి నివారణకు దీర్ఘకాలిక కార్యాచరణతో పాటు తక్షణ చర్యలు కూడా చేపట్టాలని, జాతీయ రహదారులపై ఆక్రమణల తొలగింపుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. కల్వకుర్తి ప్రాంతం గుండా రెండు జాతీయ రహదారులు వెళ్తున్నందున ఆ ప్రాంతంలో రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారుల వెంట అక్రమంగా నిర్మించిన దాబాలు, దుకాణాలు, ఇతర శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి ఆక్రమణలపై ఎలాంటి ఒత్తిళ్లకు తావివ్వకుండా చట్టపరమైన చర్యలు తీసుకుని వెంటనే తొలగించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా దిశా నిర్దేశక బోర్డులు, హెచ్చరిక సూచికలు, ప్రతిబింబించే సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదకర జంక్షన్ల వద్ద బ్లింకర్ లైట్లు ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేసే చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల అధికారులు గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు తాండ్ర గేట్, తిప్పారెడ్డిపల్లి గేట్, తాండ్రకొండారెడ్డిపల్లి మార్గాల్లో జీబ్రా క్రాసింగ్‌లు, వేగ నియంత్రణ సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇదే తరహా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి సమీప రహదారిపై ఉన్న ఆక్రమణలను విజయవంతంగా తొలగించినందుకు మున్సిపల్ కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఇదే విధంగా జిల్లా వ్యాప్తంగా రహదారులను ఆక్రమించిన అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రజలకు, వాహనదారులకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలని సూచించారు. అచ్చంపేటలో ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు సంత వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్న నేపథ్యంలో, దీనికి శాశ్వత పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలపై కలెక్టర్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ స్థలంలో నూతన మార్కెట్ ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని కమిషనర్ వివరించగా, దీనిపై అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కల్వకుర్తి జాతీయ రహదారి బైపాస్‌పై తగినంత వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రాత్రివేళల్లో వెలుతురు లేక ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ఈ పనులను ప్రాధాన్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారా లేదా అని ఆర్టీవోను ప్రశ్నించిన కలెక్టర్, అన్ని పాఠశాల బస్సులు రోడ్డు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో నిరంతరం తనిఖీ చేయాలని, విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ వైద్యం అందించేందుకు ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకోసం సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి త్వరితగతిన ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల్లో అవగాహన కీలకమని పేర్కొన్న కలెక్టర్, విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించాలని అన్నారు. ముఖ్యంగా 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, పోటీలు నిర్వహించాలని, విద్యార్థుల ద్వారా కుటుంబ సభ్యులకు కూడా రోడ్డు భద్రత సందేశం చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. జాతీయ రహదారులపై అధిక వేగంతో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని పేర్కొన్న కలెక్టర్, వేగ నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల నుంచి నేరుగా జాతీయ రహదారులపైకి వచ్చే వాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయని, అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రహదారి దాటే విధానం, ట్రాఫిక్ నియమాలు, రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో చర్చించిన ప్రతి అంశాన్ని సంబంధిత శాఖలు నిర్దిష్ట గడువులో అమలు చేయాలని, రోడ్డు భద్రతను జిల్లాలో అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయంతో పని చేస్తేనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొంటూ, ప్రజల ప్రాణాల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు,వివిధ శాఖల జిల్లా అధికారులు, జాతీయ రహదారుల అధికారులు, రవాణా శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు శాఖ ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరూ పట్టు పరిశ్రమదృష్టిసారించాలని కోరిన జిల్లా కలెక్టర్




సిద్దిపేట జిల్లా ప్రతినిధి 29 జులై : జిల్లాలో వ్యవసాయం చేసేరైతులందరికీఅత్యధిక ఆదాయం సమకూర్చే పట్టుపురుగుల పెంపకం పై జిల్లా రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.హేమావతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మేరా రేషన్ మేరా అభియాన్-2.0 (నా పట్టు నా అభిమానం 2.0) కార్యక్రమం కింద జిల్లా స్థాయి భాగస్వామ్య వర్గాల సంప్రదింపుల సమావేశంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ కె. హేమావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ తెలంగాణ రాష్ట్ర నోడల్ అధికారి లత, పట్టు పరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం చేపట్టిన చర్యలను వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలలో అత్యధిక ఆదాయం సమకూర్చేది పట్టు పరిశ్రమ అని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1313 ఎకరాలలో 482 మంది పట్టు రైతులు మల్బరీ సాగు చేస్తున్నారని అన్నారు. 2026-27 సంవత్సరానికి గాని 200 ఎకరాల లక్ష్యం కాగా ఇప్పటికి 42 ఎకరాలు చేరుకోవడం జరిగిందని అన్నారు. ప్రస్తుత ఎల్ నినో తరుణంలో రైతులను పట్టు పరిశ్రమకు మార్చడం కొంచెం సులభం అవుతుందని ఈ దిశగా పట్టు పరిశ్రమశాఖ అధికారులు రైతులను మోటివేట్ చేయాలని అన్నారు. పట్టుపురుగుల పెంపకానికి మన జిల్లా అనుకూలమైనదని అదేవిధంగా మార్కెటింగ్ అవకాశాలు కూడా ఉన్నాయని అన్నారు. పట్టు పరిశ్రమ పరిశ్రమ ద్వారా రైతులకు నెలనెల ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఒక ఎకరం వరి పండించే నీటితో రెండు ఎకరాల మల్బరీ తోటలను పండించవచ్చని అన్నారు. ఒక ఎకరానికి సంవత్సరానికి 5 సార్లు పంట చేతికి వస్తుందని, 1 ఎకరాకి ఒక సంవత్సరంలో 2 నుంచి 3 లక్షల రూపాయల ఆదాయం సంపాదించవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే పట్టు పురుగుల పెంపకం ద్వారా ఆదాయాన్ని పొందుతున్న రైతులు జిల్లాలోని ఇతర రైతులకు పట్టు పరిశ్రమ ద్వారా పొందే ఆదాయాన్ని వివరించి వారికి పట్టుపురుగుల పెంపకంలో అవసరమైన సూచనలు, సలహాలు అందించి లాభదాయకమైన పట్టుపురుగుల పెంపకంపై రైతులకు ఆసక్తి కలిగేల చూడాలని అన్నారు. జిల్లాలో పట్టుపురుగుల మార్కెటింగ్ కొరకు అవసరమైతే భూమిని కేటాయిస్తానని ఈ దిశగా పట్టు పరిశ్రమ శాఖ అధికారులు జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి అధికంగా చర్యలు తీసుకోవాలని, రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విజయవంతమైన పట్టు క్షేత్రాలకు రైతులతో టూర్లు నిర్వహించాలని అన్నారు. అలాగే భూగర్భ జలాలను పెంచుకునే దిశగా రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో విబి జి రాంజీ పథకం ద్వారా ఉచితంగా ఫామ్ పాండ్లను తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేరా రేషన్ మేరా అభియాన్ 2.0 రాష్ట్ర నోడల్ అధికారి తిరుపం రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, పట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 36 గంటలు అప్రమత్తం..! భారీ వర్షాలపై కలెక్టర్ అంకిత్ హెచ్చరిక

**- అన్ని శాఖల అధికారులు కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలి**
**- ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచన**



కొత్తగూడెం బ్యూరో, జూలై 30(విజన్ ఆంధ్ర) : రానున్న 36 గంటల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. భారీ వర్షాల పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, అత్యవసర పరిస్థితుల్లో అధికారులు తమ కార్యస్థానాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.వరద ముంపు ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నదులు, వాగులు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని హెచ్చరించారు. అలాగే నీరు ప్రవహిస్తున్న రహదారులు, కల్వర్టులపై ప్రయాణించే సమయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశమున్నందున సురక్షిత తాగునీటి సరఫరా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని, గ్రామీణ నీటి సరఫరా అధికారులు తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ప్రసవ సమయం సమీపించిన గర్భిణీలను ముందుగానే సమీప ఆసుపత్రులు లేదా గర్భిణీ వసతి కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు.

విజన్ ఆంధ్ర



## అర్హులైన ప్రతి ఓటు జాబితాలో ఉండేలా చూడాలి..



సూర్యాపేట జూలై 29:(విజన్ ఆంధ్ర) : అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు జాబితాలో కొనసాగేందుకు కృషి చేయాల్సిన బాధ్యత బీఎల్ఓలు, బీఎల్ఏలపై ఉందని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. నిజమైన అర్హులైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా చూడాలని, అవసరమైన పత్రాలతో ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని కోరారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ నాయుడు, కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల మధు గౌడ్,వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్ గౌడ్, మేఘ్యా తండా సర్పంచ్ భూక్య రాజు నాయక్, ధర్మ నాయక్, దండ అరవింద్ రెడ్డి, బి ఎల్ వో లు వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ, వెంకటరమణ, రమణ, బిఎల్ఎ లు చేతుల శ్రీనివాస్, భూక్య మహేష్, ఓంకార్ పెంట భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దాల రైతుల నిరీక్షణకు తెర

- తిప్పిరెడ్డిపల్లెముదిరెడ్డిపల్లె రైతుల కల సాకారం
- ఎమ్మెల్యే తోకలిసి రూ. 8.90 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
- మైదుకూరు వ్యవసాయ రంగంలో కొత్త అధ్యాయం ఎమ్మెల్యే



మైదుకూరు,జూలై 29 (విజన్ ఆంధ్ర) దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న తిప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె గ్రామాల రైతుల కలను సాకారం చేసే దిశగా మైదుకూరు నియోజకవర్గంలో మరో చారిత్రాత్మక ఘట్టానికి నాంది పలికామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు.బుధవారం మైదుకూరు నియోజకవర్గంలో రూ. 8.90 కోట్ల వ్యయంతో చేపట్టిన తిప్పిరెడ్డిపల్లె ముదిరెడ్డిపల్లె ఎత్తిపోతల పథకం పనులకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంతోషమే ప్రభుత్వ విజయానికి నిజమైన కొలమానమని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నీటి వనరుల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందన్నారు.8.90 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే.రెండు గ్రామాల చెరువులు సమృద్ధిగా నీటితో నిండటమే కాకుండా, వేలాది ఎకరాల ఆయకట్టు భూములకు శాశ్వత సాగునీటి వసతి కల్పించనుందని తెలిపారు. వర్షాలపై ఆధారపడే పరిస్థితి తగ్గి, రైతులు ఏడాది పొడవునా వివిధ పంటలను సాగు చేసే అవకాశం లభిస్తుందని చెప్పారు. దీని వల్ల పంటల ఉత్పాదకత పెరగడంతో పాటు రైతుల ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని వివరించారు.రైతు సంక్షేమమే ప్రభుత్వ పాలనకు ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి వసతుల కల్పన, చెరువుల పునరుద్ధరణ, నీటి నిర్వహణ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా అమలు చేస్తోందన్నారు. రైతుల అవసరాలను గుర్తించి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ ఎత్తిపోతల పథకం కూడా అలాంటి ప్రజాపయోగకరమైన ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందన్నారు. మైదుకూరు శాసనసభ్యులు శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ తిప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె గ్రామాల రైతులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సాగునీటి సమస్యకు నేడు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు పడిందన్నారు. మైదుకూరు వ్యవసాయ రంగంలో కొత్త అధ్యాయం అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని, రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు.మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధిలో సాగునీటి ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్న ఎమ్మెల్యే, ఈ పథకం ద్వారా రైతులకు నీటి సమస్య శాశ్వతంగాపరిష్కారమవుతుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా రైతుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకొస్తామని హామీ ఇచ్చారు.అంతకుముందు.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి,ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ లు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇద్దరూ స్వయంగా జేసీబీ యంత్రంపైకి ఎక్కి పనులను ప్రారంభించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వేగంగా అమలవుతున్నాయనే సందేశాన్ని ఈ దృశ్యం ప్రజలకు అందించింది.కార్యక్రమానికి హాజరైన రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ, “దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న మా గ్రామాల రైతుల కల నేడు నిజమైంది. ఈ ప్రాజెక్టును మంజూరు చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారికి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి గారికి జీవితాంతం రుణపడి ఉంటాం“ అని కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, గ్రామాల పెద్దలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి ఆధ్యాత్మికతకు ప్రతీక..



సూర్యాపేట జూలై 29:(విజన్ ఆంధ్ర) : గురు పౌర్ణమి భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీక అని 20వ వార్డు కౌన్సిలర్ చెంచాల మణిలత శ్రీనివాస్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ శ్రీ సాయి దత్త మందిరంలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గురువు స్థానం దైవంతో సమానమని, మన జీవితానికి సరైన మార్గాన్ని చూపించే గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలని అన్నారు. సాయిబాబా బోధించిన శ్రద్ధ సబూరి సూత్రాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని సూచించారు.గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రేమ, సేవాభావం, మానవత్వం పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఆలయ అర్చకులు రమణ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రవీంద్రబాబు, నవిలేపూరి నరేందర్ సునీత, రాము, సుధారాణి, ప్రసాద్, రాఖీ, పావని, శివ, కక్కిరేణి మురళి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఓ లకు అందజేయాలి

- ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



గద్వాల జూలై 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్.) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఓటరు ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని, జిల్లాలో ఇప్పటికే దాదాపు 89 శాతం పూర్తయిందని, మిగిలిన 11 శాతాన్ని కూడా బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు), రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ అనంతరం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని, ఇంకా మిగిలిన 11 శాతం ఓటర్లలో కొందరి పేర్లు రెండు ప్రాంతాల్లో ఉండే అవకాశం ఉందని, తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనే సందిగ్ధంలో వారు ఉండవచ్చని పేర్కొన్నారు. ఒక ఓటరుకు ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటరు పేర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ఓటర్లు తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, మరో ప్రాంతంలోని ఓటును రద్దు చేయించుకునేందుకు సంబంధిత బీఎల్వోకు సమాచారం అందించాలన్నారు. ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లు ముసాయిద ఓటర్ల జాబితాలో నమోదు కావని, వారు తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. కావున అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని నిర్ణీత సమయంలో బిఎల్ఓ లకు సమర్పించాలని సూచించారు. రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు తమ పరిధిలో ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్లకు అవగాహన కల్పించి, వారు త్వరితగతిన పత్రాలు పూర్తి చేసి అందజేసేలా చర్యలు తీసుకోని అధికారులకు సహకరించాలన్నారు.

## ఫైర్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు



అలంపూర్ జూలై 29 (విజన్ ఆంధ్ర ) : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తా నందు ఫైర్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న అగ్నిప్రమాదాలను నివారించేందుకు అలంపూర్ నియోజకవర్గంను సస్యశ్యామలంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ఫైర్ స్టేషన్ నిర్మాణం కొరకు 15వ ఫైనాన్స్ కమిషన్ నుండి 2 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ ఫైర్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, అలాగే నియోజకవర్గ అభివృద్ధి దృష్ట్యా అలంపూర్ నియోజకవర్గ ప్రజల కల నెరవేరిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అగ్నిమాపక శాఖ పోలీసులు,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ జిల్లాలో 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వేగవంతం చేయాలి-కుష్బూ గుప్తా



మహబూబ్ నగర్మ జిల్లా ప్రతినిధి జూలై 29 (విజన్ ఆంధ్ర ): మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె ఆసుపత్రి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో ఉన్న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆ కార్యాలయాన్ని అనువైన ఇతర భవనానికి మార్చే విషయంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రికి సంబంధించిన మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా వైద్యులు, విద్యార్థులు, రోగుల కోసం పార్కింగ్ సదుపాయం, గార్డెనింగ్, మెయిన్ రోడ్ నుంచి అప్రోచ్ రోడ్ వంటి పనులను పూర్తి చేయాలని సూచించారు. రెండు నెలల్లో ఆసుపత్రిని ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగా అజ్మీరా, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల సంస్థ డి.ఈ.ఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

- మందమర్రి లో ఓ ఇంటి పైకప్పు కూలి ఒకరికి గాయాలు..
- గోదావరిలోకి భారీగా చేరుతున్న వరదనీరు





మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 29,(విజన్ ఆంధ్ర ) : గత రెండు రోజులుగా మంచిర్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుంది. ఈ వర్షానికి గోదావరిలో వరదనీరు భారీగా చేరుతుంది. జిల్లాలోని ఆయా మండలాల్లో వాగులు పొంగిపొర్లుతున్నాయి. మంచిర్యాల పట్టణంలోని రాళ్లవాగు అప్రోచ్ వంతెనకు గండిపడడంతో వరద నీరు వంతెన పైనుండి ప్రవహిస్తుంది. అంతే కాకుండా పట్టణంలోని పలు డివిజన్లో డ్రైనేజీల నీరు పెద్ద మొత్తంలో రోడ్లపై రావడమే కాకుండా వర్షపు నీరు తో రోడ్లన్నీ జలమయ్యాయి. 39వ డివిజన్లోని బృందావన కాలనీ పూర్తిగా జలమయం కావడంతో స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్టీఆర్ కాలనీ ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతోంది.సంబంధిత అధికారులు ప్రాజెక్టు దిగువ ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా ఏ క్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం ఉంటుందని సూచించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మందమరిలో ఓ ఇంటి పై కప్పు కూలి ఒకరికి గాయాలు కావడం, అక్కడక్కడ రోడ్లపై చెట్లు కులడంతో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలిగింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఆయా కాలనీలు జలమయం కావడంతో అప్రమత్తమైన మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ సంబంధిత అధికారులు కలిసి పర్యవేక్షించారు.నస్పూర్ మండలం లో పలు కాలనిలో డ్రైనేజి నీరు ఇళ్లలోకి చేరుతుందని తెలుసుకున్న మేయర్ ధరణి మధుకర్ పలు వార్డుల్లో పర్యవేక్షంచారు. అంతేకాకుండ మంచిర్యాల పట్టణంలో హైటెక్ సిటీ లోని పలు వీధుల్లో వర్షపు నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయానే చెప్పవచ్చు. రైల్వే స్టేషన్ వెనుకాల గల వినాయక ఆలయం వెనుక రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తుంది. దీంతో వాహనదారులకు, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**మురికి నీరుగా తాగునీరు...**

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి గోదావరిలో వరద ఉధృతి పెరిగింది. దీంతో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 60 డివిజన్లకు తాగునీరు సరఫరా లో పూర్తిగా మురికినీరు రావడం జరుగుతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తాగునీటిని శుద్ధిచేసి సరఫరా చేయాల్సి ఉండగా అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఎల్ నీనో ప్రభావం లేనట్టేనా?**

వర్షాకాలం ప్రారంభమై నిల గడిచిపోయినప్పటికీ రుతుపవనాలు ఆలస్యంగా రావడంతో వర్షాలు కొరకపోవడం దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కురవలసిన వర్షం ఆలస్యంగా కురవడంతో అటు రైతులు ఏ పంట వేయాలో అంత చిక్కడం లేదు. ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని అవగాహన కల్పిస్తున్నారు. కాస్త ఆలస్యంగా వర్షాలు కురుస్తుండడంతో ఎల్ నీనో ప్రభావం లేనట్టేనని పలువురు మేధావులు పేర్కొంటున్నారు.మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ లోని వాతావరణ శాఖ సూచిస్తుంది. ఇలాగే 62 రోజులు ఎలా జరుపు లేకుండా భారీ వర్షాలు కురిసినట్లయితే కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి.

## యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

-జిల్లా కలెక్టర్ ప్రియాంక.



నారాయణపేట, జూలై 29 (విజన్ ఆంధ్ర) : యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. గురు పౌర్ణిమ సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని షిరిడి సాయిబాబా మందిర ఆవరణలో స్నేహ మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించడంతో పాటు, రక్తదాత ఆరోగ్యానికి కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ తరహా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ సామాజిక సేవలో భాగస్వాములవుతున్న స్నేహ మిత్ర మండలి నిర్వాహకులను ఆమె అభినందించారు. అనంతరం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ వినీత్ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజానికి సేవ చేయడంతో పాటు ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. రక్తదాతలను, శిబిర నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ రక్తదాన శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంజుల రెడ్డి, ఆర్డీఓ రమేష్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్నేహ మిత్రమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్.

- ఊట్కూర్ లో పోలీసుల భారీ కార్డెన్ సెర్చ్.42 వాహనాలు సీజ్.
- నారాయణపేట డిఎస్పి నల్లపు లింగయ్య.



ఊట్కూర్, జూలై 29 (విజన్ ఆంధ్ర) నేరాల నియంత్రణ శాంతి భద్రత పరిరక్షణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని నారాయణపేట డిఎస్పి నల్లపు లింగయ్య అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు ఊట్కూర్ మండల కేంద్రంలో పోలీసులు భారీ కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజల రక్షణ కోసమే తనిఖీలు చేపడుతున్నామని ప్రజల్లో భయాందోళన చెందకుండా పోలీసులకు సహకరించాలన్నారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీసులు మండల కేంద్రంలోని ప్రతి వీధిని జల్లెడ పడుతూ ఇళ్లను, అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన చట్టపరమైన పత్రాలు లేని 39 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, ఒక ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భారీ సోదాల్లో నారాయణపేట సీఐ శివశంకర్, మక్తల్ సీఐ రామ్‌లాల్, ఊట్కూర్ ఎస్ఐ రమేష్‌తో పాటు మరో ఐదుగురు ఎస్ఐలు, పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట జూలై 29:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత అగ్రపథాన నిలిపేందుకు ఉపాధ్యాయులు నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో సూర్యాపేట జిల్లా ప్రచేష్టలో మొదటి స్థానాన్ని సాధించడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ బృందాన్ని అభినందించారు.

**ఆ పాత పద్ధతులు వద్దు.. కొత్తగా బోధించండి**

ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను గుర్తించి తరగతి గది బోధన సాగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా.. కృత్యాధార బోధన, ప్రయోగాలు, ప్రాజెక్టులు, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ను ఉపాధ్యాయులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. చదువుతో పాటు విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా పర్యవేక్షించడానికి ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

**తోటలో అన్ని పూలూ వికసించాలి**

ఒక తోటలోని కొన్ని మొక్కలు మాత్రమే పూలిస్తే ఆ తోటకు అందం రాదని అన్ని మొక్కలూ పూలు పూసి వికసిస్తేనే ఆ శోభనిస్తుందని, అలాగే క్లాస్ రూమ్‌లో కేవలం కొందరు విద్యార్థులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ రాణించి ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే విద్యా వ్యవస్థ అసలైన లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ ఉదాహరణతో వివరించారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాలు సాధించేలా చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత మెరుగైన స్థానంలో నింపాలని స్పష్టం చేశారు.కార్యక్రమంలో డీఈవో కే. అశోక్, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, రేణుక, సెంటర్ ఇంచార్జ్ నాగరాణి, జిల్లా రిసోర్స్ పర్సన్లు శ్రీహరి శ్రవణ్, సత్యనారాయణ రెడ్డి, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

# 22ఎ,ప్రజా రక్షణా? లేక ప్రజా దోపిడీనా?

- ప్రతి సంతకానికి ఒక రేటు...

- ఎన్‌ఓసి పేరుతో సామాన్యుడి రక్తం తాగుతున్న వ్యవస్థ.

ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,జులై 29,(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ ఆస్తులను కాపాడాలన్న నిస్వార్థ ఉద్దేశంతో పుట్టిన సెక్షన్ 22ఎ నిబంధన నేడు తెలంగాణలో అతిపెద్ద"లైసెన్స్ స్కామ్"గా రూపాంతరం చెందింది. ప్రజలను కాపాడాల్సిన చట్టమే ప్రజల గొంతు పిసుకుతోంది. ఇది పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు.ఇది రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు,మధ్యతరగతి కుటుంబాలు,ఉద్యోగులు, ఎన్నారైల ఆస్తి హక్కులపై జరుగుతున్న వ్యవస్థీకృత దాడి.

**కల్పవృక్షంగా మారిన 22ఎ...**

22ఎ యొక్క అసలు లక్ష్యం ప్రభుత్వ, దేవాదాయ,వక్ఫ్, చెరువు, కుంట భూములను కబ్జాల నుండి కాపాడటం.కానీ ఈరోజు ఆ చట్టం రివర్స్ లో పని చేస్తోంది.రికార్డులను సరిగా పరిశీలించకుండా,గుడ్డిగా గానీ లేక అవినీతి ఉద్దేశంతో గానీ దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న పట్టా భూములను,రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉన్న ప్రైవేటు ఆస్తులను కూడా నిషేధిత జాబితాలోకి నెడుతున్నారు. ఇక్కడి నుండే అసలు "బిజినెస్"మొదలవుతుంది. భూమి 22ఎ లో ఉందని తెలియగానే పైరవీకారుల బృందం రంగంలోకి దిగుతుంది."సార్,మీ ఫైలు ఇరికించారు. ఎన్‌ఓసి కావాలంటే ఇంత ఇవ్వాలి" అని ఓపెన్ గా బేరం జరుగుతుంది.లక్షలు,కోట్లు చేతులు మారితే రాత్రికి రాత్రే ఆ భూమి 22ఎ నుండి "మాయమైపోతుంది".డబ్బు ఇవ్వలేని వాడి ఫైలు మాత్రం తహసీల్దార్ టేబుల్ నుండి కలెక్టర్ టేబుల్ కు,అక్కడి నుండి హైదరాబాద్ కు సంవత్సరాల తరబడి చుట్టూ తిరుగుతుంది.ఇది చట్టమా? లేక డబ్బున్న వారికి ఉన్న చట్టమా?

**రైతు నడుము విరుస్తున్న నిబంధన...**

వ్యవసాయం ఇప్పటికే సంక్షోభంలో ఉంది.పైగా 22ఎ రైతు మెడకు ఉరి లాంటిదైంది. పంట చేతికి రాలేదు,అప్పు తీర్చాలి.పిల్లల పెళ్లి ఉంది, చదువుకు డబ్బు కావాలి. ఆపదలో ఆదుకునే ఆస్తి భూమి.కానీ ఆ భూమే 22ఎ లో చిక్కుకుంటే రైతు ఏం చేయాలి? అమ్మలేడు,తాకట్టు పెట్టలేడు,బ్యాంకు లోన్ రాదు. ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల వరకు వెళ్తున్న దుస్థితి."రైతు సంక్షేమం" అని చెప్పుకుంటూనే రైతు ఆస్తిని బందీ చేయడం ఏ రకమైన న్యాయం?

**కూలిపోతున్న మధ్యతరగతి కలలు...**


30 ఏళ్లు ఉద్యోగం చేసి,ఒక్కో రూపాయి పొదుపు చేసి సొంతింటి కలను నెరవేర్చుకుందామనుకునే మధ్యతరగతి వాడికి 22ఎ ఒక పెద్ద శాపం.రిజిస్ట్రేషన్ రోజు "మీ ప్లాట్ 22ఎ లో ఉంది సార్"అనే ఒకే ఒక మాటతో జీవితకాల కలలు కూలిపోతున్నాయి.ఎన్‌ఓసి కోసం నెలలు,సంవత్సరాలు కార్యాలయాల చుట్టూ తిరగాలి.లాయర్లకు లక్షలు పోయాలి.చివరికి విసిగి వేసారి "ఉన్నది ఉన్నట్టు అమ్మేస్తా" అని కూడా అనలేని స్థితి.ఇది ప్రజలకు ఇస్తున్న గౌరవమా?

**డిజిటల్ తెలంగాణలో పారదర్శకత శూన్యం...**

"డిజిటల్ ఇండియా","డిజిటల్ తెలంగాణ"అని గొప్పగా చెప్పుకుంటున్నాం.కానీ 2026 లో కూడా ఒక్క ఎన్‌ఓసి కోసం ఫైలు ఏ టేబుల్ పై ఉందో తెలుసుకోవడానికి ఆర్టిఐ వేయాల్సిన దుస్థితి.ఆన్‌లైన్ ట్రాకింగ్ లేదు,టైం లిమిట్ లేదు,జవాబుదారీతనం లేదు. జాప్యం చేసిన అధికారిపై చర్య ఉండదు.గరిష్టంగా బదిలీ. దీనివల్ల అవినీతికి మరింత ప్రోత్సాహం లభిస్తోంది.

**ప్రభుత్వం తక్షణం5 కీలక చర్యలు చేపట్టాలి.**

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను సీరియస్ గా తీసుకోవాలి.లేకుంటే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతుంది. రాష్ట్రవ్యాప్త సమీక్ష నిర్వహించి,రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక కమిటీ వేసి 22ఎ జాబితాను పూర్తిగా పరిశీలించాలి.తప్పుగా చేర్చిన ప్రైవేటు పట్టా భూములను 90 రోజుల్లో తొలగించాలి.




కాలపరిమితి చట్టం చేసి, ఎన్‌ఓసి జారీకి చట్టబద్ధంగా 30 రోజుల గరిష్ట గడువు విధించాలి.గడువు దాటితే ఆటోమేటిక్ గా ఎన్ ఓ సి వచ్చేలా చట్టం తేవాలి.100 శాతం పారదర్శకత పాటించి, ప్రతి ఎన్ ఓ సి అప్లికేషన్ కు ఆన్‌లైన్ ట్రాకింగ్ నంబర్ ఇవ్వాలి.ఏ అధికారి వద్ద ఎన్ని రోజులు పెండింగ్ ఉందో ప్రజలకు తెలిసేలా చేయాలి. గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సెల్ ఏర్పాటుచేసి,ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక 22ఎ ఫిర్యాదుల పరిష్కార కేంద్రం ఏర్పాటు చేయాలి. కఠిన విచారణ చేపట్టి, ఎన్‌ఓసి పేరుతో జరుగుతున్న అవినీతి, దోపిడీలపై ఏసీబీ తో విచారణ జరిపి బాధ్యుల ఆస్తులు జప్తు చేయాలి.ప్రజల ఆస్తి హక్కు రాజ్యాంగం ఆర్టికల్ 300ఎ ప్రకారం ప్రాథమిక హక్కు. దాన్ని ఒక సంతకం,ఒక ఎన్‌ఓసి పేరుతో నిలిపివేయడం రాజ్యాంగ ఉల్లంఘనే.22ఎ ని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం వాడకుండా,ప్రైవేటు ఆస్తులపై దోపిడీకి సాధనంగా వాడితే ప్రజలు ఎవరిని నమ్మాలి? ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కోవాలి.చట్టానికి దాని పవిత్రతను తిరిగి ఇవ్వాలి. లేకుంటే ఈ"అధికారిక దోపిడీ" చరిత్రలో ఒక నల్లని అధ్యాయంగా మిగిలిపోతుంది.

# "ఎఫ్ ఆర్ సి: రికార్డా? రుజువా?"

- "ఫ్యామిలీ రిజిస్టర్: ఆశలు రేపి, ఆశాభంగం చేస్తున్న సర్టిఫికెట్"

- "22ఎ తర్వాత ఎఫ్ ఆర్ సి... ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నారా?"

ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో,జులై 29,(విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లి'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్' పై ప్రజల్లో భారీ అంచనాలు ఉన్నాయి. మీసేవ,ఆన్‌లైన్,యాప్ ద్వారా సులభంగా వస్తుందని చెప్పడంతో "ఇదేమైనా కొత్త ఆస్తి పత్రమా?" అనే ఆశ పడ్డారు.కానీ ప్రభుత్వమే క్లారిటీ ఇచ్చింది.ఎఫ్ ఆర్ సి కేవలం కుటుంబ వివరాల రికార్డు మాత్రమే.దీనితో ఆస్తి హక్కు రాదు,వారసత్వం రాదు,సంక్షేమ పథకాలకు అర్హత రాదు.రేషన్ కార్డ్ నంబరే ఎఫ్ ఆర్ సి నంబర్ అంటే,కొత్తగా ఇచ్చేది ఏముంది? ఇక్కడే అసలు ప్రశ్న వస్తుంది.22ఎ లాంటి చట్టాలతో ఇప్పటికే ప్రజలు ఆస్తుల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు.అలాంటి సమయంలో "ఇది కేవలం రికార్డే"అనే సర్టిఫికెట్ ఎందుకు? ప్రజలు ఆశపడి, మీసేవకు వెళ్ళి,ఫీజు కట్టి తెచ్చుకున్నాక "ఇది పనికిరాదు"అంటే నిరాశే మిగులుతుంది.ప్రభుత్వం ఉద్దేశం మంచిదే కావచ్చు- డేటా క్రోడీకరణ కోసం.కానీ దాని పరిమితులను మొదటి నుండే పెద్ద అక్షరాలతో చెప్పాలి.ఎఫ్ ఆర్ సి ని ఆయుధంగా కాకుండా, సమాచార సాధనంగా మాత్రమే చూడాలి.లేకుంటే ఇది కూడా మరో "ఎన్.ఓ.సి" లాగా పైరవీలకు,బిల్లింగ్ లకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రభుత్వం చేయాల్సింది,ఎఫ్ ఆర్ సి విలువ ఏంటో,ఎందుకు పనికిరాదో ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలి.లేకుంటే "సర్టిఫికెట్ ఉంది కదా,ఆస్తి మాదే"అనే కొత్త గొడవలు మొదలవుతాయి.రికార్డు అవసరమే.కానీ రికార్డు పేరుతో ప్రజల ఆశలతో ఆడుకోవద్దు.

## భట్టుపల్లిలో ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 29 ( విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వ భూముల రక్షణ, వాటి వివరాలపై స్పష్టత అత్యంత ముఖ్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.బుధవారం కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామ పరిధిలో గతంలో స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత భూమికి సంబంధించిన పూర్తి వివరాలను తహసీల్దార్ రాజును అడిగి తెలుసుకున్నారు. భూమి కేటాయింపుకు సంబంధించిన రికార్డులు, మ్యాపులను పరిశీలించి, వాటిలో నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి భూమి హద్దులను ప్రత్యక్షంగా పరిశీలించారు. భూమి ఎక్కడి నుంచి ఎక్కడి వరకు విస్తరించి ఉందనే అంశంపై స్పష్టత పొందుతూ, భూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులు ఒకే విధంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల రక్షణ, వాటి సక్రమ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో సర్వేయర్ స్టాలిన్, ఆర్ఐ కృష్ణ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి..



సూర్యాపేట జూలై 29:(విజన్ ఆంధ్ర) : వినియోగదారుల మన్ననలు పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. బుధవారం సూర్యపేట జిల్లా కేంద్రంలో 60 ఫీట్ రోడ్డు పాత స్నేహ చికెన్ సెంటర్ బిల్డింగ్ ఎస్ఎస్ వుడెన్ ఫర్నిచర్ షాపును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట పట్టణం వ్యాపార రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని, స్థానికంగా నాణ్యమైన ఉత్పత్తులు అందించే సంస్థలకు ప్రజలు మంచి ఆదరణ కల్పిస్తున్నారని తెలిపారు. ఎస్ఎస్ వుడెన్ ఫర్నిచర్‌లో సొంత తయారీతో ఇంటికి అవసరమైన అన్ని రకాల వుడెన్ ఫర్నిచర్ అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు వెళ్లకుండానే ఆధునిక డిజైన్లలో నాణ్యమైన ఫర్నిచర్‌ను సూర్యాపేటలోనే పొందే అవకాశం కల్పించడం వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కొండపల్లి దిలీప్ రెడ్డి, చినుముల సునీల్ రెడ్డి, జహీర్, స్థానిక కౌన్సిలర్ తహేర్,నాయకులు అబ్దుల్ రహీం,లక్ష్మాధి, గుణగంటి సతీష్, తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, ఫరూక్, ఆలేటి మాణిక్యం, దారపునేని శ్రీనివాస్ రావు, వల్లెం శేఖర్, రేపాల శ్రీనివాస్, వెంకట కృష్ణారావు, శ్రీనివాస్ రెడ్డి, నిర్వాహకులు వేమూరి సింధు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి..



సూర్యాపేట జూలై 29:(విజన్ ఆంధ్ర) : సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 18వ వార్డు సాయిబాబా మందిరంలో ఇండస్ట్రియల్ ఏరియాలో మాజీ కౌన్సిలర్ మాలోతు కమల చంద్రునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పర్వదినమని అన్నారు. సాయిబాబా బోధించిన శ్రద్ధ, సబూరి, సేవా భావం ప్రతి ఒక్కరి జీవితానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అన్నదానం మహాదానమని, ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. సాయిబాబా కృపతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జయ స్కూల్ కరస్పాండెంట్ వేణుగోపాల్, నిమ్మల వెంకన్న, నిఖిల్, రమేష్ నాయుడు, శంకర్ నాయక్, వంశీ, శ్రీను, శకుంతల, తులసి, లక్ష్మమ్మ, మౌనిక, చారి, మన్సూర్ రెడ్డి కళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్లతో మధ్యాహ్న భోజన పథకంలో నూతన అధ్యాయం

- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
- దేశానికే ఆదర్శంగా జిల్లాలో విజయవంతంగా అమలు
- చెన్నూరు మండలం కొత్తపేట జెడ్పి హైస్కూలు స్మార్ట్ కిచెన్, మైదుకూరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరిశీలన







కడప,జూలై 29 (విజన్ ఆంధ్ర) ప్రతి విద్యార్థికి నాణ్యమైన, పరిశుభ్రమైన, వేడివేడి భోజనం అందించడమే లక్ష్యంగా గతంలో వంట ఏజెన్సీల నిర్వహణలో ఎదురైన లోపాలను అధిగమిస్తూ. జిల్లాలో అమలు చేస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ మధ్యాహ్న భోజన పథకంలో గుణాత్మక మార్పుకు నాంది పలుకుతోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు.బుధవారం చెన్నూరు మండలం కొత్తపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో నూతనంగా అమలులోకి తీసుకువచ్చిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ నిర్వహణ, అమలు తీరును, అలాగే మైదుకూరు మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తపేట జెడ్పి ఉన్నత పాఠశాలలోని స్మార్ట్ కిచెన్‌ను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అత్యాధునిక సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో మధ్యాహ్న భోజన పథకం చిన్నచిన్న వంట ఏజెన్సీల నిర్వహణలో ఉండడంతో పరిశుభ్రత, ఆహార నాణ్యత, పరిమాణం, సమయానికి సరఫరా వంటి అంశాల్లో కొన్ని సమస్యలు ఎదురయ్యేవని అన్నారు. ఆ పరిస్థితులకు పూర్తిగా స్వస్తి పలికేలా జిల్లాలో వినూత్నంగా సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో స్మార్ట్ కిచెన్ల ద్వారా రోజుకు దాదాపు 35 వేల మంది విద్యార్థులకు పరిశుభ్రమైన, రుచికరమైన, పోషక విలువలు కలిగిన వేడివేడి తాజా భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఈ వ్యవస్థను మరింత విస్తరించి జిల్లాలో రోజుకు సుమారు లక్ష మంది విద్యార్థులకు స్మార్ట్ కిచెన్ కేంద్రాల నుంచి నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించే బృహత్తర కార్యక్రమాన్ని విస్తరించనున్నామని వెల్లడించారు.స్మార్ట్ కిచెన్లలో ఆధునిక యంత్రాలతో పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఆహార తయారీ నుంచి పాఠశాలలకు చేరే వరకు ప్రతి దశలో కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఇంటి భోజనాన్ని తలపించేలా రుచికరమైన, పోషకాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ల విజయవంతమైన నిర్వహణలో మహిళా సంఘాల పాత్ర ప్రశంసనీయమని కలెక్టర్ అన్నారు. వారి సమర్థ నిర్వహణ వల్ల వ్యవస్థ సమర్థవంతంగా కొనసాగుతోందని, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. అందుతున్న సూచనలను పరిగణనలోకి తీసుకుని సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని అధికారులనుఆదేశించారు.

**ఎమ్మెల్యే తో కలిసి మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరిశీలన**

మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పాఠశాల భవనాలను. స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యలను విద్యార్థులు, అధ్యపకులతో మాట్లాడి తెలుసుకున్నారు. కొండపేట కార్యక్రమంలో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, కడప ఆర్డీవో మురళి,డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, పీఆర్ ఎస్ఈ మద్దన్న, ఏపీసీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, పీఆర్, ఎస్ఎస్ఏ, ఎంపీడీవోలు, ఎంఈఓలు, కిచెన్ మేనేజర్లు, ఫుడ్ ట్రక్కు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి నేర్చుకోవాలి ప్రతి విద్యార్థి ఎదగాలి




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 29.(విజన్ ఆంధ్ర ) : కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు మరియు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించే ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆసిఫాబాద్ లో ప్రారంభమైనది. ఈ సందర్భంగా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి నేర్చుకోవాలి ప్రతి విద్యార్థి ఎదగాలి" అనే లక్ష్యాన్ని పెట్టుకొని వ్యాయామ ఉపాధ్యాయులు మరియు ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు పనిచేయాలని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన, క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందిస్తారని, నేటి డిజిటల్ యుగంలో విద్యార్థుల శారీరక చురుకుదనాన్ని పెంచి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వారు ముఖ్యమైన బాధ్యతను నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు ప్రత్యేక అవసరాలు గల ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా బోధన అందించడం ద్వారా సమ్మిళిత విద్య లక్ష్యాలను సాకారం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించడం విద్యా వ్యవస్థ యొక్క ప్రధాన బాధ్యత అని, ఆ బాధ్యతను విజయవంతంగా నిర్వహించడంలో ప్రత్యేక విద్య ఉపాధ్యాయుల సేవలు అమూల్యమని అన్నారు. ఈ మూడు రోజుల శిక్షణలో ఆధునిక బోధనా పద్ధతులు, విద్యార్థుల శారీరకమానసిక వికాసం, క్రీడా నిర్వహణ, యోగా, ఫిట్ ఇండియా కార్యక్రమాలు, సమ్మిళిత విద్య, వ్యక్తిగత విద్యా ప్రణాళిక (×జూా), సహాయక బోధనా సామగ్రి వినియోగం, అభ్యాస లోపాల గుర్తింపు, విద్యార్థుల సమగ్ర మూల్యాంకనం, తల్లిదండ్రులతో సమన్వయం వంటి అంశాలపై నిపుణులు విస్తృతంగా శిక్షణ అందించారని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రతి ఉపాధ్యాయుడు తన పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని వెలికితీయడానికి కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుని ప్రభావం తరగతి గది గోడలకే పరిమితం కాకుండా సమాజ నిర్మాణంపై కూడా ఉంటుందని, అందువల్ల ప్రతి ఉపాధ్యాయుడు మార్పుకు మార్గదర్శిగా నిలవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ శ్రీనివాస్ వ్యాయామ విద్యా రిసోర్స్ పర్సన్లు హరికృష్ణ, రమేష్ విజయ్, హేమాజీ మరియు ప్రత్యేక విద్యా రిసోర్స్ పర్సన్లు అశ్విని, చంద్రశేఖర్, రాయమల్లు, వెంకటరమణ, వివిధ మండలాల నుంచి వచ్చిన వ్యాయామ మరియు ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భట్టుపల్లిలో ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి..



హనుమకొండ బ్యూరోచీఫ్ జూలై 29(విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వ భూముల రక్షణ, వాటి వివరాలపై స్పష్టత అత్యంత ముఖ్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.బుధవారం కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామ పరిధిలో గతంలో స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత భూమికి సంబంధించిన పూర్తి వివరాలను తహసీల్దార్ రాజును అడిగి తెలుసుకున్నారు. భూమి కేటాయింపుకు సంబంధించిన రికార్డులు, మ్యాపులను పరిశీలించి, వాటిలో నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి భూమి హద్దులను ప్రత్యక్షంగా పరిశీలించారు. భూమి ఎక్కడి నుంచి ఎక్కడి వరకు విస్తరించి ఉందనే అంశంపై స్పష్టత పొందుతూ, భూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులు ఒకే విధంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల రక్షణ, వాటి సక్రమ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో సర్వేయర్ స్టాలిన్, ఆర్ఐ కృష్ణ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణమ్మ కు ప్రత్యేక పూజలు

*జూరాల కుడి కాలువ కు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి*



గద్వాల జూలై 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడికాలువ కు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి సాగు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా ప్రజలందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. నీళ్ల విడుదల చేయడానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కి, నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి కి, జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావుకి,మంత్రి వాకిటి శ్రీహరి కి సహచర ఎమ్మెల్యేలకు గద్వాల నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎలినోవా ప్రవాహంతో ఎక్కువ వర్షం పాతం నమోదు కాలేదు, వర్షం లేకపోవడం వల్ల నీళ్ల ఇబ్బంది ఉందని అన్నారు. అయినా కూడా ప్రభుత్వం సీఎం ఉమ్మడి జిల్లా ప్రాంత వాసి కాబట్టి రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు కాబట్టి రైతులకు పంటలు వేసుకునే నాట్లు వేసుకునే సమయంలో కొంత మేరకు నీళ్లటిని విడుదల చేయడం జరుగుతుంది. 30 లక్షల ఎకరాలకు నీళ్లు అందించడం జరుగుతుందని తెలిపారు.రైతులు నీటిని వృధా చేయకుండా వినియోగించుకోవాలని,రెండు పంటలకు ఉపయోగించుకోవాలని, దశలవారీగా నీటిని వినియోగించుకోవాలని సూచించారు. నడిగడ్డ లో ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామన్నారు. జూరాలకు వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకుని నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా ర్యాలంపాడు, గూడెందొడ్డి పంపు మోటార్లు ఇప్పటికే ఆన్ చేశామని, రిజర్వాయర్ల ద్వార కాలువలకు సాగు నీరు వదలడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు రైతులు, అధికారులు, కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు నో చెప్పండి ఆరోగ్యకరమైన జీవితానికి అవును చెప్పండి



భూపాలపల్లి జిల్లా:29 జూలై ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. నషాముక్త్ యువ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక "నషాముక్త్ యువ వికసిత్ భారత్" కార్యక్రమంలో భాగంగా ఈరోజు కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ సీఐ డి. నరేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక మరియు ఆర్థిక దుష్పరిణామాలను వివరించారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. "జష్ట్రశీశంవ ఎముశ్రీష్ట్ర జష్ట్రశీశంవ నాఱటవ ఝుఎ చీశ్‌శీ ణతీబస్త్రం" అనే నినాదంతో విద్యార్థులందరూ డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా దూరంగా ఉంచేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీఐ డి. నరేష్ కుమార్ మాట్లాడుతూ యువత తమ జీవిత లక్ష్యాలపై దృష్టి సారించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడలు, వ్యాయామం, పుస్తక పఠనం, నైపుణ్యాభివృద్ధి వంటి మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని, చెడు స్నేహాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పిల్లల ప్రవర్తనలో ఏవైనా అనుమానాస్పద మార్పులు గమనిస్తే వెంటనే వారికి కౌన్సెలింగ్ అందించి అవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువతే దేశ భవిష్యత్తు అని, ఆరోగ్యవంతమైన యువశక్తితోనే వికసిత్ భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొంటూ ప్రతి విద్యార్థి సమాజంలో డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు అధికారులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు

## కొత్త సార్సాల గ్రామపంచాయతీలో అంతర్జాతీయ పులుల ఉత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు



కొత్త సార్సాల, జూలై 29 (విజన్ ఆంధ్ర): కొమురం భీం జిల్లా కొత్త సార్సాల గ్రామ పంచాయతీలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పులి దాడిలో పశువులను కోల్పోయిన బాధిత కుటుంబాల ఇళ్ల వద్ద మామిడి మొలకలను నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పులుల సంరక్షణతో పాటు అటవీ ప్రాంతాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం ఎంతో అవసరమని, మొక్కలను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చన్నారు. పులి దాడుల్లో పశువులను కోల్పోయిన కుటుంబాలకు అధికారులు పరామర్శలు తెలిపారు. అటవీ ప్రాంతాలకు సమీపంగా నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడవి జంతువుల సంచారంపై సమాచారం అందిన వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని కోరారు. గ్రామంలో నాటిన మామిడి మొలకలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని గ్రామ పంచాయతీ ప్రతినిధులు తెలిపారు. మొక్కలకు నీరు పోయడం, కంచెలు ఏర్పాటు చేయడం వంటి చర్యలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐ=ా పటేకార్, ఖీదీూ సత్యనారాయణ, పుల్ల శ్రీకాంత్, ఉప సర్పంచ్ సుమలత, బేస్ క్యాంపు సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామస్థుల ప్రశంసలు అందుకుంది. పులుల సంరక్షణతో పాటు ప్రకృతి పరిరక్షణకు కూడా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణను ఆకస్మికంగా పరిశీలించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29:(విజన్ ఆంధ్ర) కోమరం భీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల విషయాల వారీ శిక్షణ కార్యక్రమాన్ని రెండవ రోజు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. శిక్షణ జరుగుతున్న ప్రతి సబ్జెక్టు తరగతిని సందర్శించిన ప్రాజెక్ట్ అధికారి ఒక్కో తరగతిలో సుమారు గంటసేపు ఉపాధ్యాయులతో కలిసి కూర్చొని శిక్షణా విధానాన్ని శ్రద్ధగా పరిశీలించారు. శిక్షకులు బోధిస్తున్న అంశాలను ఆసక్తిగా విని, ఉపాధ్యాయులతో పరస్పరం చర్చిస్తూ బోధనలో నాణ్యత, వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యాస ఫలితాలపై పలు సూచనలు చేశారు. శిక్షణ అనేది కేవలం హాజరు కార్యక్రమంగా కాకుండా, ప్రతి ఉపాధ్యాయుడి వృత్తి నైపుణ్యాలను పెంపొందించే అవకాశంగా భావించి పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ప్రాజెక్ట్ అధికారి స్వయంగా శిక్షణా తరగతుల్లో పాల్గొని పరిశీలించడం ఉపాధ్యాయుల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, పీఎంఆర్సీ ఏసీఏఎంఓ పూర్క ఉద్ధవ్, జీసీడీఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు, కోర్సు డైరెక్టర్ k రవీందర్ ప్రధానోపాధ్యాయులు, లింభారావు RPS శిక్షణ సమన్వయకర్తలు మరియు వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొన్నారూ.

## గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 29.(విజన్ ఆంధ్ర) గురు పౌర్ణమి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క బుధవారం ఆసిఫాబాద్ పట్టణం లోని శ్రీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సాయిబాబా ఆశీస్సులు తీసుకుని జిల్లా ప్రజలు సుఖశాం తులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజల సంక్షేమం మరింత ముందుకు సాగాలని, రైతులు, గిరిజనులు, పేద ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు.అనంతరం ఆలయ అర్చ కులు సుగుణక్కకు తీర్థ ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల మంగ, ఆసిఫాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపర్తి మురళి, డీసీసీ ప్రధాన కార్యదర్శి గాదెవేణి మల్లేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణ, రాము, బిల్లా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ప్రాజెక్టులతో భూపాలపల్లి అభివృద్ధికి కొత్త ఊపు




భూపాలపల్లి జిల్లా: 29 జూలై (విజన్ ఆంధ్ర) బుధవారం రోజున సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే OC-II ప్రాజెక్ట్ లో మొదటి షిఫ్ట్ ప్రారంభానికి ముందు ఏరియా జనరల్ మేనేజర్ ఎ. రాజేశ్వర్ రెడ్డి సందర్శించారు .ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన 56వ వార్షిక భద్రతా పక్షోత్సవం2025లో రాజ మైన్స్ గ్రూప్II గనుల విభాగంలో కె టి కె ఓసీ -II ప్రాజెక్ట్ "ఫస్ట్ ప్రైజ్" సాధించడం పట్ల అధికారులను , ఉద్యోగులను, సిబ్బంది అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు సాధించడం వెనుక ప్రతి ఉద్యోగి చూపిన అప్రమత్తత, భద్రతా నిబంధనల పట్ల అంకితభావం, సమిష్టి కృషి ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, గనుల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఇటువంటి విజయాలు సాధ్యమవుతున్నాయని ఆయన అన్నారు. ఇదే క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరు, జట్టు స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరిన్ని భద్రతా అవార్డులు సాధించి ktk oc -II ప్రాజెక్ట్ తో పాటు భూపాలపల్లి ఏరియాకు, సింగరేణి సంస్థకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఉద్యోగులను ప్రోత్సహించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం మరియు కార్మిక సంఘాల సహకారంతో తాడిచెర్ల బ్లాక్2 సింగరేణికి కేటాయించబడడం సంస్థ అభివృద్ధికి ఎంతో కీలకమైన ముందడుగని తెలిపారు. అలాగే పీవీఎన్ఆర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అనుమతులు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. ఈ రెండు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చిన అనంతరం భూపాలపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరిగి, సంస్థ ఉత్పాదకత మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. భవిష్యత్తులో భూపాలపల్లి ఏరియా మరింత అభివృద్ధి చెంది సింగరేణిలో కీలక ఉత్పత్తి కేంద్రంగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలని, ప్రమాదరహిత గనుల నిర్వహణే సంస్థ అభివృద్ధికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో OC-II ప్రాజెక్ట్ ఆఫీసర్ దొంత శ్యామ్ సుందర్, మేనేజర్ దీ. రమాకాంత్, సేఫ్టీ ఆఫీసర్ శివ కుమార్ , సంక్షేమాధికారి ఎస్. సాధన్, ఇంజనీర్లు రాజశేఖర్, ప్రశాంత్, జీవన్, అధికారులు ఉమా మహేశ్వర్ రావ్, కిరణ్ కుమార్, అధికారుల సంఘం పిట్ కార్యదర్శి భూక్యా మోహన్, గుర్తింపు మరియు ప్రాతినిధ్య కార్మిక సంఘాల బ్రాంచ్ నాయకులు ఏం.రమేష్, మధుకర్ రెడ్డి , పిట్ కార్యదర్శులు కరీముల్లా, పి.క్రిష్ణ , ktk oc -II, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి తాగునీరు అందించడమే మా లక్ష్యం

**- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**




సూర్యాపేట జూలై 29:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు.బుధవారం సూర్యాపేట పట్టణానికి త్రాగునీరు అందించే వాటర్ ట్యాంక్ లను, ఫిల్టర్ బెడ్ లను పరిశీలించి వాటిని పునరుద్ధరించి మంచినీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరిచి, ప్రజలకు నిరంతరాయంగా, సమృద్ధిగా తాగునీరు అందించడమే లక్ష్యంగా అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. పట్టణంలో తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, అవసరమైన చోట్ల పైప్‌లైన్ల విస్తరణ, మరమ్మతులు, నీటి సరఫరా వ్యవస్థ బలోపేతం వంటి పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సూర్యాపేటలో ప్రతి కుటుంబానికి నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే మా లక్ష్యం అని రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధారవత్ వీరన్న నాయక్, స్థానిక కౌన్సిలర్లు సంద్రపాటి విజయ్ కుమార్, బండారు మంగమ్మ వెంకన్న, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, షేక్ జహీర్, గుణగంటి హేమ సతీష్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి,మొరిశెట్టి లక్ష్మాధి,మాజీ కౌన్సిలర్ లింగా నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగెల్లి అరుణ్ కుమార్, సాజిద్ ఖాన్, నరేందర్ నాయుడు, రాచకొండ శ్రీనివాస్, సైదిరెడ్డి(మార్బుల్), జూలకంటి నాగరాజు, జిన్నా చంద్రారెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ నగర్ పేదల గుడిసెల కూల్చివేత అత్యంత దుర్మార్గం బాధితులకు అండగా నిలిచి పోరాడతాం!

**- బిజెపి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కాంటెస్టెడ్ కాండిడేట్ రావు పద్మ రెడ్డి.**



కాజీపేట న్యూస్ జులై 29 ( విజన్ ఆంధ్ర ) : కాజీపేటలోని వైఎస్సార్ నగర్ (వైస్సార్ నగర్ ) లో దశాబ్దాలుగా నివాసముంటున్న పేద ప్రజల గుడిసెలను అక్రమంగా, అన్యాయంగా కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము అని లిబిజెపి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కాంటెస్టెడ్ కాండిడేట్ రావు పద్మ రెడ్డి తెలిపారు.ఈ రోజు కాజీపేట వైఎస్సార్ నగర్‌ను స్థానిక 62వ డివిజన్ అధ్యక్షులు మేకల శ్రావణ్ యాదవ్, 63వ డివిజన్ అధ్యక్షులు రేణుకుంట్ల కల్యాణ్, 47వ డివిజన్ అధ్యక్షులు గంధసిరి శ్రీకాంతలతో కలసి రావు పద్మ రెడ్డి గారు స్వయంగా సందర్శించి, నివాసాలు కోల్పోయిన పేద కుటుంబాలను పరామర్శించడం జరిగింది.సుమారు 20 ఏళ్లుగా అక్కడ నివాసముంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదల బతుకులను ఒక్కసారిగా ఆందోళనలోకి నెట్టేయడం దారుణం. ఇంట్లో యజమానులు లేని సమయం చూసి, ఆకస్మికంగా గుడిసెలను బయట వ్యక్తులు వచ్చి కూల్చివేయడం అత్యంత అమానుష చర్య. అధికార, రాజకీయ అండదండలతోనే ఈ రకమైన దౌర్జన్యాలు జరుగుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్యాయం జరుగుతుండగా బాధితులు 'ఐఋశ్రీ 100'కి ఫోన్ చేసి సాయం కోరినా ఎలాంటి స్పందన లేకపోవడం అధికార యంత్రాంగం మరియు పోలీసు శాఖ వైఫల్యానికి నిదర్శనం. వైఎస్సార్ నగర్ గుడిసేవాసులకు పునరావాసం కల్పించి, పరిహారం అందించే వరకు పేదల పక్షాన నిలబడి చివరి వరకు పోరాడతాం అని, వైఎస్సార్ నగర్ బాధితులకు లేదా అక్కడ నివాసముంటున్న పేద ప్రజలకు ఏ చిన్న హాని లేదా అన్యాయం జరిగినా, దానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారే సంపూర్ణ బాధ్యత వహించాలి అని, పేదల పొట్టగొట్టే రాజకీయాలను, అక్రమ కూల్చివేతలను సహించేది లేదు అని హెచ్చరిస్తూ బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు అని రావు పద్మ రెడ్డి గారు స్పష్టం చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం ఓరుగల్లు నుండే మరో ఉద్యమం

**- ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల జాబితాను ప్రభుత్వానికి అందజేస్తాం**

**- ప్రభుత్వం ఉద్యమకారుల వివరాలను సేకరించే క్రమంలో పారదర్శకత లోపించింది.**


**- తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళి.**

**- తెలంగాణ మలిదశ ఉద్యమకారుల హక్కుల సాధన కమిటీ కన్వీనర్ రావు అమరేందర్ రెడ్డి వెల్లడి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి జులై 29 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలు, వేలాది మంది ఉద్యమకారుల పోరాటాలు మరవలేనివని, ఇటీవల ఏర్పాటు చేసిన కమిటీల ద్వారా ఉద్యమకారుల వివరాలను సేకరించే క్రమంలో పారదర్శకత లోపించిందని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల హక్కుల సాధన కమిటీ కన్వీనర్, న్యాయవాది రావు అమరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈరోజు తెలంగాణ మలిదశ ఉద్యమకారుల హక్కుల సాధన కమిటీ కన్వీనర్ రావు అమరేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో హనుమకొండ అదాలత్ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా రావు అమరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ హైదరాబాద్‌లోనే కూర్చుని ఉద్యమంతో సంబంధం లేని వ్యక్తుల వివరాలను జాబితాలో చేర్చడం సరైన పద్ధతి కాదు. క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రతి గ్రామం, మండలం, జిల్లా వారీగా పరిశీలించి అర్హులైన ఉద్యమకారులను గుర్తించాలి అని, ప్రత్యేక తెలంగాణ కోసం రాజకీయ పార్టీలు, యువకులు, మహిళలు, కుల సంఘాలు మరియు సకల జనులు ఏకమై పోరాడారు. కాబట్టి గుర్తింపు విషయంలో కూడా ఎలాంటి పక్షపాతం ఉండకూడదు అని తెలియజేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని నిజమైన తెలంగాణ ఉద్యమకారుల వివరాలను, పేర్లను సేకరించడానికి మరికొన్ని రోజులు గడువు నిర్ణయించాం. సేకరించిన పేర్లను మొదటి విడత (ఫస్ట్ ఫేస్ ), రెండవ విడత (సెకండ్ ఫేస్ ) జాబితాలుగా వర్గీకరించి ప్రభుత్వంతో పాటు ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు సమర్పిస్తాం అని, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రతీ ఒక్కరికీ న్యాయం జరగాలని, అర్హులైన తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి తగిన గౌరవం అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు మట్ట రాజశేఖర్ రెడ్డి, కుసుమ లక్ష్మీనారాయణ, పుట్ట మహేందర్, రాజిరెడ్డి, సత్యనారాణ, స్వామి, కుయ్యాడ సారయ్య, సారంగపాణి, నరేందర్, విజయ్ కుమార్, కిషన్ సింగ్, రమ, రాజయ్య తదితర ప్రముఖ ఉద్యమకారులు పాల్గొన్నారు.

# శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన భద్రకాళి అమ్మవారు



హనుమకొండ జిల్లా ప్రతినిధి జులై 29 ( విజన్ ఆంధ్ర ), వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారి దేవాలయంలో శాకాంబరి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ అధికారులు వైభవంగా ఏర్పాట్లు చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచే సుమారు మూడు గంటలపాటు 150 క్వింటాళ్లకు పైగా కూరగాయలు, పండ్లతో అమ్మవారిని శాకాంబరి రూపంలో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ అపూర్వ అలంకరణలో భద్రకాళి అమ్మవారు భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. శాకాంబరి అలంకరణను తిలకించి అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, క్యూ లైన్లు, భద్రతా చర్యలు, తాగునీటి సౌకర్యాలు తదితర ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## భారీ వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - జిల్లా కలెక్టర్



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 29:(విజన్ ఆంధ్ర) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రాబోయే 3 రోజులు భారీ నుండి అతిభారీ వర్షాలు కురవనున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర మైతేనే ఇళ్ల నుండి బయటకు రావాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు,బుధవారం ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి వాగు వద్ద పారుతున్న వరద ప్రవాహాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. వంతెనలపై ఆంక్షలు: వంతెనలపై నుండి వరద నీరు పారే అవకాశం ఉన్నందున, వాహనదారులను మరియు కాలినడకన వచ్చేవారిని వంతెన దాటకుండా అధికారులు, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి నివారించాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రయాణాలు వద్దు: ద్విచక్ర వాహనదారులు, పశువుల కాపరులు పొంగిపొర్లుతున్న వాగులు/వంకల అవతలి వైపునకు వెళ్లకూడదని సూచించారు. సురక్షిత ప్రాంతాలకు తరలింపు: లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల వల్ల ఎదురయ్యే అత్యవసర సహాయం మరియు సమాచారం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది. కంట్రోల్ రూమ్ నంబర్: 8500844365 కార్యక్రమంలో తహశీల్దార్ రియాజ్ అలీ, పోలీస్ సిబ్బంది మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దండే విఠల్



కాగజ్‌నగర్, జూలై 29 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేదమంత్రాల నడుమ జరిగిన కళ్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు చేసి రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. రైతులకు మంచి పంటలు పండాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, రాష్ట్రంలో శాంతి, సామరస్యం నెలకొనాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ దండే విఠల్‌కు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి తీర్థప్రసాదాలు సమర్పించారు. ఆలయ విశిష్టతను వివరించి జ్ఞాపికను అందించారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఆలయాలు ప్రతీకలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల్లో ఐక్యతను, భక్తి భావాన్ని, సామాజిక స్ఫూర్తిని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మం, సేవా భావంతో ముందుకు సాగాలని, యువత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. ఆలయాల అభివృద్ధికి ప్రజలతో పాటు దాతలు కూడా సహకరించాలని కోరారు. మహోత్సవానికి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేదపండితులు వేదమంత్రాల నడుమ కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## ఇది ప్రజా ప్రభుత్వం అంటున్న స్థానిక ప్రజలు ....

**- 26 డివిజన్ లో డోర్ టు డోర్ కార్యక్రమం**



తిరుపతి, జులై 29 : తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువ అవుతున్న నేపథ్యంలో ఇది ప్రజా ప్రభుత్వం అని స్థానిక ప్రజలు నిరాజనాలు పలుకుతున్నారని తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ జేబీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నగరంలోని 26వ డివిజన్ పరిధిలో మూడవ క్లస్టర్ లో రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమ విజయాలపై డోర్ టు డోర్ కార్యక్రమం నియోజకవర్గ ఇన్చార్జ్ జేబీ శ్రీనివాస్ నేతృత్వంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్, తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీ కృష్ణారెడ్డి, శ్రీ తాతయ్య గుంట గంగమ్మ గుడి చైర్మన్ నైనా మహేష్ యాదవ్ పాల్గొన్నారు. జేబీ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ప్రతి ఇంటికి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంట్లో ప్రభుత్వం నుండి ఏదో ఒక లబ్ధి చేకూరడం జరిగిందని చెబుతుంటే ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కో క్లస్టర్ ఇంచార్జ్ కంకణాల రజినీకాంత్ నాయుడు , వార్డు అధ్యక్షులు భాస్కర్, జలపోతు చంద్ర, సుధాకర్ రెడ్డి, నాగ ప్రతాప్ దేవరాజు ఆచారి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, టిడిపి మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా, టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామదాసు ముని రామయ్య, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, ఎస్ కే డి నగర్ విజయ్ శంకర్, సూరి నారాయణరెడ్డి, 26వ డివిజన్ అధ్యక్షులు మోహన్ కుమార్, భారతి, వాణి పాల్గొన్నారు.

## నాటుసారా ముఠా గుట్టు రట్టు

**- అక్రమంగా నల్లబెల్లం, పటిక సరఫరా చేస్తున్న స్కార్పియో సీజ్..**

**- 600 కిలోల నల్లబెల్లం, 120 కిలోల పటిక పట్టివేత...**



కల్వకుర్తి, జూలై 29: నాటుసారా తయారీకి ముడిసరుకు సరఫరా చేస్తున్న అక్రమ ముఠాపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సంచలన దాడి చేశారు. స్కార్పియో వాహనంలో తరలిస్తున్న 600 కిలోల నల్లబెల్లం,120 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు.

**ఎలా పట్టుబడ్డారు?**

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కల్వకుర్తి టీంకు బుధవారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో సీఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వెల్దండ గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్ బేగంబజార్ గంజి నుండి అక్రమంగా నల్లబెల్లం మరియు పటికను కొనుగోలు చేసి, (ఏపీ 20 పి 0549) నెంబర్ గల స్కార్పియో వాహనంలో తరలిస్తున్న ఇస్లావత్ రాజును పట్టుకున్నారు.ఇతను తలకొండపల్లి మండలం మొగ్గి తండాకు చెందినవాడు.

**మన్ననూరులో సరఫరా ప్లాన్**

నిందితుడు మన్ననూరు గ్రామంలో నాటుసారా తయారు చేసే వ్యక్తులకు ఈ ముడిసరుకును సరఫరా చేయడానికి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, వాహనంలో 20 బస్తాల నల్లబెల్లం పొడి - 600 కిలోలు మరియు 120 కిలోల పటిక ఉన్నట్లు గుర్తించారు.


**నిందితుడి అరెస్ట్, సీజ్**

పోలీసులు నిందితుడు ఇస్లావత్ రాజును అరెస్ట్ చేశారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన స్కార్పియో వాహనంతో పాటు నల్లబెల్లం, పటికను కూడా సీజ్ చేశారు. నాటుసారా తయారీకి అడ్డుకట్ట వేసే దిశగా ఈ దాడి కీలకంగా మారిందని అధికారులు తెలిపారు.

ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి,సిబ్బంది జనార్దన్ రెడ్డి, సిద్ధార్థ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**నాటుసారాకు చెక్**

నల్లబెల్లం, పటిక నాటుసారా తయారీకి ప్రధాన ముడిసరుకులు. వీటిని అక్రమంగా సరఫరా చేసే ముఠాలపై ఎక్సైజ్ శాఖ నిఘా పెంచింది. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.







# గురువే కారకురాలైతే... గురుదేవో భవ అనేది ఎలా?

### 434 మార్కుల టాపర్‌ను "గొప్పోడివా?" అని అవమానించి కొట్టారు..

### గురు పూర్ణిమ ముందు రోజే విద్యార్థి ఆత్మహత్య..



అవమానంతో ఆత్మహత్య చేసుకున్న గద్వాల టాపర్ నేతిబొట్టు తరుణ్....

**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,జూలై 28, (విజన్ ఆంధ్ర)**

"గురుదేవో భవ... గురు సాక్షాత్ పరబ్రహ్మ" అని గురువులను దైవంగా పూజించే సంస్కృతిలో గురువే విద్యార్థి మరణానికి కారకురాలైతే సమాజం ఎవరిని నమ్మాలి? గురు పూర్ణిమకు ముందు రోజు ఉమ్మడి పాలమూరు జిల్లా గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఘటన విద్యా వ్యవస్థకు మాయని మచ్చగా మిగిలింది. జిల్లాలో 434 మార్కులతో రెండో ర్యాంక్ సాధించిన నేతిబొట్టు తరుణ్(17) ను "నువ్వేమైనా మంత్రి కొడుకువా, గొప్పోడివా?" అంటూ ఓ మహిళా లెక్చరర్ క్లాస్‌లో అవమానించారు. చెంపపై కొట్టారు.దీంతో క్లాస్ లో అంతా నవ్వారు. ఆ అవమానం తట్టుకోలేక కొత్తపల్లికి చెందిన తరుణ్ మంగళవారం ఇంటికి వెళ్లి, అమ్మానాన్న జమ్ములమ్మ దేవాలయానికి వెళ్లడంతో, నానమ్మ ఒక్కతే ఇంటి బయట ఉండడం గమనించి ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు.ఇంట్లో సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకున్నాడు.

**సూసైడ్ నోట్‌లో తరుణ్ ప్రశ్న:**

"ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి కానీ అవమానించకూడదు. ఒక్క సున్నిత మనస్కుడికి అవమానం జరిగితే ఎంత బాధపడతాడో ఆమెకు తెలియాలి. ఆమెపై చర్యలు తీసుకోవాలి. ఇది ప్రజలందరికీ తెలియాలనే నేను ఈ నిర్ణయం తీసుకుంటున్నాను"




**సమాజం అడుగుతున్న ప్రశ్నలు**

విద్యార్థి ఎదిగితే మొదట ఆనందించాల్సిన గురువే అవమానిస్తే, భవిష్యత్‌లో అధిక మార్కులు తెచ్చుకోవద్దనే సంకేతమా?.. జిల్లాలో 434 మార్కులతో 2వ ర్యాంక్ తెచ్చిన నేతిబొట్టు తరుణ్‌కు దక్కిన బహుమతి అవమానం, దెబ్బలు. గురువు అంటే విద్యార్థి విజయానికి మెట్లు వేసేవారు. కానీ ఇక్కడ గురువే ఆ మెట్లను విరగొట్టారు. రేపటి నుంచి టాపర్లు కూడా "మార్కులు ఎక్కువ వస్తే కొడతారేమో" అని భయపడాలా? విద్య అంటే పోటీ కాదా? ర్యాంకులు తెచ్చుకోవడం నేరమా? ఈ ప్రశ్నకు విద్యాశాఖ ఏం సమాధానం చెబుతుంది?

**గురు పూర్ణిమ రోజు ఒక గురువు వల్ల విద్యార్థి చనిపోతే, "గురువును దైవంతో సమానం" అని ఏ విధంగా చెప్పాలి?**

"గురుదేవో భవ, గురు సాక్షాత్ పరబ్రహ్మ" అని కాళ్లకు మొక్కే పవిత్ర రోజుకు ఒక రోజు ముందే ఇది జరిగింది. దైవంగా కొలవాల్సిన గురువే క్లాస్‌లో కొట్టి, "గొప్పోడివా?" అని హేళన చేస్తే... ఆ శ్లోకాలకు అర్థం ఏమిటి? గురు పూర్ణిమ రోజు పూజలు చేసే సమాజానికి ఆ లెక్చరర్ ఏ ముఖంతో సమాధానం చెబుతుంది? గురువు పేరుకు వచ్చిన ఈ మాయని మచ్చను ఎలా కడుగుతారు?

**సమాజంలో కిడ్నాప్‌లు, హత్యలు చూశాం. కానీ గురువు చేతిలో విద్యార్థి బలి కావడం చరిత్రలో నిలిచిపోయే చేదు నిజం.**

దొంగలు, రౌడీలు చేసే హత్యలు వేరు. కానీ కడుపులో బిడ్డలా చూసుకోవాల్సిన గురువు చేతిలో విద్యార్థి బలవ్వడం... ఇది విద్యా వ్యవస్థపైనే దాడి. ఇది ఒక్క తరుణ్ చావు కాదు. వేలాది మంది విద్యార్థుల మనసుల్లో గురువులపై ఉన్న నమ్మకం చావు. చరిత్ర ఈ రోజును "గురువు పేరుతో జరిగిన హత్య" గా గుర్తుపెట్టుకుంటుంది.

**435 మార్కులు వచ్చిన విద్యార్థితో పోల్చి తరుణ్‌ను చిన్నచూపు చూసిన ఘటన ప్రభుత్వ కళాశాలల్లో ఉపాధ్యాయుల ప్రవర్తనపై పెద్ద చర్చకు దారితీసింది.**

పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు సంబంధిత లెక్చరర్‌పై కఠిన చర్యలు డిమాండ్ చేస్తున్నారు...

# పునాదే గట్టిగా ఉంటే... భవిష్యత్ బలంగా ఉంటుంది

**- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యే లక్ష్యం..**

**- ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ..**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,జూలై 29, (విజన్ ఆంధ్ర)

విద్యార్థుల భవిష్యత్‌కు ప్రాథమిక విద్యే బలమైన పునాది. ఆ దశలో అందించే బోధన నాణ్యతే వారి ఉన్నత విద్యతో పాటు జీవిత విజయాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది అని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ అన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఆర్టీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్ ట్రైనింగ్ (××టు) కార్యక్రమాన్ని బుధవారం ఆయన కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరిశీలించారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల యస్.జి.టీ ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా డీఈఓ ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతో పాటు చదవడం, రాయడం, లెక్కించడం వంటి ప్రాథమిక నైపుణ్యాల్లో సంపూర్ణ ప్రావీణ్యం కల్పించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యా ప్రమాణాల పెంపులో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, వారు చూపే అంకితభావమే విద్యార్థుల అభ్యాస



ఫలితాలను నిర్ణయిస్తుందని తెలిపారు. శిక్షణలో భాగంగా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో అభ్యాస సామర్థ్యాల పెంపు, విద్యార్థి కేంద్రిత బోధనా విధానాలు, నిరంతర మూల్యాంకనం, సమర్థవంతమైన తరగతి గది నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి తరగతి గదిని విద్యార్థులు ఆనందంగా నేర్చుకునే అభ్యాస కేంద్రంగా తీర్చిద్దాలని డీఈఓ సూచించారు. కేవలం ఉపన్యాస పద్ధతిలో కాకుండా కార్యకలాపాల ఆధారిత బోధన, కథలు, పాటలు, ఆటలు, చిత్రాలు, బోధనా-అభ్యాస సామగ్రి వినియోగం ద్వారా బోధనను ఆసక్తికరంగా మార్చాలని కోరారు. విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రతి పాఠశాలలో ప్రతిరోజూ పఠన కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠ్యపుస్తకాలతో పాటు అదనపు పఠన సామగ్రిని కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారికి అదనపు బోధన, ప్రత్యేక తరగతులు, వ్యక్తిగత మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి కనీస అభ్యాస నైపుణ్యాలను తప్పనిసరిగా సాధించేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, విద్యార్థుల అభ్యాసంలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని సూచించారు. ఎస్‌సీఆర్టీ రూపొందించిన శిక్షణా మాడ్యూళ్లను ప్రతి ఉపాధ్యాయుడు పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి వాటిని తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని, ముఖ్యంగా ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తిచేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని డీఈఓ ఆదేశించారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలు మరింత మెరుగుపడి, ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# జీజీహెచ్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దండి

### నాణ్యమైన వైద్య సేవలతో ప్రజల విశ్వాసం పెంచాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జులై 29 విజన్ ఆంధ్ర**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్యాధికారులకు దిశా నిర్దేశం చేశారుబుధవారం అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి జిల్లా ప్రధాన ఆసుప్రత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవలు, మౌలిక



సదుపాయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.సదరం వేచి ఉండే గది, మందుల విభాగం, స్కానింగ్ విభాగం, ఆరోగ్యశ్రీ కౌంటర్, వృద్ధుల వార్డు, అత్యవసర వార్డు, శస్త్రచికిత్స గది, బయటి రోగుల విభాగం, ఆపరేషన్ గది, ఎన్ఎస్‌డీ క్లినిక్, పల్మనాలజీ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. మాతా శిశు సంరక్షణ కేంద్రం తరహాలో రోగులు, వారి వెంట వచ్చినవారు కూర్చునేందుకు తగిన బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**పరిశుభ్రత, మరమ్మత్తులపై ఆదేశాలు**

ఆస్పత్రిలో ఎక్కడైనా నీటి కారడాలు, మరమ్మత్తులు అవసరమైన చోట్ల వెంటనే పనులు పూర్తి చేయాలని వైద్య మౌలిక సదుపాయాల సంస్థ అధికారులను ఆదేశించారు. పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, కనీస సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వద్దని సూచించారు.నేలపని, పాడైన గోడల మరమ్మత్తులు, తాగునీటి సరఫరా, నీటి నిల్వ, విద్యుత్ పనులు, లోపలి రహదారులు, వైద్యుల గదుల్లో అవసరమైన సౌకర్యాలు, అదనపు మంచాల ఏర్పాటు వంటి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షపు నీరు ఆస్పత్రి ప్రాంగణంలో నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చాలని, కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారురోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సేవలు అందించాలని, ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా ప్రతి వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు

**ఆస్పత్రి నిర్వహణపై సమీక్ష**

తనిఖీ అనంతరం ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వీరారెడ్డి గదిలో అదనపు పర్యవేక్షకురాలు డాక్టర్ నవీనా, ఇతర వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వివరాలు, వారు పనిచేస్తున్న సంస్థలు, ఆస్పత్రి ఆదాయం-ఖర్చులు, నిధుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి నెల, మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది ప్రాతిపదికన ఆదాయం-ఖర్చుల అంచనా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రికి సంబంధించిన భవనాల అద్దెలు, అంబులెన్సులు, విద్యుత్ ఉత్పత్తి యంత్రాలు, వైద్య పరికరాలు, చల్లగాలి యంత్రాలు, నిఘా కెమెరాలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వీరారెడ్డి, అదనపు పర్యవేక్షకురాలు డాక్టర్ నవీనా, వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ పల్లెటూరి స్వచ్ఛమైన ప్రేమకథ 'మేలి ముసుగు' మూవీ పోస్టర్ ఆవిష్కరణ

**సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ "సబ్జక్ట్ ఎమ్" చిత్రం**

హైదరాబాద్ జూలై 2026 విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్) : తెలంగాణ పల్లెటూరి ప్రేమకథ నేపథ్యంలో రూపొందుతున్న 'మేలి ముసుగు' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ సందర్భంగా చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సంచాలకుడు భాషా సాంస్కృతిక శాఖ డాక్టర్. ఏనుగు నరసింహారెడ్డి, ఐఏఎస్, శనివారంనాడు హైదరాబాద్ లోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ లో అందరి సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరించి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాన్ని ప్రతిబింబించే ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని నరసింహారెడ్డి, ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ 'మేలి ముసుగు' చిత్రానికి 'విప్లవ్ కుమార్' దర్శకత్వం వహించడంతో పాటు తన బృందంతో కలిసి నిర్మించారు. ప్రధాన పాత్రలలో అలెక్స్ మోసెస్, వరుణ్ గుళ్లపల్లి నటిస్తుండగా, మహారాజ్ కృష్ణ, వల్లపు దాస్ శ్రీను, హర్ష, లక్ష్మి, ఆనంద్, నికిత తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రముఖ డైరెక్టర్, యాక్టర్ అడ్ల సతీష్ కుమార్ తో పాటు పలువురు సినీ, సాహిత్య, సాంస్కృతిక ప్రముఖులు పాల్గొని చిత్రబృందానికి శుభాభినందనలు తెలియజేసారు. తెలంగాణ నేటివిటీ, పల్లెటూరి భావోద్వేగాలు, స్వచ్ఛమైన ప్రేమకథను ఆవిష్కరించే 'మేలి ముసుగు' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుందని చిత్ర దర్శకుడు విప్లవ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా రవీంద్రభారతి రెండవ అంతస్తు పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ లో రైటర్ డైరెక్టర్ ఎడిటర్ 'అనురాగ్' దర్శకత్వంలో




రూపొందించిన చిత్రం "సబ్జక్ట్ ఎమ్" సస్పెన్సు క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఫస్ట్ ప్రివ్యూ ను శనివారంనాడు సాయంత్రం 'సినీవారం' కార్యక్రమంలో చిత్రీకరించారు. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుండి విశేష స్పందన లభించింది. చిత్ర నిర్మాణంలో లోని అనుభవాలను "సబ్జక్ట్ ఎమ్"చిత్ర బృందం అతిథులు, ప్రేక్షకులతో పంచుకుంది. త్వరలోనే ఈ చిత్రాన్ని యూట్యూబ్, ఇతర మాధ్యమాలలో రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర దర్శకుడు అనురాగ్ ఈ సందర్భంగా తెలిపారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.